ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 113 పేజీలు: 12 వెల: 8.00

సింధుజలాల ఒప్పందంపై పాక్ విషప్రచారం
బాలీవుడ్ నటుడు ముకుల్‌దేవ్ కన్నుమూత
9లో

## టెక్నాలజీ అభివృద్ధికి ఎపి మార్గం
### పి-4 ద్వారా పేదరిక నిర్మూలనే లక్ష్యం
### డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆదర్శంగా ఎపి
### 2047కు 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్
### ప్రతి కుటుంబానికి డిజిటల్ పాస్‌బుక్ విధానం
### పురోగతి కొలతకు 523 సూచికలు
### నీతిఆయోగ్ సమావేశంలో సిఎం చంద్రబాబు


శనివారం న్యూఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీతో సిఎం చంద్రబాబు కరచాలనం. చిత్రంలో తమిళనాడు సిఎం స్టాలిన్ ఉన్నారు.

# వికసిత్ భారత్‌తో స్వర్ణాంధ్ర

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 2029నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. నీతి ఆయోగ్ భేటీలో వికసిత్ భారత్2047, స్వర్ణాంధ్రపై సీఎం చంద్రబాబు నివేదిక ఇచ్చారు. పహల్గాందాడిని ఖండిస్తూ, ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం, ఎన్డీఏ ప్రభుత్వంలో సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్రాభివృద్ధికి దోహదపడే వివిధ అంశాలను తన ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. పీ 4 ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని అన్నారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పిన పలు అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ కొనియాడారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని ప్రధాని సూచించారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు వెల్లువెత్తాయి. ఏపీలోని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్‌లో ప్రస్తావించారు. 2.4ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నామని

>>2

### రాష్ట్రాభివృద్ధికి కేంద్రం
## సంపూర్ణ సహకారం
### కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ
### రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని వినతి
### విభజన చట్టం సవరణకు అమిత్‌షా హామీ

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించేందుకు సుముఖతను వ్యక్తం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన శనివారం ముగిసింది. ఆయన తిరిగి నేరుగా తన సొంత నియోజకవర్గం కుప్పం వెళ్ళేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో మీడియాతో మాట్లాడుతూ తన రెండు రోజుల పర్యటన విజయవంతమైందన్నారు. ఈ పర్యటనల్లో భాగంగా నిన్ననే ఏడుగురు మంత్రులను కలిసానన్నారు. అందుల్లో కీలకంగా పలు అంశాలను వారి దృష్టికి తీసుకుని వెళ్ళానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ మేరకు విభజన చట్టాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి హోంమంత్రిత్వ శాఖ కార్యాల యంలో అమిత్‌షా అధ్వర్యంలో రాష్ట్రం లోని శాంతిభద్రతలు, కొత్త నేర, న్యాయ చట్టాల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లా డారు. అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులేమీ సమకూర్చడం లేదని, కానీ కొందరు మూర్ఖులు మాత్రం రాష్ట్రంలో ఏ చిన్న పని జరగకపోయినా అంతా అమరావతిలో ఖర్చు పెడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.


కేంద్రహోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపిక అందచేస్తున్న సిఎం చంద్రబాబు

>>2



## కారు-లారీ ఢీ నలుగురు మృతి
### కడప జిల్లాలో ఘోర ప్రమాదం
### పలువురికి తీవ్రగాయాలు

**కడప ,మే 24, ప్రభాతవార్త బ్యూరో :** కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం, గువ్వల చెరువు ఘాట్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడంతో నలుగురు అక్కడికక్కడే చనిపోగా, మిగిలిన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బెంగళూరు నుంచి స్వంత గ్రామమైన బద్వేలు ప్రాంతానికి వస్తుండగా గువ్వల చెరువు ఘాట్ వద్ద వేగంగా వచ్చిన లారీ కారును ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాంత్ రెడ్డి(32)బసినేని శిరీష (30), రిషి కేశవరెడ్డి (9), సాయి హర్షిణి (11) అనే నలుగురు మృతిచెందగా స్వర్ణ, శశి, త్రిషిక ప్రాణాపాయం

>>2



## వల్లభనేని మళ్లీ జైలుకు
### రెండు రోజుల పోలీసు కస్టడీ పూర్తి

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** వల్లభనేని వంశీ రెండు రోజుల కస్టడీ నేటితో పూర్తయ్యింది. నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో పోలీసులు వంశీని విచారించారు. అనంతరం వంశీని కంకిపాడు పోలీసులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల తర్వాత వల్లభనేని వంశీని విజయవాడ సబ్

>>2

## కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి
### విజయవాడలో విషాదం

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త:** విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలో శనివారం ఉదయం విషాదం జరిగింది. చంద్రబాబు కాలనీలోని ఓ భవనంలో కరెంట్ షాక్ తగిలి ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో దంపతులతోపాటు ఇంటికొచ్చిన బంధువు కూడా ఉన్నారు. స్థానిక వివరాల మేరకు నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 8 గంటల 20 నిమిషాలకు భార్య ముత్యా లమ్మకు కరెంటు షాక్ తగిలి కుప్పకూలిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న భర్త ఆమెను కాపాడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అతనూ ప్రమాదానికి గురయ్యాడు. వీరిద్దరిని చూసిన వారి బంధువు వారిని కాపాడే ప్రయత్నం

>>2

# ఇదేనా మర్యాద! లేదా కృతజ్ఞత?



### చలనచిత్రపరిశ్రమపై డి.సిఎం పవన్ అసంతృప్తి
### యేడాదైనా పరిశ్రమవర్గాలు సిఎంను కలిసాయా?
### టిక్కెట్ ధరలు పెంచడానికైతే వస్తారా?
### ఇక సంఘటితంగా వస్తేనే సానుకూల చర్యలు

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని ఏపీ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేసారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుసినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే మీరు ఏలా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు, ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఆమేరకు ప్రకటన విడుదల చేసింది. ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాద పూర్వకంగా కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్రరంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రాలేదు. అందరూ కలసి రావాలి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించినా సానుకూలంగా స్పందించలేదు. గత ప్రభుత్వ ఛీత్కారాలు తెలుగు సినిమా రంగంలోని అగ్రనటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకొని ఇక్కట్ల పాల్జేసిందో తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయినట్లున్నాయి. రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇవ్వడం తోపాటు, సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదు అని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. కక్షసాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో

>>2

# చివరాకు దాకా కొంటాం

### సమస్య ఎక్కడ ఉంటే అక్కడికి మంత్రులం వెళ్తున్నాం
### రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు
### రైతులతో ముఖాముఖిలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి
### పొగాకు మండెలను పరిశీలించిన మంత్రులు

**మార్టూరు, మే24, ప్రభాతవార్త:** రైతులెవరు అధైర్య పడవద్దని అండగా మేము ఉంటామని చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటామని నల్లబర్లీ పొగాకు రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రిగొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. శనివారం బాపట్ల జిల్లా మార్టూరుమండలం ఇసుక దర్శిలోని టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో పొగాకు రైతులు, ఐటీసీ కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నేతలతో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, విజయ్ కుమార్, దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ కమీషనర్ ఢిల్లీ రావు, మార్కెటింగ్ కమీషనర్ సునీత, టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, టొబాకో బోర్డు ఈడీ విశ్వశ్రీ, మార్క్‌ఫెడ్ రిక్రూట్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ కిషోర్, ముఖాముఖి నిర్వహించారు. తొలుత సురవరపల్లి సమీపంలోని నేషనల్ హైవే వద్ద పంట పొలాల్లోనే బల్లి మండెలను మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. అనంతరం మార్టూరు పట్టణంలోని నాగరాజుపల్లి రోడ్డులో గల ఎంఎల్‌పీ మద్ది లక్ష్మయ్య ఆగ్రో ప్రొడక్ట్స్ ఇండస్ట్రీని సందర్శించారు. మాకు గ్రేడింగ్, ప్యాకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖాముఖిలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలు, ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కంపెనీలు రైతుల శ్రేయస్సు కోసం పని చేయాల్సిన స్పష్టం చేశారు. నల్లబర్లీ పొగాకు మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగానికి అండగానిలవాల్సిన బాధ్యత కంపెనీలదేనని పేర్కొన్నారు. రైతులు సంతోషంగా ఉండడం కంపెనీలు నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. గతంలో పొగాకుకు మంచి ధరలు పలకడంతో అటు రైతులను ప్రోత్సహించేందుకు కంపెనీలు ఊరూరా తిరిగి రైతులను పొగాకు సాగు చేసేలా ప్రోత్సహించాలని గుర్తు చేశారు. గతంలో వేల కోట్లు లాభాలు ఆర్జించిన కంపెనీలు ఇప్పుడు నష్టాల్లో ఉన్న రైతులను ఇబ్బందులు పెట్టడం కరెక్ట్ కాదన్నారు. కంపెనీలు పద్ధతి మార్చు కోవాల్సిందేనని పంట కొనుగోలు చేయకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. 7.5 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి


శనివారం పొగాకు మండెను పరిశీలిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి తదితరులు

>>2

### పోలవరం-బనకచర్లపై
# ఎపికి కేంద్రం మద్దతు!
### కేంద్రజలశక్తిమంత్రితో చర్చించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి మద్దతు లభించే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. ఈ దిశలో ఏపీ జలవనరుల శాఖ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కేంద్ర జలశక్తిశాఖతో సమన్వయం చేసుకుంటుందని ఇరిగేషన్ మంత్రి డాక్టర్ నిమ్మలరామానాయుడు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు కేంద్ర జలసంఘానికి ప్రీఫీజిబిలిటీ నివేదిక సమర్పించినట్లు వివరించారు. ప్రాజెక్టు ప్రాథమిక స్వరూపం, హైడ్రాలజీ ఎంత వ్యయం అవుతుంది? కొత్త ఆయకట్టు ఎంత? స్థిరీకరణ ఎంత? పెట్టుబడి రాబడి నిష్పత్తి వంటి అంశాలను నివేదికలో పొందుపర్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక, జల్‌శక్తి మంత్రులతో భేటీలోనూ ప్రాజెక్టుకు మద్దతు కోరారు. కేంద్ర జలసంఘం నివేదికను పరిశీలించాక రాష్ట్ర అధికారులతో చర్చించనుంది. ఆ తర్వాత కేంద్ర జల సంఘంలోని డైరెక్టర్ల సమావేశం పీఎఫ్‌ఆర్‌ను ఆమోదించనుంది. అనంతరం పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. జలవనరులశాఖ జూన్ నెలాఖరుకు లేదా జులై ప్రారంభానికి డీపీఆర్ సమర్పించాలనే లక్ష్యంతో ఆ ప్రక్రియనూ ప్రారంభించింది. పోలవరం నుంచి 23 వేల క్యూసెక్కుల నీటిని మళ్లించేలా ప్రాజె క్టును 3 సెగ్మెంట్లుగా పీఎఫ్‌ఆర్‌లో

>>2

# బెజవాడలో బాంబు బెదరింపులు
### బీసెంట్‌రోడ్, రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

**విజయవాడ, మే 24, ప్రభాతవార్త:** నగరంలో బాంబు కలకలం రేగింది. బీసెంట్ రోడ్‌కు బాంబ్ బెదిరింపు కాల్ వచ్చింది. కంట్రోల్ రూంకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి బాంబ్ ఉన్నట్లు బెదిరించాడు. దీంతో వెంటనే పోలీసులు అప్రమత్త మయ్యారు. పోలీసులు, బాంబు స్క్వాడ్ బీసెంట్ రోడ్‌లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బీసెంట్ రోడ్‌లోని షాపులు, తోపుడు బండ్లను బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేసింది. అయితే ఎక్కడా బాంబ్ ఉన్న ఆనవాళ్లు లేక పోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి బాంబు లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం నుంచి యధావిధిగా బీసెంట్‌రోడ్‌లో వ్యాపారాలకు అనుమతి ఇచ్చారు పోలీసులు. అలాగే కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫోన్‌కాల్‌పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు చేశారు అనేదానిపై పోలీసులు ఆరా

>>2



### రెండు రోజుల్లో రాష్ట్రానికి
# రుతుపవనాలు..
### ఇప్పటికే కేరళను తాకిన 'నైరుతి'
### కోస్తాంధ్ర, సీమకు భారీ వర్షసూచన

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అదేసమయంలో లక్షద్వీప్, తమిళనాడు, కర్నాటక, ఈశాన్య రాష్ట్రాల్లోకి రుతపవనాలు ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. అక్కడి నుంచి రెండు, మూడు రోజుల్లో ఎపిలోకి విస్తరించే అవకాశ ముంది. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచిరాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**తీవ్ర అల్పపీడనం:** అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్‌గోవా తీరానికి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ నేటికి వాయుగుండంగా బలపడనుంది. ఇది మరింత బలపడేందుకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, గాలులు, ఇతర పరిస్థితులు అనుకూలిస్తుండటంతో పశ్చిమతీరంలో గుజరాత్, గోవా రాష్ట్రాల్లో ఆదివారం వరకు కర్నాటకలో ఈనెల 27 వరకు, మహారాష్ట్రలో ఈనెల 25న, తమిళనాడులో 25, 26 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా. జూన్ 5వరకు కోస్తాంధ్రతోపాటు రాయల సీమలోనూ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశ ముంది. నేడు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకి

>>2



శనివారం న్యూఢిల్లీలో జరిగిన నీతిఆయోగ్ సమావేశంలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు తదితరులు

# వికసిత్ భారత్‌తో స్వర్ణాంధ్ర

>> వివరించారు. అదేవిధంగా రాష్ట్ర వనరుల సద్వినియోగంపైనా సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్‌లో తెలిపారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఒప్పందం.. కర్నూలులో డ్రోన్ సిటీ ప్లాన్లను ప్రజెంటేషన్‌లో ప్రత్యేకంగా వివరించారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు చేసినట్లు ప్రజెంటేషన్‌లో సీఎం వివరించారు. మాతృత్వ సెలవులను 180 రోజులకు పెంచినట్లు సీఎం వెల్లడించారు. ప్రతి జిల్లా, నియోజకవర్గంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు, రాష్ట్ర పురోగతిని కొలిచేందుకు 523 కీలక సూచికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త వచ్చేలా ప్రభుత్వ విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో విశాఖను తీర్చిదిద్దనున్నట్టు సీఎం వెల్లడించారు. విశాఖకు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించిన సీఎం, విశాఖ మోడల్ విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. అమరావతి, తిరుపతి, గోదావరి, కర్నూలుకు విశాఖ మోడల్ విస్తరిస్తామన్న సీఎం, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్ సిటీ ప్లాన్లను ప్రజెంటేషన్‌లో ప్రత్యేకంగా వివరించారు. కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానం తెస్తామని, మాతృత్వ సెలవులను 180 రోజులకు పెంచినట్లు సీఎం తన ప్రజెంటేషన్‌లో వెల్లడించారు. కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త వచ్చేలా విధానాలు రూపొందిస్తున్నామని వివరించారు. 2029 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పని చేస్తున్నామని, పీ4 మోడల్ ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సహాయం చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్2047 దిశగా పురోగతిని వేగవంతానికి 3 కమిటీలు ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. పీపీపీ ప్రాజెక్టుల కోసం సెంట్రల్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌పై కమిటీ ప్రతిపాదించారు. అదేవిధంగా వృద్ధాప్యం, తక్కువ సంతానోత్పత్తి వంటి సవాళ్లపైనా అధ్యయనానికి, సాంకేతికతతో నడిచే పాలనపై దృష్టి పెట్టడానికి ఒక కమిటీ వేయాలని సూచించారు. ఏపీ గ్రోత్ బ్లూ ప్రింట్‌పై నీతిఆయోగ్ వేదికగా ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై ప్రశంసల వర్షం కురిపించిన ప్రధాని, ఏపీ సంస్కరణలను అన్ని రాష్ట్రాలు పరిశీలించి, అధ్యయనం చేయాలన్నారు.

**3వ స్థానానికి భారత ఆర్థిక వ్యవస్థ:** భారతదేశం ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో 10వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందని, త్వరలోనే 3వ స్థానానికి వెళ్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జల జీవన్ మిషన్ వంటి జాతీయ సంస్కరణలు అభివృద్ధికి దోహదం చేశాయని వివరించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్దిని ఏపీ ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నార. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధి చేపడుతున్న కార్యక్రమాలను కూడా సీఎం చంద్రబాబు సమావేశంలో లేవనెత్తారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, అమరావతి రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలో బయోమెడికల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ద్వారా టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి ఏపీ మార్గం వేస్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నన్సులో గూగుల్ ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్ బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్ హబ్, ఎఐ ఆధారిత పాలన ద్వారా రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయ పడ్డారు. సర్క్యులర్ ఎకానమీ, అభివృద్ధి వికేంద్రీకరణ, మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా సమగ్రాభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ సాధిస్తోందని అన్నారు.

జీడీపీ, పాపులేషన్ మేనేజ్మెంట్, టెక్నాలజీ రాష్ట్రాభివృద్ధికి ఉపకరించే మూడు కీలక అంశాలను గురించి సీఎం చంద్రబాబు సమావేశంలో ప్రస్తావించారు. పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి పెట్టి, పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్ కు మద్దతుగా ఉండటం ద్వారా జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలు జనాభా లేమి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని, తద్వారా అభివృద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. భారతదేశానికి ఉన్న జనాభా కలిసొచ్చే అంశమని అన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అదే విధంగా కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వినియోగంతో పాలనలో వేగం పెంచడమే కాకుండా, పౌర సేవలను విరివిగా అందించవచ్చని అన్నారు.

**డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఏపీ ఆదర్శం**

స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయ అభివృద్ధికి దోహద పడేలా ఆదర్శంగా నిలుస్తుందని సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 100 ఏళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా...మార్గదర్శకత్వం వహించేలా ఏపీ ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారుఏప్రిల్ 22న ఫహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులు అర్పించారు, సాయుధ బలగాలు చేపట్టిన "ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా.. నాయకత్వం వహించారని సీఎం ప్రశంసించారు.

**సీఎం చంద్రబాబు బ్లూ ప్రింట్‌పై పీఎం ప్రశంసలు**

నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ బ్లూ ప్రింట్ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని, సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.

# సంపూర్ణ సహకారం

>> కొందరు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అమరావతివల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి?రాజధాని కోసం రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ?హైదరాబాద్ వంటి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కు అవసరం లేదా? తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇవన్నీ మరిచిపోయి మూర్ఖంగా మాట్లాడే వ్యక్తులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజధానికి భూములు త్యాగం చేసేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోరని భరోసా ఇచ్చాం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో శాంతిభద్రతలు,నేర నివారణలో టెక్నాలజీ వినియోగం,కొత్త నేర న్యాయ చట్టాలపై సమీక్ష జరిగిందని చంద్రబాబు వివరించారు. ఇప్పటి వరకు 24 రాష్ట్రాలపై ఆయన సమీక్షించారని,అందులో భాగంగానే ఏపీలోని పరిస్థితులపై చర్చించారని తెలిపారు. రాయలసీమ లోని ప్రముఖ సేవా సంస్థ ఆర్‌డీటీకి విదేశీ నిధులు ఆగిపోయిన విషయం గురించి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పేదలకు విశేష సేవలందిస్తున్న ఆ సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ లేఖ అందించానని, దాన్ని పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.నీతి ఆయోగ్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళిక వివరించామన్నారు.ఇందుకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారన్నారు.రాష్ట్రాభివృద్ధి సహకరిస్తామని వాగ్దానం చేసారన్నారు.

# రెండు రోజుల్లో రాష్ట్రానికి రుతుపవనాలు..

>> నాద, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, అలాగే అనకాపల్లి, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యాన పంటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, తిరుపతి, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 27 నాటికి అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత రెండు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశముందని ఐఎండి తెలిపింది. బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 30 నుంచి 32 డిగ్రీల మధ్యలో నమోదవుతుండటంతో వాయుగుండంగా బలపడవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రిడిక్షన్‌కు చెందిన మోడల్ సూచిస్తోంది. ఈ ప్రభావంతో ఈ నెల 27న పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండి పేర్కొంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో .. ఈనెల 27 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది.

**కోస్తాంధ్రలో, రాయలసీమలో వర్షాలు..** జూన్ 5 వరకు కోస్తాంధ్రతోపాటు రాయలసీమలోనూ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, అలాగే అనకాపల్లి, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చునని వాతావరణశాఖ ముందుగానే వెల్లడించింది.వర్షాలు బాగానే కురిసాయి.వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యాన పంటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

# చివరాకు దాకా కొంటాం

>> అయిందని, ప్రతి చివరి ఆకు వరకు కొనుగోలు చేయాల్సిన స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నాయకుడు లోకేష్ ఎప్పుడు లేని విధంగా దీనిపై ఎక్కువగా దృష్టి పెట్టారన్నారు. అవసరమైతే ప్రభుత్వమే డబ్బులు వెచ్చించి రైతులను ఆదుకోవాలనే భావనలో ముఖ్యమంత్రి ఉన్నారని చెప్పారు. అందుకే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఇటు ప్రభుత్వం రైతులు అటు వ్యాపారులు అందరం కూర్చుని ముఖాముఖిగా చర్చిస్తే సమస్యను పరిష్కరించవచ్చనే భావనలో తమ ప్రభుత్వం ఉందని అందుకే ఈ సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. పంటల మార్పిడికి రైతులు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రస్తుతం జరిగిన మీటింగ్ చాలా ప్రాధాన్యత కలదన్నారు. కాబట్టి దీనిపై వ్యాపారస్తులు సీరియస్‌గా దృష్టి పెట్టి రేపటి నుండి కొనుగోలు మొదలు పెట్టాలన్నారు. లేదంటే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో మీటింగ్ ఉంటుందని అదే జరిగితే చాలా సీరియస్‌గా ఉంటుందని మంత్రి అచ్చెన్న వివరించారు. కాబట్టి కంపెనీలు పరిస్థితి అంత వరకు తెచ్చు కోకుండా కంపెనీలు కొనుగోలు చేసేలా వ్యవహారించాలని కోరుతున్నానని చెప్పారు. నేను రైతులకు మాట ఇస్తున్న మొదటి గ్రేడ్‌కు క్వింటాకు రూ.12వేలు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రతి రైతు పండించిన చివరి ఆకు వరకు కొనుగోలు చేపిస్తామని హామీ ఇస్తున్నామన్నారు. రైతులు ఎవ్వరు కూడా ఆవేదనలో ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతన్నల ప్రభుత్వం అన్నారు. మీరు రైతులను ఆదుకుంటే ప్రభుత్వం నుండి మీకు ఏ విధంగా సహాయం అందించాలో అందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. అవసరమైతే ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి రైతులను పరిశ్రమలు ఆదుకుంటామన్నారు. రైతుల వద్ద నిల్వ ఉంటే దెబ్బతినే అవకాశం ఉందని మీరే కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయాలన్నారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకుండా గతంలో ఇచ్చిన ధరలు కల్పించకుండా బయర్స్ కంపెనీలు మమ్మల్ని దారుణంగా నష్టం వచ్చేలా చేసి మోసం చేశారంటూమంత్రుల వద్దముఖాముఖిలో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఒక్క పర్చూరు నియోజకవర్గంలోనే వెయ్యికోట్ల రూపాయల విలువ చేసే పొగాకు నిల్వలు ఉండిపోయాయంటూ మంత్రులు దృష్టికి తీసుకువచ్చారు. రెండురూపాయలు వడ్డి లెక్కన అప్పులు తెచ్చి 36 లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పొగాకు పంటను సాగు చేశామన్నారు. కాని నేడు అసలు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చొరువ చూపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మీరు పండించిన వైట్ బ్లాక్ బర్లీ పొంగాకునంత మేమే కొంటామని ఇతర కంపెనీలకు ఇవ్వవద్దంటూ తమతో ఒప్పందం కుదుర్చుకున్న ఐటీసీ కంపెనీలు ఇప్పుడు గిట్టుబాటు ధరలు కల్పించకుండా చేతులెత్తేసి తమని నిట్టనిలువునా ముంచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒక్క సారి తమను ప్రభుత్వం ఆదుకుంటే ఇక రాబోయే కాలంలో తాము పొగాకు పంటలు వేయమని ఈ మాయదారి కంపెనీలను తాము నమ్మమంటూ మంత్రుల ఎదుట రైతులు వాపోయారు.

# ఇదేనా మర్యాద! లేదా కృతజ్ఞత?

>> తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా? ఎన్నిక లకు ముందు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందినవారి చిత్రం విడుదలైనప్పుడు సైతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డవారు ఇబ్బందిపడకూడదు అనేదే కూటమి ప్రభుత్వ విధానం. తెలుగు సినిమా రంగంవారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధరపెంచమని కోరడం ఎందుకు? అం దరూ కలసివచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా తెలిపారు. అధునాతన సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్ కల్యాణ్ యోచిస్తున్నారు. పరిశ్రమ హోదా కల్పించడంతోనే సరిపుచ్చకుండా యువతలోను, ఇప్పటికే చిత్ర రంగంలో ఉన్నవారికీ ఎప్పటికప్పుడు నైపుణ్యాల అభివృద్ధి కోసం అవసరమైన శిబిరాలు, సెమినార్లు, సింపోజియమ్స్ లాంటివి ఆంధ్ర ప్రదేశ్ లో విరివిగా నిర్వహిస్తారు. సినిమా రంగంలో స్టూడియో నుంచి సినిమా హాల్ వరకూ ఉండే విభాగాలలో గుత్తాధిపత్యం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తేనే పెట్టుబడులు పెరిగి పరిశ్రమగా వృద్ధి చెందుతుంది. ఈ దిశగానే పవన్ కల్యాణ్ ఆలోచన చేశారు. కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్మెంట్ పాలసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధికి బాటలు వేస్తున్నారని డీ.సీఎంవో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

# కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి

>> చేయగా అతడికి కరెటంట్ షాక్ కొట్టింది. దీంతో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుల్లో ఒకరు ముత్యాలమ్మగా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బెజవాడలో బాంబు బెదరింపులు

>> తీస్తున్నారు. విజయవాడ బీసెంట్ రోడ్డులో బాంబులు పెట్టామని, మరికాసేపట్లో అవి పేలే అవకాశం ఉందని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పడి బందర్ రోడ్డు నుంచి ఏలూరు రోడ్డు వరకు కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. బీసెంట్ రోడ్డులు షాపులతో పాటు, తోపుడ బండ్లు కూడా ఎక్కువగా ఉంటాయి. దీంతో ప్రతీ బండిని బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. అయితే బాంబు ఉన్నట్టు ఎటువంటి ఆనవాళ్లు కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. బీసెంట్ రోడ్డులో బాంబు లేదని ఊరిపీల్చుకున్న పోలీసులకు మరో బాంబు బెదిరింపు కాల్ ఉలిక్కిపడేలా చేసింది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టామంటూ ఓ ఆగంతకుడు కంట్రోల్ రూమ్‌కు కాల్ చేశాడు. హిందీలో మాట్లాడటంతో అప్రమత్తమైన జీఆర్‌పీ, సీఎస్‌డబ్ల్యూ, బాంబు స్క్వాడ్ బృందాలు రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర లాతూర్ నుంచి కాల్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. బాంబు పెట్టినట్లు చెప్పిన సదరు ఆగంతకుడు ఆ తరువాత ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాంబు బెదిరింపు కాల్ నేపథ్యంలో స్టేషన్‌లో ప్రయాణికులను, ప్లాట్ ఫామ్‌లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

## కారు-లారీ ఢీ: నలుగురు మృతి

>> నుంచి బయటపడ్డారు.బద్వేలులో జరుగుతున్న జాతర కార్యక్రమానిని బంధువులంతా శనివారం ఉదయం బెంగుళూరు నుంచి బద్వేలుకు వచ్చేందుకు సిద్దమయ్యారు. అయితే గువ్వలచెరువు మూడవ మలుపు వద్దకు రాగానే అధిక లోడుతో ఉన్న లారీ వేగంగా వచ్చి కారును ఢీకొన్న వెంటనే లారీ కారుపై వాలిపోయింది. కారునుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న ఏడుగురు తీవ్రంగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి నలుగురు వ్యక్తులు చనిపోయినట్లు నిర్ధారణ కాగా మిగిలిన వారిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. దాదాపు రెండు గంటల పాటు శ్రమించి కారులో ఉన్న మృతదేహాలను తీయగా కొంతమంది కొన ఊపిరితో ఉండడంతో వారిని రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు సంఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్‌కు చేరుకుని మృతుల బంధువులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జరిగిన సంఘటన విషాదకరమని, విచారణ చేయిస్తామని మంత్రులు అన్నారు.

# థియేటర్ల బంద్ లేదు..

## ప్రచారాన్ని ప్రేక్షకులు నమ్మొద్దు

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ,టీజీ రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ కానున్నాయన్న ప్రచారాన్ని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఖండించింది.ప్రస్తుతానికి అటువంటి ఉద్దేశమేది లేదని తెల్చిచెప్పింది థియేటర్ల బంద్ ఏమీ ఉండదని, యథావిధిగానే షోలు కొనసాగుతాయని తాజాగా స్పష్టం చేసింది. థియేటర్లకు కూడా పర్సెంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ నేపథ్యంలో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో నిర్మాతలు శనివారం ఉదయం ఫిల్మ్ చాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అగ్ర నిర్మాతలు దిల్ రాజు, నాగవంశీ, మైత్రి రవి, సుధాకర్ రెడ్డి, సురేశ్ బాబు, బెల్లంకొండ సురేష్, ఏఎం రత్నం, రాధా మోహన్, స్రవంతి రవికిషోర్, బాపినీడు తదితరులు హాజరయ్యారు.



శనివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

# విశాఖ ఎల్టిటి ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదరింపు

## డాగ్,బాంబు స్క్వాడ్, సివిల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీస్ బృందాల తనిఖీలు

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త:** విశాఖ ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ లో బాంబు పెట్టినట్లుగా కాల్ రావడం తీవ్ర కలకలం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ముంబై నుంచి విశాఖ వచ్చే ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉన్నట్లు ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్టీటీ చివరి స్టాప్ విశాఖ రైల్వేస్టేషన్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలు మొత్తాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్2 బోగీలో అనుమానిత బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగ్‌ను కూడా సెర్చ్ చేయగా బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. ఈ ఆపరేషన్‌లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ బృందాలు కలిసి ట్రైన్‌ను మొత్తాన్ని పరిశీలించారు. ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. చివరకు బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. చాలా రష్‌గా ఉన్న ట్రెయిన్‌లో ఇలాంటి కాల్ రావడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే బ్యాగును మరిచిపోయిన వ్యక్తి యూపీకి చెందిన శ్రీరామ్‌గా గుర్తించారు.అలాగే ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై పోలీసులు దృష్టిసారించారు.

# వల్లభనేని మళ్లీ జైలుకు

>>జైలుకు తరలించారు.నాకు తెలీదు, సంబంధం లేదు కస్టడీలో పోలీసులు ఏ ప్రశ్న అడిగినా వంశీ నుంచి వచ్చిన సమాధానాలు ఇవేనని తెలిసింది. ఇళ్ల పట్టాలు ఎక్కడ తయారుచేశారు? వాటిని ఎక్కడ ముద్రించారు? రెవెన్యూ అధికారి సంతకంతో కూడిన స్టాంపును ఎలా తయారుచేశారు? మీ పర్యవేక్షణలోనే ఇవన్నీ జరిగాయా? ఎవరెవరికి పట్టాలు ఇవ్వాలనేది మీరే సూచించారా? ఇలా పోలీసులు పలు రకాలుగా ప్రశ్నలు సంధించినా, ఇంతకుమించి పెద్దగా బదులు రాలేదని సమాచారం.

**నాలుగున్నరగంటలు, 20 ప్రశ్నలు :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో 2019 ఎన్నికల సమయంలో వివిధ గ్రామాల్లో నకిలీ ఇళ్ల పట్టాలు పంచారని నమోదైన కేసులో పోలీసులు వంశీని రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం విజయవాడలోని జిల్లా జైలు నుంచి హనుమాన్ జంక్షన్ పోలీసులు తీసుకుని కంకిపాడు తీసుకొచ్చారు. వైద్యపరీక్షలు నిర్వహించి కంకిపాడు స్టేషన్‌కు తరలించారు. అక్కడ గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ పర్యవేక్షణలో హనుమాన్ జంక్షన్ సీఐ సత్యనారాయణలు విచారించారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు 20 ప్రశ్నలు వేశారు. న్యాయవాదులు దేవిసత్యశ్రీ, తానికొండ చిరంజీవి సమక్షంలో ప్రశ్నించారు. శనివారం కూడా విచారణ నిర్వహించాల్సి ఉండటంతో వంశీని కంకిపాడు స్టేషన్‌లోనే ఉంచారు. శ్వాససంబంధ సమస్య ఉండడంతో సీపాప్ పరికరాన్ని వినియోగించేందుకు వంశీకి నూజివీడు కోర్టు అనుమతినిచ్చింది.

# పోలవరం-బనకచర్లపై ఎపికి కేంద్రం మద్దతు!

>> పేర్కొన్నారు. పోలవరం జలాశయం నుంచి ప్రకాశం బ్యారేజీకి నీటిని తరలించడం అక్కడి నుంచి బొల్లాపల్లి జలాశయానికి చేర్చడం, ఆ తర్వాత బనకచర్ల కాంప్లెక్సుకు నీటిని మళ్లించడం ఇందులో ప్రధాన భాగాలు. సెగ్మెంట్ 1 పోలవరం -ప్రకాశం బ్యారేజి, ప్రస్తుత అంచనా వ్యయం రూ.13800 కోట్లు, సేకరించాల్సిన భూమి 1401 ఎకరాలు, పోలవరం జలాశయం నుంచి 23 వేల క్యూసెక్కుల నీళ్లు తరలిస్తారు. కుడికాలువ ద్వారా 5000 క్యూసెక్కులు, వరద కాలువ నుంచి 18 వేల క్యూసెక్కులు తరలిస్తారు. ఈ దశలో లిఫ్టులు అవసరంలేదు. తాడిపూడి ఎత్తిపోతల కాలువను విస్తరించి వరద కాలువగా మారుస్తారు. మొత్తం 175.40కి.మీ మేర ఉండే కాలువలు ప్రస్తుత పవిత్ర సంగత ప్రాంతానికి 4 కి.మీ దిగువ ప్రకాశం బ్యారేజీవద్ద కలుస్తాయి. సెగ్మెంట్-3 ప్రకాశం బ్యారేజి-బొల్లాపల్లి జలాశయం, అంచనావ్యయం రూ.35750 కోట్లు, భూమి 13700 ఎకరాల అటవీ, 29500 ఎకరాల ఇతర భూమి అవసరం. ప్రకాశం బ్యారేజీ వద్ద వైకుంఠపురం నుంచి నీటిని రెండో దశలో ఎత్తిపోస్తారు. 6దశల్లో నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. మొత్తం 84.17కి.మీ కాలువ ప్రవహిస్తుంది. 11.575 కి.మీ పైపులైనుఉంటుంది. బొల్లాపల్లి వద్ద జలాశయం తవ్వి అక్కడ 173 టీఎంసీల నీటిని నిల్వ చేస్తారు. డెడ్‌స్టోరేజి 21టీఎంసీలుగా ఉంటుంది. ఈ భాగంలో 18 ఆవాసాలు ముంపులో చిక్కుకుంటాయి. 4800 కుటుంబాలను తరలించాల్సి ఉంటుంది. సెగ్మెంట్ 3 బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల కాంప్లెక్సు, అంచనా వ్యయం రూ.32350 కోట్లు ఈ దశలో బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల కాంప్లెక్సుకు నీళ్లు తీసుకెళ్తారు. 113.33 కి.మీ కాలువ మొత్తం 26.10 కి.మీ పొడవున సొరంగాలు తవ్వాల్సి ఉంది. నల్లమలలో ఈ సొరంగాలు తవ్వుతున్నా ప్రధాన టన్నెల్ ప్రారంభం చివరి ప్రాంతాలు అటవీ ప్రాంతంలోకి రావు. పులుల అభయారణ్యానికి బయటే ఉంటాయి.

## గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు

# ప్రమాదం విచారకరం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కడప జిల్లా గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదం విచారకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కారును లారీ ఢీకొన్న ఘటనలో బద్వేలు మండలం, చింతపూతాయపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, శిరీష, హర్షిణి, హృతికేష్ రెడ్డి మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో 8,10 ఏళ్ల చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపిన సీఎం బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఢిల్లీలో ఉన్న సీఎం ప్రమాద ఘటన వివరాలను కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## పిఎస్ఆర్ ఆంజనేయులు

# ఫామ్‌హౌస్‌లో సిఐడి సోదాలు

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ముంబయికి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో అరెస్టయిన నిఘా విభాగం మాజీ అధిపతి సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయుడు నివాసంలో సీఐడీ అధికారులు శుక్రవారం సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ శివారుల్లోని మొయినాబాద్ మండలం అమ్డాపూర్‌లోని పీఎస్ఆర్ ఫామ్‌హౌస్‌లో తనిఖీలు చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి వరకూ సోదాలు కొనసాగించారు. ఈ కేసులో కీలక ఆధారాలైన పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పీఎస్ఆర్ మాయం చేశారని అనుమానిస్తున్న సీఐడీ అదికారులు వాటి కోసంఈ సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కొన్ని పత్రాలు లభ్యమైనట్లు సమాచారం. ఆంజనేయులను ఈ ఫామ్‌హౌస్‌లోనే గతనెల 22న సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. అప్పట్లో కొన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకోలేదు. విచారణలో భాగంగా వాటి గురించి ప్రశ్నించినా పీఎస్ఆర్ సరైన సమాధానలు చెప్పలేదు. ఈ నేపథ్యంలోనే తనిఖీలు జరిగాయి.

## వారం - వర్జ్యం

తేది : 25-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
త్రయోదశి మ.3.49
అశ్వని ఉ.11.11
వర్జ్యం రా.7.40-9.05
దు.సా.4.47-5.39
శుభసమయం :ఉ.8.15-8.50
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:**వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృషభం:**నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సహం. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మిథునం:** చేపట్టిన కార్యక్రమాలలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** కుటుంబంలో ఏర్పడిన సమస్యలు కొంతవరకు తీరుతాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి. ధనవ్యయం.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కన్య :** నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. చర్చల్లో పురోగతి సాధిస్తారు. శ్రమ పెరుగుతుంది.

**తుల :**భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పాత మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. గృహయోగం. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఖర్చులు.

**మకరం:** ఋణదాతల వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ప్రయాణాలు.

**కుంభం:** ఇంటా బయటా సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మీనం:** ఆదాయం తగ్గుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది. సోదరుల నుండి సాయం అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

25-5Pg3exHMNWJQE.qxd:25-5Pg3exHMNWJQE.qxd 01/01/01 5:44 AM Page 1



# టిటిడిలో వాట్సాప్ గవర్నెన్స్!

## - మరింత పారదర్శకంగా సాంకేతిక సేవలు

### కృతిమ మేధ విధానాన్ని త్వరితగతిన అందించేందుకు చర్యలు

### - టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** సాంకేతిక పరిజ్ఞానంతో శ్రీవారి దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత పారదర్శకంగా, సులభతరంగా సేవలందిచేందుకు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్)విధానాన్ని త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ఎఫ్ఎంఎస్ మానిటరింగ్, టిటిడిలో 14సేవలను వాట్సాప్‌గవర్నెన్స్.గూగుల్‌తో ఒప్పందం,ఆధార్‌నమోదు,కియోస్క్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కియోస్క్‌లద్వారా 4కోట్ల రూపాయలు అదనంగా విరాళాలు వచ్చాయన్నారు. భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలను సేకరించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు వాట్సాప్‌ఫీడ్‌బ్యాక్ విధానం అందుబాటులోకి తెచ్చామన్నారు. దీనిద్వారా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఏర్పడిందని ఇఒ వెల్లడించారు. శనివారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం అనంతరం అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ, విఎస్ఒలు వింగ్ ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి మీడియాప్రతినిధులకు పలు అభివృద్ధి కార్యక్రమాలు ఇఒ శ్యామలరావు వివరించారు. వివిధ రంగాల నిపుణులతో శ్రీవారిసేవకు వినియోగించుకునేందుకు వీలుగా కార్యాచరణ సిద్దం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ఆర్ఐలు కూడా శ్రీవారిసేవచేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గోమాతలకు సేవచేసేందుకు "గోసేవ"ను అమలుచేస్తామన్నారు. గ్రూప్‌లీడర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి 50శాతంమంది పాత సేవకులు, 50శాతంమంది కొత్తసేవకులు శ్రీవారిసేవలో పాల్గొనే అవకాశం కల్పించడంతోబాటు వారికి దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేసేలా ప్రణాళికలు రూపొందించనున్నామన్నారు. తిరుమలను ప్రణాళికా బద్దంగా అభివృద్ధిచేయడానికి టిటిడి పట్టణప్రణాళిక విభాగాన్ని ఏర్పాటుచేసుకున్నామన్నారు. 10కొత్త పోస్టుల భర్తీకి ప్రభుత్వం కూడా ఆమోదిం తెలిపిందని, దేశవ్యాప్తంగా ఉన్న ఆర్కిటెక్చర్ కన్సల్టెన్సీల ద్వారా టిటిడిలో అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలురూపొందిస్తున్నామన్నారు. పలు ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారుచేశామన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆదాయంతో సంబంధం లేకుండా నిర్వాహకుల సామర్థ్యాన్ని బట్టి పేరొందిన సంస్థలకు హోటళ్ళు కేటాయించడానికి త్వరలోనే టెండర్లను పిలుస్తామన్నారు.

# మహానాడుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### పోలీస్ అధికారులకు డిజిపి దిశానిర్దేశం

**కడప ,మే 24, ప్రభాతవార్త బ్యూరో :** ఈ నెల 27, 28, 29 తేదీలలో జరగనున్న మహానాడు సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాష్ట డీ.జీ.పీ హరీష్ కుమార్ గుప్తా పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట డీ.జీ.పీ హరీష్ కుమార్ గుప్తా పలు అంశాలపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహానాడుకు పలువురు వి.వి.ఐ.పి లు, వి.ఐ.పి లు, పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలపై, పార్కింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ ను ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేలా మళ్లించాలని ఆదేశించారు. పకడ్బందీగా రూట్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులకు కేటాయించిన విధులను అప్రమత్తంగా ఉంటూ నిర్వర్తించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డి.జి (లా అండ్ ఆర్డర్)ఎన్.మధుసూదన్ రెడ్డి, కర్నూలు రేంజ్ డి.ఐ.జి డా.కోయ ప్రవీణ్, అనంతపురము రేంజ్ డి.ఐ.జి డా.షెముషి బాజ్ పేయి, కడప జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ , కర్నూలు జిల్లా ఎస్.పి విక్రాంత్ పాటిల్, అన్నమయ్య జిల్లా ఎస్.పివి.విద్యాసాగర్ నాయుడు, నంద్యాల జిల్లా ఎస్.పిఅధిరాజ్ సింగ్ రా ణా, అనంతపురం జిల్లా ఎస్.పి పి.జగదీశ్, గుంతకల్ రైల్వే ఎస్.పిరాహుల్ మీనా, అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లా, ఇతర జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి - రూ.10లక్షలు విరాళం



**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి ఓ దాత 10లక్షలు రూపాయలు విరాళమిచ్చారు. బెంగుళూరుకు చెందిన అలెన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఉపాధ్యక్షుడు మహేశ్‌యాదవ్ ఈ విరాళాన్ని శనివారం ఉదయం అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించారు.

## 'ఆధార్'తోనే శ్రీవారి సేవలు !

### -మధ్యవర్తులు, దళారుల నియంత్రణకు చర్యలు

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి కార్యచరణ రూపొందించింది. ఇందులో భాగంగా భక్తులకు ఆఫ్‌లైన్(కౌంటర్‌సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్)రెండింటిల అందించే సేవలు అనేకమంది వ్యక్తులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తున్నారు. భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా టిటిడి అందిస్తున్న సేవలలో పారదర్శకతను పెంచేందుకు అధికారులు ఆధార్ ఆధారంగా సేవలందించేందుకు చూడాల్సి ఉంది. ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొందే దళారులు, మధ్యవర్తులపై టిటిడి చర్యలు చేపట్టింది. బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్‌నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు. ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు ,ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని తెలిపారు. నిజమైన భక్తులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టిటిడి కార్యాచరణ రూపొందించింది, సరైన ధృవీకరణ కోసం ఆదార్‌సేవలను ఉపయోగించేలా టిటిడి చర్యలు తీసుకుంటోంది.

## భక్తజనసంద్రంగా తిరుమల సర్వదర్శనానికి 25గంటలుపైనే



**తిరుమల,మే 24 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం... వారాంతం, వరుస సెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. శనివారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జులై 15వరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా. శనివారం సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా మరో 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రివరకు 74,374మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. తిరుమలేశునికి ఎంతో ముఖ్యమైన శనివారంరోజు స్వామివారిని దర్శించుకుంటే రెట్టింపు ఆశీస్సులు లభిస్తాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం.క్యూలైన్లలో సకల సదుపాయాలు భక్తులకు అందిస్తున్నారు.

# గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గం పనులు

### నల్లమల అడవుల్లో ప్రారంభం - విదేశీ పరిజ్ఞానంతో రెండు సొరంగాల నిర్మాణం

### - దిగువమెట్ట-దొరబావి వంతెన మధ్య రెండు సొరంగ మార్గాలు - భూ సామర్థ్యం, పటిష్టతల నిర్ధారణకై ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణ



అడవుల్లో జరుగుతున్న గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గం సొరంగాల పనులు

**గుంతకల్లు రైల్వే,మే 24,ప్రభాతవార్త** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వేలో గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గం పనులు తది దశకు చేరుకున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నాటి ఆంగ్లేయులు తమ వాణిజ్య వర్తక,వ్యాపారాల నిమిత్తం బందరు-బెడవాడ- గుంటూరు-గుంతకల్లు- హుబ్లీ-మార్మగోవా మధ్య మీటర్ గేజ్ రైలు మార్గాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్యం అనంతరం దక్షిణాది నుంచి తొలిసారిగా 1991లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పాములపర్తి వెంకట నరసింహారావు రైల్వేలో దేశమంతటా ఒకే గేజ్ విధానం ఉండాలనే ఉద్దేశ్యంతో 1992 ఏప్రిల్ 2న గౌహాతిలో యూనిగేజ్ ప్రాజెక్టును ప్రారంభించారు. నాటి నుండి బ్రాడ్ గేజ్ రైలు మార్గం దేశవ్యాప్తంగా ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగా గుంటూరు- గుంతకల్లు మధ్య 1997జూలై 5న శనివారం నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు అప్పటి రైల్వే శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌లు నంద్యాలలో జరిగిన కార్యక్ర మంలో ఈ ప్రాజెక్టును ప్రారం భించారు. :- దాదాపుగా మూడు దశాబ్దాలుగా గుంటూరు-గుంతకల్లు మధ్య సింగల్ లైన్‌లో రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. అయితే రానున్న భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నల్లప్పాడు- గుంటూరు- గుంతకల్లు(గుత్తి-పెండేకల్లు సహా)426కి.మీల డబ్లింగ్, విద్యుత్ రైళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ ఈ మార్గాన్ని 2016-17ఆర్థిక సంవత్సరంలోరూ. 3,631కోట్ల అంచనా వ్యయంతో డబ్లింగ్(ఇంజ నీరింగ్) రైలు మార్గాన్ని, 2018-19ఆర్థిక సంవత్సరంలో రూ.207,48,41 కోట్ల అంచనా వ్యయంతో విద్యుదీకరించేందుకు రైల్వే బోర్డు ఈ ప్రాజెక్టులను మంజూరు చేసింది. దీంతో ఈమార్గంలో ప్రాజెక్టు పనుల సౌలభ్యం కోసం నాలుగు రీచ్‌లుగా విభజించి ఈ మార్గంలో 2018 జనవరిలో డబ్లింగ్ రైలు మార్గం పనులను దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. గుంటూరు,గుంతకల్లు రైల్వే డివిజన్‌లలో ఇప్పటివరకు 347కి.మీల మేర పనులు పూర్తి చేసినట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. దిగువమెట్ట-గాజులపల్లి మధ్య 27కి.మీలు,గాజులపల్లి-నంద్యాల మధ్య 16కి.మీలు, నంద్యాల-పాణ్యంల మధ్య 14కి.మీల పనులు దాదాపుగా ముగింపు దశలో ఉన్నాయి. గాజులపల్లి-నంద్యాల మధ్య జరుగుతున్న 16కి.మీల పనులను రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసి మిగిలిన పనులను ఆగస్టులో పూర్తి చేసి సెప్టెంబరులో ప్రారంభించనున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. నల్లమల అడవులు..టైగర్ ఫారెస్ట్‌లలో :- ఈ ప్రాజెక్టులోనే అత్యంత కీలకమైంది నల్లమల అటవీ ప్రాంతం. ఈ ప్రాంతంలో జరుగుతున్న రెండో రైలు మార్గం ప్రాజెక్టు పనులు, రైలు మార్గం నల్లమల అటవీ ప్రాంతంలో 28కి.మీల మేర కలిగి ఉంటుంది. దిగువమెట్ట-గాజులపల్లి మధ్య రెండు సొరంగ రైలు మార్గాలు నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో చలమ వద్ద 0.34కి.మీల సొరంగం ఒకటి కాగా, మరొకటి బొగడ సమీపంలో దొరబావి వంతెన వరకు 1.6కి.మీల సొరంగం మరొకటి. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే అటవీ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దిగువమెట్ట-నంద్యాల మధ్య జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గంలో 142వంతెనలు నిర్మిస్తున్నారు.

## బాలుడి మృతిపై రైల్వేలో కొనసాగుతున్న విచారణ

**గుంతకల్లు రైల్వే,మే 24,ప్రభాతవార్త** గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు మృతిచెందిన సంఘటనకు సంబంధించి నిజనిర్ధారణ కమిటీ విచారణ కొనసాగుతుంది. కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు,శ్రావణి దంపతులు,కుటుంబ సభ్యులు తీర్థయాత్రలో భాగంగా రామేశ్వరంకు వెళ్లే నిమిత్తం శుక్రవారం ఉదయం గుంతకల్లు నుంచి(అహ్మదాబాద్ నుంచి తిరుచిరాపల్లి వెళ్లే నెంబర్ 09419ఎక్స్‌ప్రెస్‌లో) గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబర్6-7మధ్య ఉన్న వెయిటింగ్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున 4-30గంటల ప్రాంతంలో స్టేషన్ పైకప్పు పెచ్చులు మణికంఠపై విరిగిపడడంతో తలకు బలంగా, తీవ్రమైన గాయాలయ్యాయి. బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్‌లు డివిజన్‌కు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించి కీలక విభాగాలకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో నిజనిర్ధారణ కమిటీని నియమించిన విషయం వార్త పాఠకులకు విధితమే.



## అనారోగ్యంతో ఉన్న వంశీకి సరైన వైద్యం అందించండి

### - మాజీ మంత్రి పేర్నినాని

**విజయవాడ, మే 24, ప్రభాతవార్తప్రతినిధి:** అనారోగ్యంతో ఉన్న ఓ మాజీ ప్రజా పతినిధి వంశీకి కి సరైన వైద్యం అందించరా అని వైకాంగ్రెస్ పార్టీనేత,మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) ప్రశ్నించారు. దొంగకేసులు పెట్టి మా పార్టీ నాయకుల ప్రాణాలతో చెలగాటమాడతారన్నారు.మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ని వైకాంగ్రెస్ ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, మాజీ మంత్రి పేర్ని నాని విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం పరామర్శించారు. శ్వాసకోశ సంబంధ ఇబ్బందులతో బాధపడుతున్న వంశీని కోర్టు ఆదేశాల మేరకు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వైద్యపరీక్షలకు పోలీసులు ఈ సందర్భంగా మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. వంశీ ఆరోగ్య పరిస్థితిపై కూటమి ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేదని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వంశీని విచారణ పేరుతో ఆస్పత్రి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదని మాజీ మంత్రి పేర్ని నాని చెప్పారు.ప్రభుత్వాస్పత్రిలో కనీస సదుపాయాలు అందుబాటులో లేకుండా చేశారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు చేశారు. అచ్చెన్నాయుడును గతంలో అరెస్టు చేసిన సమయంలో తనకు ఫైల్స్ అంటూ డ్రామాలు ఆడారని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో అచ్చెన్నాయుడు చేరి ప్రాణాలు కాపాడుకున్నారని తెలిపారు. ఊపిరితిత్తుల్లో వంశీకి ఇబ్బందులు ఉన్నాయని.. అయినా ఎందుకు చికిత్స అందించడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఉద్యోగులందరినీ చట్టం ముందు నిలబెడతామని చెప్పుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీఐ భాస్కర్‌రావు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌ని వదిలిపెట్టమని మాజీ మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. రాజ్యహింసకు, పోలీస్ వేధింపులకు కేంద్రంగా ఏపీ నిలబడుతోంది.

# వరుస వివాదాల్లో తిరుమల కొండ!

### - ఆ ముగ్గురు ఎపిఎస్‌పి పోలీసులు సస్పెన్షన్ - - నమాజ్‌చేసిన వ్యక్తికోసం సెర్చింగ్

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలకొండ గత కొంతకాలంగా వరుసవివాదాలకు కేంద్రంగా మారింది. పవిత్రతను కాపాడాలని, ఇందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశాలిచ్చినా ఆచరణ అంతంతమాత్రంగానే మారింది. ఇందుకు ఇటీవల చోటుచేసుకున్న అనేక పరిణామాలు తార్కాణంగా నిలిచాయి. తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను, ఆలయ భద్రత, హిందువుల ఆరాధ్యదైవం వేంకటేశ్వరస్వామి ప్రాశస్త్యాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిఎం సూచన. అయితే కొండపై అందుకు భిన్నంగా కార్యకలాపాలు జరుగుతుండటంతో నిఘాభద్రత వ్యవస్థతోబాటు తిరుమల పోలీసుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం రోజు తిరుమల ఆలయ భద్రతకు డిప్యూటేషన్‌పై వచ్చిన కర్నూలు ఏపిఎస్‌పి బెటాలియన్ పోలీసులు ముగ్గురు బి.రాజశేఖర్, కె.ఓంకార్‌నాయక్, ,షేక్ సిరాజుద్దీన్ పోలీసు వాహనంలో తిరుపతికి దిగడం, పీకలదాకా మద్యం సేవించి అలిపిరి తనిఖీకేంద్రం దాటుకుని తిరుమలకు రావడం జరిగింది. అప్పటికే బెటాలియన్ పోలీసులు ముగ్గురూ మద్యంమత్తులోఉండటంతో తిరుమలలో ఆలయానికి ఎదురుగా ఉన్న డిటైప్ క్వార్టర్స్‌ప్రాంతంలో సచివాలయం భవనాన్ని వాహనంతో ఢీకొన్నారు.ఈ ప్రమాదంతో ముగ్గురు కానిస్టేబుళ్ళు క్రిందపడ్డారు. అంతేగాక మత్తులో ఓ కానిస్టేబుల్ వీరంగం చేయగా మరొకరు రోడ్డుపై పడి దొర్లుకుంటూ రావడం అక్కడి భక్తులను , ట్రాఫిక్ పోలీసులను విస్మయానికి గురిచేసింది. ముగ్గురు ఏపిఎస్‌పి పోలీసుల్లో ఒకరు పరారవగా మిగిలిన ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని పరీక్షలకోసం ఆస్పత్రికి తరలించారు. మద్యంసేవించి 300 పాయింట్లుగా తేలింది. ఆలయ భద్రతలో పవిత్రంగా వ్యవహరించాల్సి న బెటాలియన్ పోలీసులు ఇలా చేయడం వెనుక భద్రత డొల్లతనం మరోసారి ప్రస్ఫుటమైంది. ఇక రెండురోజుల క్రిందట తమిళనాడుకు చెందిన భక్తులను దర్శనానికి తీసుకువచ్చిన తమిళనాడు కారు డ్రైవర్ ముస్లిం వ్యక్తి కావడంతో గురువారం మధ్యాహ్నం కల్యాణవేదిక వద్ద ఏకంగా నమాజ్ చేయడంతో పెద్ద దుమారం రేపింది. డ్రైవర్ నమాజ్‌ను కొందరు భక్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేయడంతోసంచలనం కలిగించింది. గురువారం ఉదయం తమిళనాడుకు చెందిన కొందరు భక్తులు హనుమజ్జయంతిన శ్రీవారి దర్శనం కోసం ఓ కారును అద్దెకు తీసుకున్నారు. ఆ కారుడ్రైవర్ ముస్లిం కావడంతో మధ్యాహ్నం కల్యాణవేదిక పార్కింగ్‌లోనే నమాజ్ చేశారు. ఇదీ టిటిడి నిబంధనలకు విరుద్దం.అంతేగాక ఈ రెండు ఘటనలుతిరుమలలో భద్రతను వెక్కిరించేలా తయారయ్యాయి. టిటిడి అధికారులు మాత్రం పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నారని చెబుతున్నారు. కాగా గతంలో ఏకంగా ఓవ్యక్తి మద్యంబాటిళ్ళను తిరుమలకు తీసుకువచ్చి బాలాజీనగర్‌లో మినీమద్యం బెల్టుషాపును నడిపించడం జరిగింది.

## శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేస్తాం :టిటిడి ఇఒ శ్యామల రావు

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఇతోధిక సేవలందించేందుకు ప్రపంచంలోని నిపుణులు,ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ధార్మిక సంస్థ టిటిడిలోని వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారిసేవకులు సేవలందిస్తున్నారని, వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలకనుగుణంగా టిటిడిలో శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసే కార్యాచరణ సిద్ధం చేయాలని ఇఒ శ్యామల రావు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలనా భవనం నుండి 14 దేశాలకు చెందిన వివిధ రంగాల ఎన్ఆర్ఐల నిపుణులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇఒ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు స్వచ్ఛందంగ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు రాష్ట్రాల నుంచి శ్రీవారి సేవకులు తిరుమలకు వచ్చి చక్కటి సేవలు అందిస్తున్నారని, త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలలో నిపుణులైన ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు.టిటిడిలో వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారి సేవకులు అందిస్తున్నారని వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అమెరికా తదితర దేశాలలో శ్రీనివాస కల్యాణాలు విరివిగా నిర్వహించేందుకు వారు సహకరిస్తున్నారని తాజాగా శ్రీవారి సేవలో తీసుకువసునతన్న సంస్కరణల మూలంగా వైద్యం,ఐటీ,ఇంజనీరింగ్, ప్లానింగ్, వాటర్ మేనేజ్‌మెంట్,ఫుడ్ టెక్నాలజీ ,ఆర్కిటెక్చర్, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాలలో సేవలందించేందుకు ఎన్ఆర్ఐలు ముందు కొస్తున్నారని చెప్పారు. నైపుణ్యం ఆధారంగా వారి సేవలను టిటిడిలో అమలు చేసేందుకు ప్రణాళికలు తయారుచేయాలని ఆయన అధికారులను ముందుకు వచ్చారని ఈవో తెలిపార. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్ఆర్ఐలు టిటిడి శ్రీవారి సేలకుల సేవలను విశ్వవ్యాప్తం చేసేందుకు ముందుకు రావడంపై ఈ అవకాశం తమకు స్వామి వారు కల్పించిన మహద్భాగ్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్చువల్ సమావేశంలో సూర్యప్రకాశ్, శివశంకర్-జర్మనీ, సంతోష్‌పల్లె, రమేశ్ గుమ్మడవల్లి- ఐర్లాండ్, లోకనాదం, విజయకుమార్, అరుణ్ ముమ్మలనేని, శివరామ్‌రెడ్డి, విజయకుమార్, డాక్టర్ అనిల్‌కుమార్, రీతు, యూకె, శివరామ్-నెదర్లాండ్, కన్నెవిరని-ఫ్రాన్స్, పోలెండ్,ఐర్లాండ్ నుండి సంతోష్ ఉన్నారు.

# నేత్రదానట్రస్ట్ ఏర్పాటుకు త్వరలో విధివిధానాలు

### - సీనియర్ సిటిజన్లకు ఆలయానికి దగ్గరగా వసతి గదులు కేటాయించాలి:డయల్ యువర్ కార్యక్రమంలో భక్తులు

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ సిటిజన్లకు వయోభారంతో తిరుమలకు వచ్చినపుడు ఆలయానికి దగ్గరగా వసతి గదులు కేటాయించాలని, అన్నప్రసాద కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లుచేస్తే బావుంటుందని విజయవాడకు చెందిన గిరిధర్ సూచించారు. దీనిపై టిటిడి ఇఒ శ్యామలరావు స్పందిస్తూ గదుల కేటాయింపు విషయంలో సూచనను పరిశీలిస్తామని, అన్నప్రసాదభవనంలోని హాల్ 1లో ఇప్పటికే సీనియర్ సిటిజన్లకోసం ప్రత్యేక ఏర్పాట్లుచేశామన్నారు. ఒంగోలునుండి నారాయణ, ఖమ్మంనుండి గోపి మాట్లాడుతూ దేశ రక్షణకు ఒక సంవత్సరం హుండీ ఆదాయం విరాళంగా ఇవ్వండని, క్యూలైన్లలో 5-10ఏళ్లలోపు పిల్లలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటుచేయాలన్నారు. ఇందుకు ఇఒ సమాధానంగా పిల్లలకు ఇబ్బంది లేకుండా దర్శన ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. కావలినుండి రవికుమార్ మాట్లాడుతూ టిటిడి నేత్రదానట్రస్ట్ ఏర్పాటుచేస్తే మరింతమంది భక్తులకు మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రశ్నకు ఇఒ సమాధానంగా ఇప్పటికే దీనిపై అరవింద్ కంటి ఆస్పత్రిలో చర్చలు జరుపుతున్నామన్నారు. త్వరలో విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. శనివారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. దేశంలోని పలుప్రాంతాలనుండి భక్తులు తమతమ సూచనలు,సలహాలు దాదాపు 35మంది తెలియజేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇసత్యనారాయణ, డిప్యూటీ ఒలు లోకనాథం(ఆలయం), భాస్కర్(వసతికల్పన), రాజేంద్రకుమార్(అన్నదానం), వెంకటయ్య(కల్యాణకట్ట), రవాణ జిఎం శేషారెడ్డి, ఉద్యానవనవిభాగం డిడి శ్రీనివాసులు, విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్ డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీనివాసమంగాపురంలోవేదాశీర్వచనం ఏకబ్రాహ్మణుడే ఇస్తున్నాడని హైదరాబాద్‌నుండి లక్ష్మీనారాయణ్ తెలిపారు. దీనిపై ఇఒ శ్యామలరావు సమాధానంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవారిసేవను ఆఫ్‌లైన్‌లో ఇవ్వాలని కాకినాడనుండి నామాలస్వామి, కామారెడ్డినుండి శ్యామలకుమార్ కోరారు. దీనిపై స్పందించిన ఇఒ ఆఫ్‌లైన్‌లో ఇవ్వడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని. ఫిర్యాదులు రావడంతో ఆన్‌లైన్‌లో ఇస్తున్నామన్నారు. శ్రీవారిమెట్టుదారిలో నడకదారిలో వచ్చేభక్తులందరికీ టోకెన్లు ఇవ్వాలని అనంతపురంనుండి నర్సానాయుడు సూచించారు. ఇందుకు ఇఒ స్పందనగా ప్రస్తుతం రోజుకు 4వేల వరకు టోకెన్లు జారీచేస్తున్నామని, ఆ సంఖ్య పెంచితే సర్వదర్శనం భక్తులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. నర్సారావుపేటనుండి మహేశ్వరరావు మాట్లాడుతూ ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు రాత్రిపూట జారీచేయడం వద్ద ఇబ్బందులు పడుతున్నామన్నారు.



భూభారతి అంతా సవ్యంగా ఉంటే.. పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎందుకు ఆలస్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటి నుంచైనా పూర్తి స్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల పాటు అవగాహన సదస్సులు పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. దీంతోపాటు గత డిసెంబర్‌లో సర్కారు అసెంబ్లీలోభూభారతి చట్టంచేసింది. తాజాగా పోర్టల్‌ను ప్రారంభించడంతోపాటు మార్గదర్శకాలు విడుదల చేసింది. అంటే చట్టం చేసిన తర్వాత నాలుగు నెలలు అమలులో ఎందుకు జాప్యం చేసిందనే ప్రశ్న వినిపిస్తు న్నది. అదేవిధంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు 10,954 మంది గ్రామ పాలన అధికారులను(జీపీవో) నియమి స్తామని సర్కారు ప్రకటించింది. కానీ, వీరి నియామకం పూర్తికాకుండానే పైలట్ ప్రాజెక్టు ను అమలు చేస్తున్నది. అస్తవ్యస్తంగా ఉన్న ధరణిని బంగాళాఖాతంలో కలిపి రైతులకు మేలు చేసేందుకు భూ వివాదాలు లేని తెలంగాణ కోసం భూభారతి చట్టాన్నిఅమలు చేస్తు న్నట్టు కాంగ్రెస్‌సర్కారు గొప్పగా ప్రకటించింది. అయితే సర్కారు పెద్దలు చెప్పే మాటలకు.. చేసే పనులకు పొంతనలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయిం చిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటి నుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని భూభారతిలోనూ అమలు చేస్తున్నారు.

# భూభారతి సదస్సులతో రైతు సమస్యలు తీరేనా?

**అమరవాది సంపత్‌కుమార్**

ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన అనంతరం సిఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ధరణిని రద్దు చేశారు. దాని స్థానంలో భూభారతి పేరుతో మరో చట్టాన్ని తీసుకువచ్చి దాన్ని అమలు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వం భూ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక రెవెన్యూ సదస్సులను కూడా నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ సదస్సులకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. భూ భారతి చట్టం గురించిన ముఖ్యమైన అంశాలపై అవగాహన పొందుతున్నారు. అంతేకాకుండా.. రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు అక్కడికక్కడే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్‌లో వివిధ రకాల భూ సంబంధిత సేవలను రెండు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. ఇందులో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ (ఖాతా మార్పిడి), రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) కరెక్షన్, నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి), అప్పీల్ (సమీక్ష), భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూముల జాబితా, ఈచలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్‌డాక్యుమెంట్స్ వంటి ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక మాడ్యూల్స్‌ను రూపొందించారు. ఈ సేవలు భూ వివరాలను మరింత సులభంగా పొందేందుకు ఉపకరిస్తాయి. అంతేకాకుండా భవిష్యత్తుల భూమిత్ర అనే ఒక ప్రత్యేకమైన ఆప్షన్‌ను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది ప్రస్తుతం.. భూ భారతి పోర్టల్ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతంగా కొనసాగుతోంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం, కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలం, ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నాలుగు మండలాల్లో ప్రస్తుతం భూముల క్రయవిక్రయాలు పూర్తిగా భూ భారతి పోర్టల్ ద్వారానే నిర్వహిస్తున్నారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ ఫలితాలను సమీక్షించిన అనంతరం త్వరలోనే రాష్ట్ర వ్యాపంగా దీన్ని జూన్ 2 నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టోల్ ఫ్రీనంబర్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం భూముల వ్యవహారాల కోసం ధరణి స్థానంలో భూ భారతి పేరుతో కొత్త పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. అయిత ఈ పోర్టల్




మీద చాలా మందికి చాలా సందేహాలు వస్తున్నాయి. అవి ఎవరిని అడగాలో తెలియక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం.. టోల్‌ఫ్రీ నెంబర్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా.. భూమి సమస్యల పరిష్కారంతో పాటు, చాలా సందేహాలను సులభంగా నివృత్తి చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను మరింత సులభతరం చేసే లక్ష్యంతో కీలకమైన మార్పులు చేపట్టింది. గతంలో ఉన్న ధరణి పోర్టల్‌ను పూర్తిగా మార్చేస్తూ.. కొత్తగా "భూ భారతి' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈమేరకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించగా.. ఏప్రిల్ 14వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ నూతన పోర్టల్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో.. భూ భారతి పోర్టల్ వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం తాజాగా ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పోర్టల్‌ను వినియోగించే సమయంలో ఎదురయ్యే సమస్యలను లేదా విచారణలను ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకువెళ్లేందుకు వీలుగా 9140 29313999 నెంబర్‌ను ప్రారంభించింది. ఈ టోల్ ఫ్రీ ధరణి.. భూ భారతి తేడాలు ధరణి పోర్టల్‌లో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి 33 మాడ్యూళ్లు ఉండేవి. ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యూల్‌ను ఏర్పాటు చేశారు. అయితే అవగాహన లేకపోవటం వల్ల చాలా మంది రైతులు ఒకదానికి బదులు మరో మాడ్యూల్లో అప్లికేషన్ పెట్టుకునేవారు. అధికారులు వాటిని రిజక్ట్ చేసేవారు. దీంతో ప్రతిసారీ రూ.1,200 వెచ్చించి పదేపదే దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ మాడ్యూళ్ల సంఖ్యను 6కు తగ్గించారు. భూ భారతి పోర్టల్లో దరఖాస్తు చేస్తే ఇకపై భూ యజమాని ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్‌లు వస్తాయి. రైతుల అప్లికేషన్ స్టేటస్ చూసుకునేలా ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. ధరణి పోర్టల్లో భూదస్త్రాలు కనిపించేవి కావు. 2020కి ముందు 32 కాలమ్‌లతో పహాణీ ఉండేది. అందులో భూ యజమాని పేరు, భూ ఖాతా, సర్వే నంబరు ఇలా 32 కాలమ్‌లు ఉండేవి. ధరణిపోర్టల్ ద్వారా రైతు పేరు మాత్రమే ఉండేలా పహాణీని అమలు చేసింది. ఈ క్రమంలో భూముల వివరాల లభ్యత లేక రైతులుఇబ్బందులు పడేవారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా భూ భారతిలో 11 కాలమ్‌లతో కొత్త పహాణీని ఏర్పాటు చేశారు. ఎమ్మార్వో స్థాయిలో భూ సమస్య పరిష్కారం కాకపోతే ఆపైన ఆర్డీవోకు, అక్కడి నుంచికలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. కలెక్టర్ ఇచ్చే ఉత్తర్వులతో విభేదిస్తే 30 రోజుల్లో భూ పరిపాలనా ట్రైబ్యునల్‌లో సవాల్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. లీగల్ ఇష్యూస్ పరిష్కారానికి ల్యాండ్ ట్రైబ్యునళ్లు సైతం ఏర్పాటు చేస్తారు. భూ పరిపాలన ట్రైబ్యునల్ కమిషన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. భూ సమస్యల విషయాల్లో రైతులకు న్యాయసలహాలు, సూచనలు ఇచ్చేందుకు సర్కార్‌మండల స్థాయిలో వాలంటీర్లను ఏర్పాటు చేయనుంది. పేదలకు పైసా ఖర్చులేకుండా ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తారు. 2017-18లో నాటిప్రభుత్వం చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన సందర్భంగా చిన్నచిన్న సమస్య లతో పక్కన పెట్టిన 18 లక్షలఎకరాల భూములకు స్పష్టత తీసుకురానున్నారు. హక్కుల జారీకి భూభారతి చట్టంద్వారా అవకాశం కల్పించనున్నారు. భూ భారతి చట్టంలోని 4(1) సెక్షన్‌ను అనుసరించి రాష్ట్రంలోని గ్రామాల్లో ఉన్న అన్నిరకాల భూముల హక్కుల రికార్డులను రూపొందిస్తారు. డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి భూ భాగాలను మ్యాపింగ్ చేయనున్నారు. తెల్లకాగితాలపై ఒప్పందాల ద్వారా (సాదాబైనామా) 2014, జూన్ 2కు ముందు జరిగిన కొనుగోళ్లను క్రమబద్ధీకరిం చాలని ఆర్వోఆర్2024 చట్టం సెక్షన్ 6(1) ద్వారా నిర్ణయించారు. ఆర్డీవో స్థాయిలో విచారణ నిర్వహించి క్రమబద్ధీకరణ ప్రక్రియను నిర్వహిస్తారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి మార్గదర్శకాలే దిక్కు అయిందనే విమర్శలు వస్తున్నాయి. నాడు ధరణిలో పొందుపరిచిన అంశాలనే భూభారతిలో యథాతథంగా ఎత్తిపోసిందినే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. 33 మాడ్యూల్స్‌ను 6కు తగ్గించామంటూ గొప్పగా ప్రకటిం చిందని, ఇందులోనూ మాయ చేసి ప్రస్తుతం ఉన్న33మాడ్యూ ల్స్‌లోని వివిధ అంశాలన్నింటిని కలిపేసి ఆరు మాడ్యూల్స్‌లో పొందుపరిచిందని,. అన్నీ కలిపేసి మాడ్యూల్స్ తగ్గించామంటూ ప్రకటించేసిందనే విమర్శలు వస్తున్నాయి. ఇందులో ఒకటి రెండు మినహా సర్కారు కొత్తగా చేసిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూభారతి అమలుకు సంబంధించి మాజీరెవెన్యూ అధికారులు ధరణికి, భూ భారతికి పెద్ద తేడా లేదని కేవలం పేరు మాత్రమేమారిం దనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. భూభారతి చట్టంపేరుతో ప్రభుత్వం రైతులపై భారంమోపుతుందనే విమర్శలు వస్తున్నా యి. మ్యుటేషన్ కోసం ఎకరాకు రూ.2,500వసూలు చేయనున్నది. కొత్త పాస్ పుస్తకం కోసం రూ.300 చెల్లించాల్సిందే. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన రికార్డు మార్పులు, ఇతర అప్పీళ్ల కోసం రూ.1,000 ఫీజు సమర్పించుకోవాల్సిందే. అమలుకు ఆలస్యమెందుకు? ●

---

# 'సత్యా'నికి పరీక్ష!

జమ్ము కాశ్మీర్

**ఎ.వి.వి ప్రసాద్**

పదవి నుంచి, అధికారం నుంచి వైదొలగిన తర్వాత కూడా 'మిస్టర్ క్లీన్' గా మిగిలే వారు అరుదుగానే కనిపిస్తారు. ముఖ్యంగా గవర్నర్ వంటి ఉన్నత స్థాయి రాజ్యాంగ పదవిలో ఉండి వివాద రహితంగా బయటికొచ్చేవారు ఇప్పుడు మరింత అరుదుగా కనిపిస్తున్నారనే చెప్పాలి. అధికారంలో ఉన్న సమయంలో ఏదో ఒక దశలో ఆరోపణలకు గురికావడం సహజమే అయినా వాటినుంచి కడిగిన ముత్యంలా కొందరే బయటకు రాగలుగుతారు. తాజాగా అటువంటి తీవ్ర ఆరోపణలకు గురై, వాటినుంచి బయటపడలేక ఆసుపత్రిలో పడి ఊపిరందక కొట్టుమిట్టాడుతున్నవారు జమ్ముకాశ్మీర్ (జెకె) మాజీగవర్నర్ సత్యపాల్ మాలిక్. 2018 ఆగస్టు నుంచి2019 అక్టోబర్ వరకు అంటే దాదాపు 14నెలలేఆయన జెకె గవర్నర్‌గా ఉన్నా, ఆ కొద్ది సమయంలోనే ఆయన చాలా తీవ్రమైన అవినీతి ఆరోపణలకు గురికావడం పరిశీలించవలసిన అంశం. ఆ అవినీతితో ఆయనకు సంబంధం ఉన్నదా, లేదా అనేది విచారణ జరుపుతున్న ప్రత్యేక కోర్టు తేల్చవలసి ఉంది. దాదాపు మూడు సంవత్సరాలు క్షుణ్ణంగా, లోతుగా దర్యాప్తు జరిపి గత గురువారం ( 22, మే ) సిబిఐ తన చార్జిషీటును ప్రత్యేక కోర్టుకు సమర్పించింది. దానిలో ప్రధానంగా మాలిక్‌తో పాటు మరో ఆరుగురిపై సిబిఐ తీవ్రమైన దోషారోపణలే చేసింది. 'కిరు' జల విద్యుత్ కేంద్రం టెండర్ల అనుమతి సందర్భంగా కొన్ని వందల కోట్లు చేతులు మారాయనీ, ఆ వ్యవహారంతో మాలిక్‌కు ప్రత్యక్ష సంబంధం ఉన్నదనీ సిబిఐ ఆరోపణ. మూడు సంవత్సరాల పాటు విస్తృతంగా సోదాలు, విచారణలు జరిపి సిబిఐ ఈ చార్జిషీటును రూపొందించింది గనుక దానిలో వాస్తవాలే ఉండవచ్చని చాలామంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ చార్జిషీటులో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమనీ, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదనీ మాలిక్ అంటున్నారు. ఈ రెండు కోణాల్లో ఏది నిజమన్నది కోర్టు విచారణతర్వాత గానీ చెప్పలేం. అయితే పరిశీలించవలసినఅంశాలు కొన్ని ఉన్నాయి. మాలిక్‌కు ఇప్పుడు 78 యేళ్లు. 2019 అక్టోబర్‌లో జెకె గవర్నర్‌గా పదవీ విరమణ తర్వాత మరో రెండు రాష్ట్రాలకు కూడా ఆయన గవర్నర్ అయ్యారు. దానికి ముందు ఆయనకు సుదీర్ఘ రాజకీయ జీవితమే ఉంది. 1974 నుంచి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లకు ఎన్నికవడమే గాక మొత్తం ఐదుసార్లు గవర్నర్‌గాకూడా ఉన్నారు. బీహార్, ఒడిశా, జెకె, గోవా మేఘాలయకు గవర్నర్‌గా చేసినా అన్నీ స్వల్ప కాలమే. యేడాది, రెండేళ్లకు మించి గవర్నర్ పదవిలో ఆయన కొనసాగినట్లు లేదు. ఆయా రాష్ట్రాలకు ఆయన గవర్నర్‌గా ఉన్నప్పుడు కొన్ని వివాదాలలో చిక్కుకున్నా, అవినీతి ఆరోపణలైతే లేవు. కానీ జెకె గవర్నరుగా బయటకు వచ్చిన తర్వాతే కిరు ప్రాజెక్టు కుంభకోణం గురించి వెలుగులోకి రావడం, దానిపై సిబిఐ దర్యాప్తు జరపడం మొదలైంది.


సత్యపాల్ మాలిక్

నిజానికి దానికి కారణం కూడా ఒకరకంగా ఆయనే అని చెప్పాలి. కిరు జలవిద్యుత్ ప్రాజెక్టుకుసంబంధించిన రెండు ఫైల్స్ అనుమతికోసం తనవద్దకు వచ్చాయనీ, ఆ ప్రాజెక్ట్ కు చెందిన ఓ ముఖ్య వ్యక్తి తనకు రూ.300కోట్ల లంచం ఆఫర్ చేశారనీ, తాను తిరస్కరించినా చివరకు ఆ ప్రైవేటు కంపెనీకే ప్రాజెక్టు దక్కిందనీ తన సత్యసంధత తను నిరూపించుకోడానికో ఏమో! ఆయన ఓ ప్రకటన చేశారు. దానితో 2022 ఏప్రిల్‌లో సిబిఐ దర్యాప్తు మొదలై పలువురు కీలకవ్యక్తులు కొన్ని కంపెనీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆతర్వాత విస్తృతంగా జరిపిన దర్యాప్తులో మాలిక్ నివాసం, బంధువుల నివా సాల్లో కూడా సిబిఐ సోదాలు జరిపింది. అప్పటి చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ నవీన్ కుమార్ చౌదరి, ఎంఎస్ బాబు, ఎంకె మిట్టల్, అరుణ్ కుమార్ మిశ్రాతో పాటు కొందరు అధికారులు, నిర్మాణ సంస్థ పటేల్ ఇంజినీరింగ్ పై కూడా కేసు నమోదు చేసింది. తర్వాత అనేక కోణాల నుంచి దర్యాప్తు కొనసాగింది. 2022 అక్టోబర్‌లో మేఘాలయ గవర్నర్‌గా మాలిక్‌పదవీ విరమణ చేసిన తర్వాత సిబిఐ తన దర్యాప్తును ఉధృతం చేసి 2024 ఫిబ్రవరిలో ఢిల్లీ, జెకెలోని ఆయన నివాసాలలో విస్తృతంగా సోదాలు జరిపింది. మాలిక్ సహచరులు, చీనాబ్ వ్యాలీ సంస్థ అధికారులు లక్ష్యంగా ప్రధానంగా సోదాలు జరగడంతో వారికి కీలక ఆధారాలే లభించి ఉంటాయి. గతవారం చార్జిషీటు దాఖలుచేసింది. రీటెండరింగ్ ద్వారా ప్రాజెక్టుకు తిరిగి టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకున్నా అది అమలు కాలేదనీ, చివరికి కాంట్రాక్టును పటేల్ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు అప్పగించారనీ, ఆ క్రమంలోనే అనేక అవకతవకలు జరిగాయనీ సిబిఐ ఆరోపిస్తోంది. మొత్తం రూ.2,200 కోట్ల కుంభకోణమనీ, కిరు ప్రాజెక్టు కాంట్రాక్టును ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించడంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారిందని సిబిఐ అంటోంది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ప్రకారం, తొలుత గల టెండర్‌ను రద్దు చేసి ఇ టెండరింగ్, రివర్స్ వేలం ద్వారా ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారనీ, చివరికి కాంట్రాక్టును పటేల్ ఇంజినీరింగ్‌కు అప్పగించారనీ, ఆక్రమంలోనే కోటానుకోట్లు చేతులు మారాయనీ దర్యాప్తులో తేలినట్లు సిబిఐపేర్కొంటోంది. ప్రస్తుతం మాలిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కిడ్నీ డయాలసిస్ జరుగుతున్నదని కూడా తెలుస్తోంది. గతంలో కొందరు గవర్నర్లపై ఇలాంటి అవినీతి ఆరోపణలే వచ్చినా సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసిన సందర్భాలు లేవనే చెప్పాలి. ఐదు సార్లు గవర్నర్ పదవిలో ఉన్న మాలిక్ పై సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసిందంటే దర్యాప్తు సంస్థ వద్ద తగినన్ని ఆధారాలు ఉండి ఉంటాయనే అనుకోవాలి. మాలిక్ నిజాయితీకి ఇదొక పరీక్ష వంటిదే. ఆయన వయసు రీత్యా కూడా విచారణను త్వరగా పూర్తి చేయవలసిన అవసరం ఉంది. తన నిజాయితీని ఆయన నిరూపించుకోలేక పోతే గవర్నర్‌ఊ వ్యవస్థకే మచ్చ తెచ్చిన వారుగా మిగిలిపోతారు. ●

---

# డ్యుటెర్టీకి తప్పని పదవీచ్యుతి

ఫిలిప్పీన్స్

**గన్ని మోహన్**

ఆగ్నేయాసియా దేశంలో ఇప్పుడు ఆకల్లోలం తీవ్ర రూపందాల్చింది. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం వెంబడి ఉన్న ఈ ద్వీపదేశంలో వంశ పారంపర్యంగా వస్తున్న అధికారాలకు కత్తెరపడుతోంది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నిధుల దుర్వినియోగం వంటి వాటిపై ఇప్పుడున్న ఉపాధ్యక్షురాలు మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టీ కుమార్తె సారా జిమ్మర్‌మ్యాన్ డ్యుటర్టీకి పదవీగండం ముంచుకొస్తోంది. వచ్చేనెల 3వ తేదీ సారా డ్యుటెర్టీని పదవీచ్యుతి చేసేందుకు అవసరమైన రంగంసిద్ధంఅవుతోంది. వచ్చేనెలలోనే ఈ ఆగ్రహావేశాలు అధికంగా ఉన్న సారా డ్యుటెర్టీ భవిష్యత్తు తేలిపోయే తరుణం వచ్చింది. ఫిలిప్పీన్స్ ఉపాధ్యక్షురాలిగా 2021లో పదవిని స్వీకరించిన సారా తదనంతరం రక్షణ శాఖను తీసుకోవాలని ప్రాధాన్యతచూపిస్తే సంకీర్ణ కూటమిలో ఆమెకు విద్యాశాఖ దక్కింది. అయితే చట్టనిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా నిధులు వ్యయంచేసి దుబారా చేసారన్న అభియోగాలతోపాటు అవినీతి, బంధుప్రీతి వంటి అభియోగాలు ఆమెపై లెక్కకు మించి నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే డ్యూటెర్టీని 316 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో తీవ్రస్థాయి నేరాలకుగాను పదవినుంచి దింపేసారు. మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సంకీర్ణ మిత్రుడు ఫెర్డినాండ్ మార్కోస్‌ను హత్యచేసేందుకు కుట్రచేసారని, అనూహ్యంగా అవినీతికి పాల్పడినట్లు ఆమెపై అభియోగాలున్నాయి. సెనేట్ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ ఎస్క్యూడెరో పదవీచ్యుతికి సంబంధించిన విచారణ కొత్తసెనేటర్లు వారి సీట్లలోకి వచ్చినతర్వాత విచారణను ప్రారంభిస్తామని ప్రకటించారు. ఒపక్క మధ్యంతర ఎన్నికలకు వస్తున్న తరుణంలో ఎగువసభ 24 మంది సెనేటర్లు సారా భవిష్యత్తును నిర్దేశించనున్నారు. సెనేట్ అధ్యక్షుడు ఎస్క్యూడెరో స్పీకర్ మార్టిన్ రోమ్యుల్‌డెజ్‌కు ఇప్పటికే విచారణకు సంబంధించిన వివరాలు అందచేసారు. ఎగువసభలో జూన్ రెండున ఆమెపై అభియోగాలు విచారించేందుకు సిద్ధమేనని సంసిద్ధతను కూడా తెలిపారు. ఎగువ సభలో అయితే మెజార్టీ సభ్యులు ఏడు అభియోగాలున్నందున వెంటనే ఆమెను ప్రాసిక్యూట్‌చేసి పదవినుంచి దింపేయాలని కోరుతున్నారు. విచారణ అనంతరం సెనెట్ ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి పదవీచ్యుతి కోర్టును ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభిస్తుంది. ఇదే సమావేశంలో జూన్3వ తేదీ ఆమెకు సమన్లుజారీచేయాలని నిర్ణయించారు. 24మందిసభ్యులున్న సెనేట్‌లో ఉపాధ్యక్షురాలిగా ఉన్న సారాకు తొమ్మిది ఓట్లు అదనంగా అవసరం అవుతాయి. అవిలేని పక్షంలో ఆమెను తొలగించడం, ఇక ఎన్నికల్లో మరెప్పుడూ పోటీచేయకుండా నిషేధం విధించడం జరుగుతుంది.


డ్యుటెర్టీ


ఇప్పటికే ఆమె తండ్రి మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టీని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టుచేసింది. డ్రగ్ మాఫియాను అంతం చేస్తామని ప్రకటించిన ఆనాటి అధ్యక్షుడు రోడ్రిగో డ్రగ్ మాఫియా బృందాలను ఎక్కడికక్కడఅంతం చేసారు. దీనితో ఆయనపై అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టువారంటు జారీచేసి వెంటనే అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు. ఇక వంశపారంపర్య రాజకీయాల్లో వచ్చిన సారా ఉపాధ్యక్షురాలి నుంచి 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికలకు సంసిద్ధం అవుతున్న తరుణంలో ఆమెపై వచ్చిన ఈఅవినీతి, హత్యకు కుట్రఅభియోగాలు ఆమె భవిష్యత్తుకు ప్రతిబంధకం కానున్నాయి. 2022లో అధికారంలోకి వచ్చిన సారా మాజీ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్‌తో చేతులు కలిపి ప్రభుత్వం నడుపుతున్నారు. మార్కోస్ ఏకైక కుమారుడు బాంగ్‌బాంగ్ మార్కోస్ ప్రస్తుత అధ్యక్షుడు కావడంతో పాలన సజావుగానే సాగుతుందనుకుంటున్న తరుణంలో విచ్చలవిడి నిధుల దుర్వినియోగం, హత్యకు కుట్రలు వంటి అభియోగాలు ఈసారాను వెంటాడాయి. ఆగ్నేయాసియాలో కేవలం ద్వీప దేశంగా ఉన్న ఈ ఫిలిప్పైన్స్‌కు తైవాన్, జపాన్, పాలావు, ఇండోనేసియా, మలేసియా, వియత్నాం, చైనా వంటి దేశాలు సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ దేశానికి భూసరిహద్దులంటూ ఏమీలేవు. దక్షిణ చైనాతోను, వియత్నాం తోను అత్యంత చేరువగా ఉంటుంది. అయితే ఈ దేశంలో నిరంతరం ఉత్తరకొరియా తరహాలోనే వంశపారంపర్య పాలన కొనసాగుతోంది. తండ్రి రోడ్రిగో డ్యూటెర్టీ తర్వాత అధికార వారసత్వం కొనసాగించేందుకు సారా తహతహలాడుతోంది. న్యాయవిద్యను పూర్తిచేసిన తర్వాత 2007లో రాజకీయాల్లోకి వచ్చిన సారా తొలుత ఆమె స్వస్థలం దావోకు వైస్‌మేయర్‌గా ఎన్నికయ్యారు. రోడ్రిగోకు మానస పుత్రికగా కొనసాగిన సారా 2011లోనే కోర్టు సిబ్బంది ఒకరిని మొఖంపై గుద్ది గాయపరిచి వార్తల్లోకి వచ్చారు. తనతండ్రి లాగే అత్యంత కఠినమైన మహిళ అని అప్పటి నుంచే ఆమెపై విశ్లేషణలు కొనసాగాయి. రోడ్రిగో మొదటిభార్య ఎలిజబెత్ జిమ్మర్‌మాన్ కుమార్తె అయిన సారా 1978లో జన్మించింది. అందువల్లనే ఆమె పూర్తి పేరు సారా జిమ్మర్‌మాన్ డ్యుటెర్టీగా రికార్డుల్లో ఉంటుంది. 32ఏళ్ల వయసులో మేయర్‌గా ఆమె గెలిచిన స్థానంలో అప్పటి వరకూ ఉన్న ఆమె తండ్రి రోడ్రిగో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడిగా రావడంతో మేయర్ పగ్గాలుసారాకు దక్కాయి. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్న సారా దేశ ఉపాధ్యక్షురాలిగా వచ్చారు. మరో అనువంశిక పాలకుడు ఫెర్డినాండ్ మార్కోస్ సాయంతో ఆమె పాలనా పగ్గాలు చేపట్టింది. మార్కోస్ జూనియర్ అధ్యక్షుడుగాను, ఆమె ఉపాధ్యక్షురాలిగా పాలన చేపట్టిన మొత్తం సారా చేతుల్లోనే నడిచింది. అప్పటికే డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించిన రోడ్రిగో అరెస్టు అయి జైలులో ఉండటంతో ఇప్పుడు సారా భవిష్యత్తుకు రక్షణ లేకుండాపోయింది. జూన్ మొదటివారంలో ఆమెపై అభియోగాలను ధృవీకరిస్తే ఆమెకు పదవీచ్యుతి అనేది తప్పదు. అదే జరిగితే ఇక డ్యూటెర్టీ కుటుంబం రాజకీయాలకు దూరం అయి తెరవెనుక రాజకీయాలకే పరిమితం అవుతారనడంలో ఎలాంటి సందేహంలేదు. ●

---

# ఆరవతరం ఇంకెంత దూరంలో ఉంది?


**డి. జె. మోహనరావు**

ప్రపంచం ఇంకా 5జి టెక్నాలజీ గొప్పతనం, దాని విస్తరణ గురించే చర్చించుకుంటోంది. వేగవంతమైన ఇంటర్నెట్, తక్కువ జాప్యం, మెరుగైన కనెక్టివిటీ అందిస్తోన్న 5జి ఒక విప్లవం. అయినా, ప్రపంచం చూపు ఇప్పటికే తర్వాతి తరం వైపు మళ్లింది. అదే 6జి. ఈ రాబోయే మొబైల్ కమ్యూనికేషన్ టెక్నాలజీ డిజిటల్ అనుభవాలను పూర్తిగా మార్చేస్తుంది. 5జి అందించే దానికంటే చాలా ఎక్కువ సామర్థ్యం దీనికి ఉంది. భారతదేశం లాంటి వేగంగా డిజిటల్ అవుతున్న దేశానికి, 6జిలో మన స్థానం, ఆశయాలు, ముందున్న దారిని అర్థం చేసుకోవడం చాలా కీలకం. భారతదేశం 6జికి ఎంత సిద్ధంగా ఉందో అంచనా వేసే ముందు, అసలు 6జి అంటే ఏమిటో తెలుసుకోవాలి. 5జి సెకనుకు 10 గిగాబిట్ల వేగం, 1 మిల్లీసెకను జాప్యం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ 6జి సెకనుకు 1 టెరాబిట్ వేగం –అంటే 5జి గరిష్ఠవేగం కంటే వంద రెట్లు ఎక్కువ – లక్ష్యంగా పెట్టుకుంది. జాప్యం మైక్రోసెకన్లకు పడిపోతుందని అంచనా, అంటే దాదాపు నిజసమయ కమ్యూనికేషన్. 6జి కేవలం వేగం గురించేకాదు, ఇది ఒక సరికొత్తమార్పు. ఇది భౌతిక, డిజిటల్, జీవ ప్రపంచాలను లోతుగా కలిపేస్తుంది. ఎక్కడ చూసినా, దేనికైనా తెలివైన కనెక్టివిటీ దీనితో సాధ్యమవుతుంది. దీని ముఖ్య లక్షణాలు, సంభావ్య ఉపయోగాలు ఇలా ఉంటాయి. అత్యంత వేగం – ఎక్కువ డేటా అవసరమయ్యే పనులకు దాదాపు తక్షణ డేటాబదలీ, అతి తక్కువ జాప్యం – నిజసమయ ఇంటరాక్టివ్ పనులకు, దూరం నుండి శస్త్రచికిత్సలకు, స్వయంప్రతిపత్త వ్యవస్థలకు, వాస్తవిక అనుభవాలకు ఇది కీలకం. అపారమైన కనెక్టివిటీ సాంద్రత – ప్రతి చదరపు కిలోమీటరుకు అద్భుతమైన సంఖ్యలో పరికరాలను కలుపుతుంది, 'ఇంటర్నెట్ ఆఫ్ ఎవ్రీథింగ్' కి ఇది చాలా అవసరం. కృత్రిమ మేధతో కూడిన నెట్‌వర్క్ – 6జి నెట్‌వర్క్‌లు సహజంగా తెలివైనవి, ఇవి తమను తాము మెరుగుపరచుకోవడానికి, వనరులను నిర్వహించడానికి, భద్రతకు, మెషీన్ లెర్నింగ్ వాడతాయి. సెన్సింగ్, ఇమేజింగ్‌తో అనుసంధానం – నెట్‌వర్క్ ఒక పెద్ద సెన్సార్‌లా పనిచేస్తుంది. పర్యావరణ పర్యవేక్షణ, ఆరోగ్య ట్రాకింగ్, స్థానం ఆధారిత సేవలకు ఇది కొత్త మార్గాలను తెరుస్తుంది. కొత్త స్పెక్ట్రమ్ బ్యాండ్‌లు – ఇంతకు ముందు కమ్యూనికేషన్ కోసం వాడని సబ్ టెరాహెర్ట్జ్ , టెరాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లను వాడతారు. విప్లవాత్మక అప్లికేషన్లు – ఇంటర్నెట్ ద్వారా స్పర్శ అనుభూతి, హోలోగ్రాఫిక్ టెలిప్రెజెన్స్, నిజంగా లీనమయ్యే ఎక్స్‌టెండెడ్ రియాలిటీ, పరిశ్రమలకు, నగరాలకు డిజిటల్ ట్విన్స్, ఎక్కడైనా సెన్సింగ్, మనిషియంత్రం మధ్య అతుకులు లేని సంబంధాలు. ఈ సామర్థ్యాలు ఆరోగ్య సంరక్షణ (దూరం నుండి రోగ నిర్ధారణ, రోబోటిక్ శస్త్రచికిత్స), విద్య (హోలోగ్రాఫిక్ తరగతి గదులు), తయారీ (పూర్తిగా ఆటోమేటెడ్, తెలివైన కర్మాగారాలు), రవాణా (అధిక స్వయం ప్రతిపత్త వాహనాలు), వ్యవసాయం (సూక్ష్మ వ్యవసాయం), వినోదం వంటి రంగాల్లో అద్భుతమైన మార్పులు తెస్తాయి. భారత్ 6జి ఆశయం ఈ సాంకేతిక విప్లవంలో ముందుండటం ఎంత ముఖ్యమో గుర్తించిన భారతదేశం, 6జి కోసం స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. టెలికమ్యూనికేషన్స్ విభాగం 'భారత్ 6జి విజన్' పత్రాన్ని విడుదల చేసింది. ఇది దేశ లక్ష్యాలను, ప్రణాళికను వివరిస్తుంది. ఇతర దేశాల్లో అభివృద్ధి చేసిన 6జి టెక్నాలజీని కేవలం వాడే దేశంగా కాకుండా, దాని రూపకల్పన, ప్రమాణీకరణ, విస్తరణలో గణనీయమైన పాత్ర పోషించడం, కొన్ని రంగాల్లో ప్రపంచ నాయకుడిగా ఎదగడం దీని ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ ఆమోదించిన 2030 ఫ్రేమ్‌వర్క్ ఆధారంగా రూపొందింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా 6జి పరిశోధన, ప్రమాణీకరణకు వేదిక. భారతదేశం ఈ అంతర్జాతీయ ఫోరమ్‌లలో చురుకుగా పాల్గొని, మొబైల్ కమ్యూనికేషన్ ప్రమాణాల భవిష్యత్తును రూపొందించడంలో పాలుపంచుకుంటోంది. 2023లో ప్రారంభమైన ఈ అలయన్స్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్‌లు,



పరిశ్రమ ప్రముఖులు, పరిశోధనా సంస్థలు, విద్యావేత్తలు, ప్రమాణీకరణ సంస్థలను ఒకచోట చేర్చింది. భారతదేశంలో 6జి టెక్నాలజీల పరిశోధన, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం, సహకారం పెంచడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం, ఏకాభిప్రాయం సాధించడం, మార్కెట్లో 6జి ని ప్రోత్సహించడం దీని లక్ష్యం. 6జి లక్ష్యం వైపు వివిధ వాటాదారుల ప్రయత్నాలను కలిపే ఒక వేదికగా ఈ అలయన్స్ పనిచేస్తుంది. ప్రభుత్వం పరిశోధన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తోంది. 6జికి కీలకమైన కొత్త వేవ్‌ఫార్మ్ టెక్నాలజీలు, అధునాతన యాంటెన్నా డిజైన్ తెలివైన రిఫ్లెక్టింగ్ సర్ఫేస్‌లు, నెట్‌వర్క్ ఆప్టిమైజేషన్ కోసం కృత్రిమ మేధ నెట్‌వర్క్ స్లైసింగ్ పురోగతులు, భద్రతా ప్రోటోకాల్‌లు వంటి రంగాల్లో ప్రాథమిక పరిశోధన చేపట్టడానికి ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలు, పరిశోధనా కేంద్రాలకు ప్రోత్సాహం, మద్దతు అందిస్తున్నారు. దేశీయంగా 6జి స్టాక్‌ను – భారతదేశంలో అభివృద్ధి చేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ – రూపొందించడంపై కూడా దృష్టిపెట్టారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' (స్వయం సమృద్ధ భారత్) కార్యక్రమంతో ఏకీభవిస్తుంది. క్లిష్టమైన నెట్‌వర్క్ మౌలిక సదుపాయాల కోసం విదేశీ విక్రేతలపై ఆధారపడటాన్ని తగ్గించడం, జాతీయ భద్రతను పెంచడం, దేశీయ తయారీ అవకాశాలను సృష్టించడం దీని లక్ష్యం. 2025 ప్రారంభం నుండి మధ్యకాలం వరకు చూస్తే, 6జి టెక్నాలజీ ప్రపంచవ్యాప్తంగా ఇంకా పరిశోధన, ఆలోచనల దశలోనే ఉందని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రపంచంలో ఎక్కడా పెద్దఎత్తున వాణిజ్య విస్తరణలు లేదా పెద్ద ఎత్తున పరీక్షలు కూడా ఇంకా జరగలేదు. భారతదేశంలో పరిస్థితి ఈ ప్రపంచ వాస్తవికతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం దృష్టి దీనిపై ఉంది. ప్రాథమిక పరిశోధన – సంభావ్య 6జి టెక్నాలజీల సైద్ధాంతిక భావనలను అన్వేషించడం, సిమ్యులేషన్‌లను అమలు చేయడం, ప్రారంభ ప్రయోగశాల ప్రయోగాలు చేయడం, నైపుణ్యం అభివృద్ధికి అవసరమైన అధునాతన రంగాలలో పరిశోధకులకు, ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వడం, సహకారం, అలయన్స్ లాంటి వేదికల ద్వారా విద్యావేత్తలు, పరిశ్రమ, ప్రభుత్వ సంస్థల మధ్య పరస్పర చర్యలను సులభతరం చేయడం, వినియోగ సందర్భాలను గుర్తించడం – భారతదేశానికి ప్రత్యేకంగా ప్రయోజనకరమైన 6జి ఉపయోగాలను అన్వేషించడం. భారతదేశం ఇంకా 5జి విస్తరణలో చాలా కష్టపడుతోంది. ఇది దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. వివిధ భౌగోళిక, జనాభా పరిస్థితులలో 5జి నెట్‌వర్క్‌లను విస్తరించి, ఆప్టిమైజ్ చేయడంలో పొందిన అనుభవం, భవిష్యత్తులో 6జికి మారడానికి విలువైన పాఠాలు నేర్పుతుంది. కాబట్టి, 'భారతదేశంలో 6జి ఎంత దూరంలో ఉంది?' అనే ప్రశ్నకు నేరుగా సమాధానం విస్తృత విస్తరణ లేదా పెద్ద ఎత్తున పరీక్షలు కూడా ఇంకా చాలా సంవత్సరాల దూరంలో ఉన్నాయి. భారతదేశం ప్రస్తుతం క్రియాశీల ప్రణాళిక, ప్రారంభ దశ పరిశోధనలో ఉంది. ప్రపంచ పరిశోధన అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా తన ప్రయత్నాలను సమన్వయం చేసుకుంటోంది. స్పష్టమైన లక్ష్యం, క్రియాశీల చర్యలు ఉన్నప్పటికీ, భారతదేశం 6జి మార్గంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. అధునాతన మౌలిక సదుపాయాలు, ఫ్రీక్వెన్సీలు, అధునాతన అనుసంధానంతో పనిచేయగల అత్యాధునిక పరిశోధనా సదుపాయాలను అభివృద్ధి చేయడానికి భారీ పెట్టుబడులు అవసరం. నైపుణ్యం కలిగిన మానవశక్తి – 6జికి అవసరమైన అత్యంత ప్రత్యేక రంగాలలో నైపుణ్యం కలిగిన పరిశోధకులు, ఇంజినీర్లకు ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో కూడా గణనీయ మైన కొరత ఉంది. దా అప్లికేషన్ అభివృద్ధిలో కొన్ని ప్రాంతాల్లో భారతదేశం నాయకత్వం వహించే అవకాశం ఉంది. 6జి కొత్త పరిశ్రమలను ప్రారంభిస్తుంది, లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తుంది, అన్నిరంగాలలో డిజిటల్ మార్పును నడిపిస్తుంది, భారతదేశ ఆర్థికవ్యవస్థను గణనీయంగా పెంచుతుంది. మెరుగైన డిజిటల్ కనెక్టివిటీ – మరింత సరసమైన, ఎక్కడైనా ఉండే కనెక్టివిటీ డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, మారుమూల ప్రాంతాలు, అట్టడుగు వర్గాలను డిజిటల్ ప్రపంచంలోకి తీసుకువస్తుంది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి –స్వదేశీ సామర్థ్యాలనుఅభివృద్ధిచేయడం విదేశీ టెక్నాలజీలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ●

అమరావతి వార్త



## పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలిసిన 104 ప్రతినిధులు

**నరసరావుపేట, మే 24 ప్రభాతవార్త :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిని 104 నిర్వహణ సంస్థ భవ్య కంపెనీ నుండి ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 104 రీజనల్ మేనేజర్ కలీమ్, 104 జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్స్ పెద్దిరాజు, దావీదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా మొబైల్ మెడికల్ యూనిట్‌ను సందర్శించారు. రోగులు, వారి సిబ్బందితో మాట్లాడి 104లో వైద్యసేవల గురించి చర్చించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవి తనను కలిసిన వారికి వైద్యసేవలకు సంబంధించి పలు సూచనలు చేశారు.



# రైతుల సంక్షమమే ప్రభుత్వ లక్ష్యం

**బాపట్ల,మే24,ప్రభాతవార్త:** పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీని చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజారపు అచ్చంనాయుడు భరోసా ఇచ్చారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం మార్టూరు మండలంలోని పర్చూరు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సుదీర్ఘ చర్చ అనంతరం



బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామన్నారు. కామన్ వెరైటీ క్వింటా ధర రూ.12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని రూ.6,000ల లతో కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలలో హెచ్చు, తగ్గులు ఉన్నప్పటికీ నిర్ణయించిన ధరను అమలు చేయాలని కంపెనీలకు సూచించారు. పొగాకు కొనుగోలులో ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే మార్క్ ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించారు. చివరి ఆకు వరకు రైతులు పండించిన పొగాకు పంటను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వాని దేనన్నారు. ఇందుకోసమే ఆరు సబ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కంపెనీలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కంపెనీల వద్ద సిబ్బంది లేకపోతే ప్రభుత్వ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. వేర్ హౌసింగ్ గోడౌన్లను వినియోగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షోభం నుంచి రైతులను బయటకు తెచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కంపెనీలు కథలు చెప్పడం మాని రైతులకు మేలు చేసే ఉద్దేశంతో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కంపెనీలు స్పందించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారనే విషయాలను గుర్తించాలన్నారు. బయ్యర్లుగా ఉన్న కంపెనీలు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. సాధారణంగా 25 మిలియన్ కిలోల పొగాకు సాగు చేయాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 75 మిలియన్ కిలోల పొగాకు సాగు చేపట్టినట్లు తెలిపారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లో కొంత డిమాండ్ తగ్గడమే సంక్షోభానికి కారణమని వివరించారు. మిర్చి, కొబ్బరి, బ్లాక్ బర్లీ, మామిడి పంటలు సంక్షోభంలోకి కూరుకుపో పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రైతులకు ధైర్యం కల్పించాలి, వారి కొరకు కంపెనీలు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ సంక్షోభం లాంటి ఇబ్బందులు వచ్చినప్పుడే రైతులను ఆదుకోవాలని అన్నారు. కంపెనీల ప్రోత్సాహంతోనే బ్లాక్ బర్లీ పొగాకును రైతులు సాగు చేశారని, చివరి ఆకు వరకు కొనేలా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. ఆత్మహత్యలు అనే మాట వినపడరాదు, అలాంటి ఆలోచన రైతుల్లోకి రాకూడదన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం నిలిచిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో కంపెనీలు ముందుకు రావాలి కోరారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం కాపాడుతుందని, ఆఖరి కిలో సైతం పొగాకు కంపెనీలు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేపిస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చిందన్నారు. రైతుల శ్రమను ప్రభుత్వం గుర్తించిందన్నారు. మంచి ధరలతో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. పొగాకు రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మంత్రి ప్రకటించిన ధరలతో కంపెనీలు ముందుకు వచ్చి పొగాకు పంటను

### పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
### -మంత్రి కింజారపు అచ్చంనాయుడు



కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ, ధరల అమలుపై నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రభుత్వం కేటాయించిన మేరకు కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయా లేదా నిరంతరం పరిశీలిస్తావన్నారు. సంక్షోభంలో ఉన్న పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావు చెప్పారు. రెండు గ్రేడ్లతోనే పొగాకు కొనుగోలు జరగాలన్నారు. పర్యవేక్షణ సెల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టే విధి విధానాలను ఆయన వివరించారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా కంపెనీలు ముందుకు రావాలని ఆయన కోరారు. బ్లాక్ బర్లీ పొగాకు సాగుతో తీవ్రంగా నష్టపోయామని, కనీస మద్దతు ధర అమలు చేయాలని ఇంకొల్లు దుద్దుకూరు రైతులు హరిబాబు, వాసు బాబు, కె వెంకట సుబ్బారావు, సూది సుబ్బారావు, మహిళా రైతు రమాదేవి, జె పంగులూరు మండలం రైతులు రావూరి రమేష్ బాబులు కోరారు. న్యాయం చేయాలంటూ మంత్రి వద్ద అభ్యర్థించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఈడి విశ్వసే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి సురేష్, సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మార్క్ ఫెడ్ అధికారి కరుణ, ఉద్యాన శాఖ ఏడి జెన్నమ్మ, 20 కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు కనువిందు చేసిన స్వామివారి గ్రామోత్సవం

**పొన్నూరు, మే24,ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామివారి హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపైకి స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా కోలాటాలు, చెక్క భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామోత్సవంలో ఉష్ట్రవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారికి భక్తులు నారికేళాలు, కథలీఫలాలు, మామిడి పండ్లు, పంచ కజ్జాయం తదితరాలను సమర్పించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు.



## నగరంలో పలు ప్రాంతాలలో పర్యటించిన మేయర్,కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్,మే24,ప్రభాతవార్త :** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో హోల్ సేల్ మార్కెట్లలో ఆశీలు వసూళ్ళకు టెండర్ పొందిన వాళ్ళు నిర్దేశిత ప్రాంతంలోనే ఆసీల్లు వసూళ్ల చేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో రోడ్లు, డ్రైన్ల ఆక్రమణల తొలగింపుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో పారిశుధ్య మెరుగుదలకు గత కొంతకాలంగా అధిక ప్రాధాన్యతతో కృషి చేస్తున్నామని, అదనపు



వ్యర్ధాలను కూడా వారే తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి బండ్ల బజార్ (హోల్ సేల్ ఫ్రూట్ మార్కెట్), లాలాపేట, పట్నంబజార్, ఆదర్శ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా పై అందిన పిర్యాదులను నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, క్లీన్ గ్రీన్ గుంటూరు కోసం నగర పాలక సంస్థ అన్ని విభాగాలు ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నామని, నగర ప్రజలు మరియు వ్యాపార సంస్థలు కూడా సహకరించాలని కోరారు. నగర నడిబొడ్డులోని పట్నం బజారులో ప్రతి రోజు క్వింటాల కొద్దీ వ్యర్ధాలు వస్తున్నాయని, వాటిని సరైన పద్దతిలో తొలగించకపోవడం వలన స్థానికంగా తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. హోల్ సేల్ మార్కెట్ లో అసీలు వసూళ్ళకు టెండర్ పొందినవారు నిర్దేశిత ప్రాంతంలో నూరు శాతం వ్యర్ధాలను తొలగించాల్సిందేనన్నారు. అలాగే నగరంలో పారిశుధ్యం, త్రాగు నీటి సరఫరా పై అందే పిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులు సదా సిద్దంగా ఉండాలన్నారు. కార్మికులు, వాహనాలు, పుష్ కార్ట్స్, సామగ్రిని అందించామన్నారు. శానిటరీ వార్డుల వారీగా ఉదయం సాయంత్రం పారిశుధ్య పనుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించామన్నారు. లాలాపేట పట్నం బజారు, బండ్ల బజారు ప్రాంతాలలో హోల్ సేల్ వ్యాపారస్తుల నుండి అసీలు వసూలు చేసే టెండర్ దారు ఆయాప్రాంతాల పరిశుభ్రత బాధ్యత తీసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాలలో జియంసి పారిశుధ్య విభాగం శుభ్రం చేయడానికి ప్రత్యేక ద్రుష్టి సారించాలని ఆదేశించారు. వ్యాపారస్తులు కూడా వ్యర్ధాలను రోడ్ల పై వేయకుండా డస్ట్ బిన్నులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆదర్శ నగర్ లో త్రాగు నీటి సరఫరా పై అందిన పిర్యాదు ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు మహమ్మద్ చిష్టి, ఈరంటి వరప్రసాద్, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, యస్.ఈ నాగమల్లేశ్వరరావు, రెవిన్యూ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా నేర సమీక్ష నిర్వహించిన పల్నాడు జిల్లా ఎస్పీ

**నరసరావుపేట క్రైం, మే 24 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శనివారం నిర్వహించారు. శాంతి భద్రతల



పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేర నియంత్రణకు సంబంధించి ఎస్పీ కె.శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చేవారితో ఓపికగా విని వారికి న్యాయం చేస్తామనే నమ్మకం కలిగించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను తప్పనిసరిగా నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రోడ్డు నివారణకు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చోట సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని నియంత్రించాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశలిచ్చారు. సమావేశంలో అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, డిఎస్పీలు నాగేశ్వరరావు, హనుమంతరావు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలలో అన్నదమ్ములు మృతి

**వెల్దుర్తి, మే 24 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండల పరిధిలోని బోదిలవీడు గ్రామ సమీపంలో గుండ్లపాడు గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, అతని తమ్ముడు కోటేశ్వరరావు అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద మృతి చెందారు. ఇద్దరూ బోదిలవీడు గ్రామ సమీపంలో రోడ్డు పక్కన పంట పొలాల్లో చనిపోయి ఉన్నారు. సంఘటనా స్థలంలో మృతులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని, నంబరు ప్లేట్ కూడా లేని స్కార్పియో వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లుగా ఉంది. ప్రమాదంలో చనిపోయిన అన్నదమ్ములు తెదేపా కార్యకర్తలు కావడం, ప్రమాదానికి కారణమైన స్కార్పియో వాహనం తెదేపాకు చెందిన వారిది కావడం సంఘటనా తీరు అనుమానాస్పదంగా స్థానికులు చర్చించుకుంటున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, వెల్దుర్తి ఎస్సై సమందర్‌వలి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు





మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తీరుపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పూర్తి దర్యాప్తు చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## మంగళగిరి నియోజకవర్గంలో ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ

**మంగళగిరి, మే 24, ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక మేరకు స్థానిక నాయకులు శనివారం బాధిత కుటుంబాలకు అందజేశారు. దుగ్గిరాల మండలం పేరకలపూడి గ్రామానికి చెందిన నల్లగోర్ల వెంకటరమణకు రూ. 2,18,600 లక్షలు, పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ జాన్ బాషాకు రూ. 2,00,000 లక్షలు లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని ఆశయంతో మంత్రి నారా లోకేష్ సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యశాలలో లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేం దుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, కంచర్ల బద్రి, మీనుగుల వెంకటేష్, షేక్ ఇసుబ్, షేక్ మీరా వలి తదితరులు పాల్గొన్నారు.



## స్విగ్గీ,జొమాటో రన్నర్స్ భద్రతా నియమాలను పాటించాలి : ఏడిసిపి ప్రసన్నకుమార్

**విజయవాడ క్రైం,మే 24,ప్రభాతవార్త:** నగరంలో స్విగ్గి, జొమాటో రన్నర్స్ ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని హెల్మెట్ తప్పక ధరించాలని, వారి మోటారు సైకిలు యొక్క అన్ని రికార్డులు నిబంధనలకనుగుణంగా ఉండాలని, త్వరగా డెలివరీ చేయాలనే ఆతృతతో హైస్పీడ్‌గా వెళ్ళడం, రాష్ డ్రైవింగ్ చేయరాదని, ఒన్‌వే వయోలేషన్ చేయరాదని, తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలని ట్రాఫిక్ ఏడిసిపి ఎవిఎల్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. సిపి ఆదేశాల మేరకు ఆయన అధ్వర్యంలో నగరం లోని స్విగ్గి, జొమాటో ర్నర్స్, వాహనాలకు నెంబర్ ప్లేట్ స్టిక్కరింగ్ చేసే షాప్ ఓనర్స్, కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ లను ఏర్పాటు చేయే షాప్ ఓనర్స్‌లతో ఈ రోజు పోలీసు కమాండ్ కంట్రోల్ రూం నందు మీటింగ్ నిర్వహించి, వారికి రహదారి భద్రతా నియమాలు, ఎంవి చట్టాలపై అవగాహన కల్పించారు. వాహనాలకు, నెంబర్ ప్లేట్ స్టిక్కరింగ్ చేసే షాప్ ఓనర్లు, కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లను ఏర్పాటు చేసే షాప్ యజమానులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం సూచించిన రంగు, సైజులలో మాత్రమే నెంబర్ ప్లేట్‌లపై నెంబర్లు, స్టిక్కరింగ్ చేయాలని, మరే ఇతర బొమ్మలు గాని, సూక్తులు గాని, నెంబర్ ప్లేట్స్ పై అతికించరాదని, ఆర్‌సి చూసి అందులో ఉన్న నెంబరును మాత్రమే నెంబర్ ప్లేట్స్‌పై అతికించాలని, రాంగ్ నెంబరు ప్లేట్స్ తయారు చేయరాదని, అలా చేస్తే అది క్రిమినల్ కేసు అవుతుందన్నారు. కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ అతికించేవారు ఖచ్చితంగా 70% కనిపించేలా మాత్రమే బ్లాక్‌ఫిల్మ్



అతికించాలని, ఒకవేళ కారు ఓనర్ అంతకు మించి డిమాండ్ చేస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, విజిబిలిటీ లేని బ్లాక్ ఫిల్మ్ వద్ల కారు డోర్స్ లాక్ అయ్యి అందులో చిక్కుకున్న పిల్లలు ఊపిరి ఆడక మరణించిన ఉదాహరణలు కూడ ఉన్నాయని తెలియచేస్తూ పలు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి వంశీధర్, ట్రాఫిక్ సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మే24 ,ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక



డివిసి కళ్యాణమండపంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హితోధికంగా కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మందికి రక్షణగా నిలుస్తున్నార న్నారు. పేద ప్రజలు ఎవరూ అధైర్యపడకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పెదకాకాని మండలం, వెనిగండ్లకు చెందిన దాన బోయిన నాగమణికి రూ.51,309, పెదకాకాని గ్రామానికి చెందిన షేక్ బాషాకు రూ.25,166, చేబ్రోలు మండలం, వేజండ్ల గ్రామానికి చెందిన గొల్లపూడి ఉదయలక్ష్మికు రూ.6,00,173, పొన్నూరు మండలం పెదపాలెంకు చెందిన మల్లంపాటి రమ్యలిప్సికకు రూ.45,350లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

## యోగాంధ్రలో భాగంగా యోగా కార్యక్రమాల నిర్వహణ
### -వార్డు సచివాలయ సిబ్బంది,ప్రజల భాగస్వామ్యంతో యోగా కార్యక్రమాలు

**విజయవాడ కార్పొరేషన్,మే 24,ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విజయవాడ లోని 64 డివిజన్లలో స్పెషల్



ఆఫీసర్లు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్రలో భాగంగా వార్డు సచివాలయ సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో తమ తమ డివిజన్‌లలో యోగా కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా సర్కిల్-1 పరిధి లోని కెఎల్‌రావు పార్క్, సర్కిల్-2 పరిధి లోని బిఆర్టీఎస్ రోడ్, సర్కిల్-3 పరిధి లోని రివర్ ఫ్రంట్ పార్కులలో యోగా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల భాగస్వామ్యంతో యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించారు. 64 డివిజన్‌లలోనే కాకుండా వెహికల్ డిపోలో కూడ డ్రైవర్లు, సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి ఏడు గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతీ, యువకులు, ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉన్న ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు బీఆర్టీఎస్ రోడ్‌లో నిర్వహించే యోగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కమీషనర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు.

## సముద్రతీర ప్రాంతాలలో డ్రోన్‌లతో నిఘా
### -యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పటిష్ట చర్యలు
### -జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**బాపట్ల,మే24,ప్రభాతవార్త:** యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సముద్రతీర ప్రాంతాలలో నిఘా కోసం డ్రోన్ లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో పోలీస్ అధికారులు శనివారం బాపట్ల జిల్లాలోని సూర్యలంక, రామాపురం బీచ్ లలో, వాడరేవు సముద్రతీర ప్రాంతాలలో డ్రోన్ లను ఎగురవేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లలో ఆహ్లాదకరంగా గడిపేందుకు చుట్టుపక్క ప్రాంతాల నుండే కాక ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి యాత్రికులు వస్తుంటారన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కనుక యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా సముద్ర తీర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అలాగే అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే ఉద్దేశంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డ్రోన్ లతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రోన్ లను సముద్ర తీరాలలో ఎగరవేసి వాటి ద్వారా యాత్రికులు ఎవరైనా ఎక్కువ లోతుకు వెళుతున్నట్లయితే వారిని గుర్తించి హెచ్చరించడం, ఎవరైనా ప్రమాదానికి గురి అయినట్లయితే వెంటనే గజఈతగాళ్ళు, అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసులను అప్రమత్తం చేసి వారిని కాపాడడం, యాత్రికులకు, మహిళలకు అసౌకర్యం కలిగించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు, సముద్రతీర పరిసర ప్రాంతాలలో అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడిచేసేందుకు డ్రోన్ లను వినియోగిస్తున్నామని తెలిపారు. యాత్రికులు పోలీస్ శాఖ సూచనలను పాటిస్తూ ఆహ్లాదకరంగా గడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ చేసే సూచనలు యాత్రికుల రక్షణకోసమేనని గ్రహించి పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు.



## పల్నాడు జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శిగా మర్రి సుబ్బారెడ్డి

**రాజుపాలెం, మే 24 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శిగా మర్రి సుబ్బారెడ్డి శనివారం నియమితులయ్యారు. సుబ్బారెడ్డి నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు, ముఖ్యంగా సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి పేర్కొన్నారు.



# తెదేపాకు బలం,బలగం కార్యకర్తలే

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు,మే24,ప్రభాతవార్త:** "తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం.. ఆ కార్యకర్తల కోసమే నిరంతరం మా పోరాటం" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ



సీనియర్ నాయకులు, రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా గుండెపోటుతో మరణించారు. శనివారం కరిముల్లా కుటుంబ సభ్యులను పెమ్మసాని రవితో కలిసి ఎమ్మెల్యే నసీర్ పరామర్శించారు ఈ సందర్భంగా కరిముల్లా కుటుంబ సభ్యులకు టీడీపీ కార్యకర్తల నిధితోపాటు తమ వంతు ఆర్థిక సహాయం కలిపి రూ.6 లక్షలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో 30 ఏళ్లకుపైగా క్రియాశీలకంగా వ్యవహరించిన కరిముల్లా లేని లోటు పార్టీకి తీర్చలేనిదని చెప్పారు. మైనారిటీల కోసం కరిముల్లా చేసిన సేవలు ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తన భుజస్కందాలపై వేసుకొని పోరాడారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి నాయకుడు దూరమవడం చాలా తీవ్రంగా కలిసి వేసిందని పేర్కొన్నారు. కరిముల్లా కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున అండగా నిలుస్తామని, వారి కుటుంబంలో పిల్లలకు విద్య, ఉద్యోగాల విషయంలో అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శంకరి శ్రీనివాస్, ఎల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు తాడిపోయిన చిన్న బుజ్జి, మాజీడిప్యూటీ మేయర్ గౌస్, జాగర్లమూడి శ్రీనివాస్, క్లస్టర్ చెల్లా ఆంజనేయ ప్రసాద్,జమీర్, వంగరు ఏడుకొండలు, గోల్డ్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## చలనచిత్ర సీమలో ఓ స్వర్ణకమలం సిరివెన్నెల

గుంటూరు కల్చరల్,మే 24,ప్రభాతవార్త : తెలుగుజాతి గర్వించదగ్గ అసమాన ప్రతిభాశాలి,సార్థక నామధేయులు, సూర్యచంద్రులున్నంతవరకు తెలుగువారికి మీరే సిరివెన్నెల అని అవగాహన సంస్థ అనుబంధ సంస్థ హాస్యవల్లరి బృందసభ్యులు నివాళులర్పించారు.సంస్థ కార్యాలయంలో పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో సంగీత విద్వాంసులు,గాయకులువి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు మాట్లాడుతూ దాదాపు 800 సినిమాల్లో 2400పాటలు రాసిన సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ తాత్వికుడు, శ్రామికుడు ,ప్రేమికుడని తన పదాల మొక్కలు నాటి పాటల పూలు పూయించిన తోటమాలి అన్నారు.ఫ్రీలాన్స్ జర్నలిస్టు, కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్న చిరుదీపంలా మొదలై అఖండఖ్యాతిలా ప్రజ్వరిల్లిన సిరివెన్నెల భాషలో వైవిధ్యంతో,చతురతతో కవితాత్మను కళాత్మకంగా ఆవిష్కరించారన్నారు.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం

## -అర్బన్ సిఐ లావూరి వీరానాయక్

**పొన్నూరు, మే24 ,ప్రభాతవార్త:** సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని, అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలకు కూడా విరుద్ధమని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారికి, వాహనాలను నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలను నడపడం చట్టవిరుద్ధమన్నారు. మైనర్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దన్నారు. మైనర్లచే వాహనాలను నడిపిస్తే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. అప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే కేసులు నమోదు చేశామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్‌ను దగ్గర ఉంచుకోవాలన్నారు. విరుద్ధంగా వ్యవహరించినవారికి జరిమానాలు విధిస్తామన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

**నూజెండ్ల,మే24,ప్రభాతవార్త:** మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయం వద్ద పంచాయితీ కార్యదర్శి రవీంద్ర అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు



మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని కలిసిన న్యాయవాదులు

**నరసరావుపేట, మే 24 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్



న్యాయవాదులు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వైకాపా పార్టీకి సంబంధించి అనుబంధ విభాగాలలో నూతనంగా పలువురు న్యాయవాదులు నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ లీగల్ సెల్ విభాగం అధ్యక్షునిగా వై.సీతారామిరెడ్డి, ఆర్‌టిఐ విభాగం అధ్యక్షునిగా జి.హనుమంతరావు, క్రిష్టియన్ మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షురాలుగా గార్లపాటి మేరీ బ్లెస్సీనా నియమితులు కావడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో న్యాయవాదుల సేవలు పార్టీకి ఎంతో అవసరమన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుండి బాధ్యతలు స్వీకరించిన పలువురు అంకితభావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. ఆదర్శ భావాలు కలిగిన న్యాయవాదులు వైఎస్సార్‌సీపీలో పదవులు అందుకోవడం సంతోషమన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలపర్తి వెంకటేశ్వరరావు, జంగాల మాణిక్యమ్మ, అనీల, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

పొన్నూరు, మే24,ప్రభాతవార్త: తెలంగాణా రాష్ట్రం, భద్రాచలం-కొత్తగూడెం జిల్లా ఎమ్మెల్యే,



కమ్యూనిస్టు నాయకుడు కూనంనేని సాంబశివరావును పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాంబశివరావును కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. పొన్నూరు కీర్తిని జాతీయస్థాయిలో నిలిపిన దివంగత చెడుగుడు-కబడ్డీ క్రీడాకారుడు పడమట చెంచయ్య, పడమట సుభాష్‌చంద్రబోస్, జక్కా శ్రీనివాస్‌ల గురించి స్మరించుకొన్నారు. సాంబశివరావును కలిసినవారిలో కాంగ్రెస్ పార్టీ పొన్నూరు మండలాధ్యక్షుడు అందె దిలీప్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాడిశెట్టి సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొందలపాటి శ్రీను, రాజేష్, ఫణి, రేవంత్ తదితరులున్నారు.

## భక్తి శ్రద్ధలతో హనుమత్ రక్షాయాగం పూర్ణాహుతి

నూజెండ్ల, మే24, ప్రభాతవార్త: మండలంలోని రవ్వారం గ్రామ సమీపంలోని జగన్మాత పీఠం నందు హనుమత్ రక్షాయాగం పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో శనివారం నిర్వహించడం జరిగింది. ఉగాది రోజు ప్రారంభమైన ఈ యాగంలో దేశ, విదేశాల నుంచి భక్తులు పాల్గొనడం



జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## పలువురు వైకాపా నాయకులను పరామర్శించిన అంబటి

**పొన్నూరు, మే24,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శనివారం అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకొంటున్న నాయకులను పరామర్శించారు. మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన సూదా సముద్రయ్య, సింగారెడ్డి వెంకటరెడ్డి ఇటీవల



అనారోగ్యానికి గురై చికిత్స పొంది విశ్రాంతి తీసుకొంటున్నారు. వారి ఇళ్ళకు అంబటి వెళ్ళి వారిని పరామర్శించారు. అనారోగ్యానికి దారి తీసిన పరిస్థితుల గురించి వాకబు చేశారు. అంబటి వెంట వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బొనిగల వేణుప్రసాద్, వ్యవసాయ సలహా మండలి మాజీ మండలాధ్యక్షుడు లంకపోతు పిచ్చిరెడ్డి తదితరులున్నారు.

## విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

**నరసరావుపేట, మే 24 ప్రభాతవార్త :** విదేశాలలో ఐటి, టెలికం సేవలలో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శనివారం కోరారు. అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్, అనుభవం కలిగిన సర్టిఫికెట్, విద్యా ధృవపత్రాలతో దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, పూర్తి స్థాయి వివరాల కొరకు కమాండ్ కంట్రోల్ 9988853335 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి వేతనాలు ఏడాదికి రూ.26 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. రెండు సంవత్సరాల ఒప్పంద కాలం ఉంటుందన్నారు. సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఏడాదికి 20 రోజులు సెలవులు ఇస్తారని తమ్మాజీరావు తెలియజేశారు. 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి ఐదు సంవత్సరాల అనుభవం ఐటి, టెలికం సేవలలో ఉండాలని సూచించారు.

## కొల్లూరు రేషన్ డీలర్లతో, వీఆర్వోలతో తహశీల్దార్ సమీక్ష సమావేశం

**కొల్లూరు, మే 24 (ప్రభాతవార్త) :** జూన్ 1వ తేది నుండి రేషన్ షాపు నుండి నిత్యావసర సరుకులు పంపిణీ జరుగుతున్న సందర్భంగా



శనివారం కొల్లూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, గ్రామ రెవెన్యూ అధికారులతోనూ విధి విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ చౌక దుకాణాలను తనిఖీ చేసి ఈపిఓఎస్ మిషన్లను ఎండియు ఆపరేటర్లు వద్ద నుండి రేషన్ డీలర్లకు అందే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ పంపిణీ జూన్ ఒకటివ తేది నుండి రేషన్ షాపుల నుండి నిత్యావసర సరుకులు పంపిణీ జరుగుతుందని రేషన్ షాపులో 1వ తేది నుండి 15వ తేది వరకు పంపిణీ ఉంటుందని ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8గంటల వరకు పంపిణీ జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, మండల పరిధిలోని డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి రీ వెరిఫికేషన్ ఫలితాలలో నంది స్కూల్ ప్రభంజనం

**పెదనందిపాడు మే 24,ప్రభాతవార్త :** 10వ తరగతి రీ వెరిఫికేషన్ ఫలితాలలో నంది స్కూల్ మరొకసారి ప్రభంజనం సృష్టించింది. 2024 25 విద్యా సంవత్సరానికి ప్రకటించిన 10వ తరగతి రీ వెరిఫికేషన్ ఫలితాలలో ఎన్ .స్నేహిత



గతంలో 588 మార్కులు రాగా ఫ్రీ వెరిఫికేషన్ ఫలితాలలో 590 మార్కులతో చుట్టుపక్కల ఉన్న పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు. వట్టిచెరుకూరు నాలుగు మండలాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని ఎన్ స్నేహిత. అదేవిధంగా మరో ముగ్గురు విద్యార్థులకు ఈ రీ వెరిఫికేషన్ ఫలితాల్లో మార్కులు కలవడం జరిగింది. కే . షామిక అనే విద్యార్థినికి గతంలో 563 రాగ ప్రస్తుతం 569 మార్కులు, సయ్యద్ మజీద్ ఫర్హాన్ అనే విద్యార్థికి గతంలో 513 మార్కులు రాగా ప్రస్తుతం 533 మార్కులు, యర్రాకుల యజ్ఞ నారాయణ అనే విద్యార్థికి గతంలో 549 మార్కులు రాగా ప్రస్తుతం 550 మార్కులు సాధించారు.రీవెరిఫికేషన్ ఫలితాల్లో మార్కులు పెరిగిన విద్యార్థులకు నంది స్కూల్ విశ్రాంత విజిలెన్స్ ఎస్పి కాళహస్తి సత్యనారాయణ , సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ విజ్ఞాన సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య . ట్రెజరర్ లావు ఆదిశేషయ్య, జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ . సభ్యులు నర్రా వీరయ్య , పి.ఎ.ఎస్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వీర రాఘవయ్య . ఫీజికల్ డైరెక్టర్ డాక్టర్. పాతూరి శ్రీనివాసరావు నంది స్కూల్ ప్రధానోపాధ్యాయులు నల్లూరు సత్యనారాయణ మరియు ఉపాధ్యాయ బృందము విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు . పాఠశాల అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ చుట్టుపక్కల ఉన్న పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు మరియు వట్టిచెరుకూరు మండలాల్లో 590 నంది స్కూల్ ప్రథమ స్థానంలో నిలిపినందుకు ప్రత్యేకంగా ఎన్ స్నేహితకి అభినందనలు తెలియజేశారు.

## ట్రాన్స్ జెండర్స్ చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

### -అర్బన్ సిఐ వీరానాయక్

పొన్నూరు, మే24,ప్రభాతవార్త: ట్రాన్స్ జెండర్స్ చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. పట్టణంలో ఎటువంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలు కానీ, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం గాని చేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. అంతేకాకుండా ప్రజలను పట్ల అసభ్యంగా



ప్రవర్తించినా చూస్తూ ఊరుకోబోమన్నారు. ట్రాన్స్ జెండర్స్ వారి యొక్క ప్రవర్తనకు లోబడి మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వివిధ ప్రాంతాలలో బిక్షాటన చేస్తున్న వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అంతేకాకుండా బైండోవర్ చేసి పంపించారు.

## 27న శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

**మంగళగిరి, మే 24, ప్రభాతవార్త :** శ్రీ గంగా భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి దేవస్థానం సన్నిధానం లో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోఅన్నదాన కార్యక్రమాన్ని 40 మంది ట్రస్ట్ బోర్డు సభ్యులు, శివాలయం ఆలయ చైర్మన్ భోగి కోటేశ్వరరావు సహకారంతో చైర్మన్ పందేటి సాంబశివరావు బోర్డు సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య అన్నదాన కార్యక్రమం భక్తుల సహకారంతో దిగ్విజయంగా నేపథ్యంలోఈ నెల 27 న అమావాస్య మంగళవారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చైర్మన్ పొందేటి సాంబశివరావు తెలిపారు..ఈ కార్యక్రమన్ని శివాలయం పక్కన గల గ్రౌండ్ నకు మార్చడం జరిగిందని తెలిపారు.భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమం లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామి వారి ఆశీస్సులను పొందాలని ఈ సందర్భంగా కోరారు.



## అల్లిబాయిపాలెంలో మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు చర్యలు : ఎంపిడివో

**నూజెండ్ల,మే24,ప్రభాతవార్త:** మండలంలోని అల్లిబాయిపాలెం గ్రామం లో తాగునీటి సమస్య త్వరితగతిన పరిష్కరిస్తామని ఎంపిడివో ఉమాదేవి తెలిపారు. శనివారం అధికారులతో కలసి గ్రామాన్ని సందర్శించిన ఎంపిడివో గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని ఎంపిడివో దృష్టికి తీసుకువచ్చారు.



ఎంపిడివో మాట్లాడుతూ గ్రామంలో వీలైనంత త్వరగా మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిరావులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా హైడ్రామా

### -జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు

**గురజాల, మే 24 ప్రభాతవార్త:** గురజాల నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ హైడ్రామా ఆడుతుందని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడ్డ యేడాది



కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఒక పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంతో కూటమి ప్రభుత్వం దూసుకెళ్తుందన్నారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సారథ్యంలో కాలువల ఆధునీకరణ, రోడ్ల మరమ్మతులు, జానపాడు రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపణ, పిడుగురాళ్ల పట్టణంలోని విశాలవంతమైన పార్కు, కేశానుపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి, బుగ్గవాగు ద్వారా ఇంటింటికి మంచినీరు అందించే సౌకర్యం ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన పనులు మొదలు పెడుతుంటే చూసి ఓర్వలేక శాసనసభ్యుడు శ్రీనివాసరావుపై బురదజల్లే ప్రయత్నం చస్తున్నారన్నారు. . ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పోటు నాగేశ్వరరావు, శరమాల హనుమంతురావు, కత్తి ప్రసంగి, చలమరాజు, చింతకాయల కళ్యాణ్, కొట్టే శ్రీను, పెరుమాళ్ల ప్రభాకరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## రెంటచింతలకు స్పెషల్ గ్రేడ్ పంచాయతీ హోదా

**రెంటచింతల, మే24 ప్రభాతవార్త:** పంచాయతీ వ్యవస్థను పటిష్టపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా,



గ్రామపంచాయతీల హోదాలో మార్పుల ఫలితంగా రెంటచింతలకు స్పెషల్ గ్రేడ్ పంచాయతీ హోదా నిర్ణయం జరిగింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో మార్పులు చేస్తూ పంచాయతీల ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో రెంటచింతల ఒక స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా రూపుదాల్చనుంది. రాష్ట్రంలో పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ హోదా కల్పించడం ఇదే తొలిసారి. పదివేలకు పైగా జనాభా, ఏడాదికి రూ.కోటి ఆదాయం ఉండే పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా విభజిస్తూ కూటమి ప్రభుత్వం పూర్వకాలం నుంచి ఉన్న గ్రేడ్ వ్యవస్థల్లో అనేక మార్పులు చేస్తూ పంచాయతీరాజ్ స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ప్రతి పంచాయతీకి డిప్యూటీ ఎంపీడీఓ హోదాతో ఒక అధికారి ఉండటంతో తద్వారా పాలన మెరుగుపడే అవకాశం ఉంది. ఇది గ్రామపంచాయతీ వ్యవస్థకు చాలా శుభపరిణామం. అటు నగర పంచాయతీలకు ఇటు గ్రామ పంచాయతీలకు నడుమ ఉండే స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు ఈ మార్పు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. జనాభా అధికంగా ఉండే ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పరిపాలన సౌలభ్యం కోసం తీసుకుంటున్న ఈ నిర్ణయం ప్రజల ప్రశంసలు అందుకోనుంది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

వినుకొండ, మే24, ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో పుట్టారెడ్డి అధ్యక్షతన సమావేశం శనివారం నిర్వహంచారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించేలా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు



అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడివో సుందర్‌రెడ్డి, ఏవో వెంకట రవి, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ పచ్చిగోళ్ళ ప్రభాకర్‌రావు, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, నడిగడ్డ మాజీ సర్పంచ్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ విద్యార్థినులకు నగదు బహుమతి అందజేత

**గురజాల, మే 24 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థినులు నగదు బహుమతి అందుకున్నారు. విద్యార్థిని సీహెచ్ పూజిత 594 మార్కులు మండల ప్రథమం సాధించగా రూ. లక్ష, అలాగే చందుకు రూ. 50 వేలు అర్థికసాయం



చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్‌వీఎన్ పాపారావు, ప్రిన్సిపాల్ కాసిం, ఇన్‌చార్జి శివన్నారాయన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవలకు సత్కారం

## - రెంటచింతల విద్యుత్తు సిబ్బందికి అచీవ్‌మెంట్ అవార్డులు

రెంటచింతల, మే 24 ప్రభాతవార్త: ఏపీసీపీడీసీఎల్ మాచర్ల డివిజన్ పరిధిలో ఆపరేషన్ విభాగంలో విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించిన పలువురు సిబ్బందికి శనివారం నాగార్జునసాగర్ విద్యుత్తు సబ్‌స్టేషన్లో పల్నాడు జిల్లా శాఖ ఉన్నతాధికారులు మాచర్ల డివిజన్ సమీక్షా సమావేశం నిర్వహించి ఉత్తమ సేవా పురస్కార ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో రెంటచింతల విద్యుత్తు సబ్‌స్టేషన్ సిబ్బంది గత ఏప్రిల్ నెలలో విద్యుత్తు బిల్లుల వసూళ్లలో 100 శాతం, వినియోగదారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందించడంలో వారి సేవలకు గుర్తించి అచీవ్‌మెంట్ అవార్డులను పల్నాడు జిల్లా



సూపరింటెండెంట్ (ఆపరేషన్ సర్కిల్) పి.విజయకుమార్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సంస్థకు పేరు ప్రతిష్టలు వచ్చేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. ప్రసంశాపత్రం, అవార్డులు అందుకున్న వారిలో స్థానిక విద్యుత్ ఏఈ షేక్ మస్తాన్‌వలి, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసాచారి, లైన్‌మెన్ టి.శ్రీనివాసరావు, జూనియర్ లైన్‌మెన్ షరీఫ్ ఉన్నారు.

## మత్తు పదార్థాలు,మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఈపూరు,మే24,ప్రభాతవార్త:** మత్తు పదార్థాలు, మాధక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే



దుష్ప్రలితాలపై మండలకేంద్రమైన ఈపూరు ఎంపిడివో కార్యాలయం ప్రధాన కూడలి వద్ద మానవహారం,అవగాహన కార్యక్రమాన్ని ఎక్సైజ్ అధికారులు శనివారం నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేర్ కార్యక్రమంలో భాగంగా మద్యపానం, నాటుసారాయి, గంజాయి, డ్రగ్స్ వంటి వాటి వల్ల కలిగే చెడు పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశపు మొదటి కలెక్టివ్ ప్రారంభం

**విజయవాడ, మే 24, ప్రభాతవార్త :** ప్రభుత్వ విద్యావ్యవస్థలో వ్యక్తిగత అనుకూల అభ్యసనను విస్తృతంగా వాడుకలోకి తెచ్చిన పిఎఎల్ వర్క్స్ న్యూఢిల్లీలో ప్రారంభించామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఎడ్‌టెక్ ఆవిష్కర్తలను, విద్యారంగంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలని, పరిశోధన నిపుణులను, ఎకోసిస్టం ఎనేబులర్లని, ఫండర్లని, దాతృత్వ సంస్థలను, ప్రభుత్వ రంగ సంస్థలను ఒకేచోట చేర్చి విబిన్న నైపుణ్యాలను ఏకం చేసి, ఎడ్యుకేషన్ టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించడం ద్వారా భారతదేశంలోని ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలు మెరుగుపర్చడానికి ప్రయత్నిస్తుందన్నారు.

## పదవ తరగతి పరీక్ష రీవెరిఫికేషన్ ఫలితాలలో సుమశ్రీకు 591 మార్కులు

పెదకూరపాడు, మే 24 ప్రభాతవార్త : పదవ తరగతి పరీక్ష రీవెరిఫికేషన్ ఫలితాలలో శ్రీ వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.సుమశ్రీ పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో అత్యధికంగా 591/600 మార్కులు సాధించి మొదటి స్థానం కైవసం చేసుకుంది. సుమశ్రీని స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి.దుర్గాప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.శిరీష మాట్లాడుతూ ఒత్తిడి లేని వాతావరణంలో విలువలతో కూడిన విద్యతో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, క్షమశిక్షణ, సరైన విద్యా ప్రణాళికతో ఈ ఫలితాలు సాధ్యమన్నారు. శిరీషను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



# గుంటూరు తూర్పు,పశ్చిమ నియోజకవర్గాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్

**గుంటూరుతూర్పు,మే24,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 3.15 కోట్లతో అభివృద్ధి





పనులు నిర్వహించడానికి శంకుస్థాపన చేయడం జరిగిందని నగర మేయర్ కోవేలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 54, 56 డివిజన్లలో 2.43 కోట్లతో, పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్లో 72.20 లక్షలతో సి.సి రోడ్లు, సి.సి డ్రైన్లు, త్రాగునీటీ పైప్ లైన్లు ఏర్పాటు చేయుటకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ప్రజావసరాల దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో సుమారు 5 వందల కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు, నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్ల పైకి వర్షపు నీరు నిలుస్తూ.. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గుంటూరు నగరంతో పాటు నగరంలో విలీన గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించుటకు చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో గుంటూరు నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. నగరాభివృద్ధికి నగరంలోని ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకొని వెళ్తామని, వారి అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు నిర్వహిస్తామని తెలియచేశారు.

## దొంగల బెడద నుండి రక్షణ కల్పించండి

**మంగళగిరి, మే 24, ప్రభాతవార్త :** తమ ప్రాంతంలో ప్రతిరోజు రాత్రుళ్ళు దొంగలు సంచరించి హల్చల్ చేస్తున్నారని మంగళగిరి పట్టణంలోని దేవస్థానం రోడ్డు నందు గల పోలీస్ క్వార్టర్స్ వద్ద నివాసముండే స్థానికులు తెలిపారు. మోటారు సైకిళ్లకు ఉన్న బ్యాటరీలు, మ్యాక్ వీల్స్, క్వార్టర్స్ కు అమర్చి ఉన్న కిటికీలు, వైరింగ్ తదితర సామాగ్రిని ఎత్తుకుపోతున్నారని తెలిపారు. ఈ



మేరకు శనివారం రాత్రి వారు పట్టణ సీఐ వినోద్ కుమార్ ను పోలీస్ స్టేషన్ నందు కలిసి వినతి పత్రం సమర్పించారు. దొంగలు సంచరించిన సమయంలో పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చే లోపు పరారవుతున్నారని తెలిపారు. పోలీసులకు సంబంధించిన సామాన్లు భద్రపరిచిన గది తాళాలను పగలగొట్టారని తెలిపారు. దొంగల బెడదతో ఆందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిఐ వినోద్ కుమార్ ను కోరారు. స్పందించిన సీఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ, పట్టణంలో అన్ని ప్రాంతాల్లో పోలీస్ గస్తీలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, చోరీలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలును ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. విమానేని శ్రీనివాస్, అబ్దుల్ రవూఫ్, సుంకర కుమారి లు వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని అమరావతిలో ఏర్పాటు చేయాలి

### -కె.వి.పి.ఎస్.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి



**విజయవాడ, మే 24,ప్రభాతవార్త:** దూర విద్యలో వేలాదిమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని అమరావతిలో ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని కోరారు. త్వరలోనే ఈ విశ్వవిద్యాలయాన్ని ఏపీలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండే విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని మాల్యాద్రి ప్రభుత్వానికి సూచించారు. 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఈ విశ్వవిద్యాలయం ఏర్పడింది. మొదటిసారి నాగార్జునసాగర్ లో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో స్థలం కేటాయించి విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపును తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యా సేవలు అందిస్తుంది. రాష్ట్ర విభజన అయిన తర్వాత పదేళ్లు కూడా పూర్తయిన నేపథ్యంలో విభజన చట్టంలో ఉన్న అంశాలు ప్రకారం ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి హైదరాబాదులో ఉన్న విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ లోని విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం లేదు. దీనివల్ల 35 నుంచి 40 వేల మంది విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో 76 సెంటర్లలో వివిధ కోర్సుల్లో విద్యా బోధన చేస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది శుభ సూచకం .అయితే ఈ విశ్వవిద్యాలయాన్ని విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేయాలని ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు విశ్వవిద్యాలయానికి రావాలన్న విజయవాడ ప్రధాన కేంద్రంగా ఉంటుందని ఆయన సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఆ స్మృతి వనంలో నిర్మించి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయటం అక్కడ కావలసిన సదుపాయాలను కల్పించడం ద్వారా బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కార్యకలాపాలను అంబేద్కర్ స్మృతి వనం నుంచి కొనసాగించవచ్చని ఆయన సూచించారు. దీనివల్ల అంబేద్కర్ కు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి గౌరవం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కార్యకలాపాలను ఓఎస్డిగా ఉన్న డాక్టర్ వెలగా జోషి అమరావతి నుంచి పర్యవేక్షణ చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలావీరాంజనేయ స్వామి లకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ మాల్యాద్రి ప్రత్యేకంగా లేఖలు రాయడం జరుగుతుంది..

## అమరావతి శాశ్వత రాజధానిగా ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం చేయాలి

**తాడేపల్లి,మే 24,ప్రభాతవార్త :** నవ్యాంధ్ర చైతన్య వేదిక,ఊరూరా జన విజ్ఞానం మంగళగిరి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో రాజధాని విగ్రహాలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా నటులు కళాకారులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారి విగ్రహాలను కూడా



ప్రాంతం ఎర్రబాలెం గ్రామం మసీదు వద్ద జరిగిన నవ్యాంధ్ర ప్రజా చైతన్య కార్యక్రమానికి మంగళగిరి ప్రాంత కమిటీ కన్వీనర్ కొడాలి రవిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి రాజధాని పునరి న్నిర్మాణం అభివృద్ధి పనులు వేగవంతంగా జరగాలని కోరారు. ఊరూరా జన విజ్ఞాన రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్ర దాన్ని అమరావతి లోని కృష్ణానది ఒడ్డున ట్యాంక్ బండ్ఏర్పాటు చేసి తెలుగుజాతి మహనీయులు, స్వాతంత్ర సమరయోధులు, అభ్యుదయ మహాకవి శ్రీశ్రీ విగ్రహాన్ని, అమర గాయకులు ఘంటసాల ఏర్పాటు చేసి పర్యాటక కేం ద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజధాని పునర్నిర్మాణం పనులు సక్రమంగా జరగాలని కోట వెంకటేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. అమరావతి శాశ్వతంగా రాజధాని వేరెవరో వచ్చి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం గజిట్ నోటిఫికేషన్ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఊరూరా జనవిజ్ఞానం కమిటి సభ్యులు, గాయకురాలు కె.రాజ్య లక్ష్మి,కొడాలి సాగరిక,కె.వి. నారాయణ, ఎస్.కె.సుభాని,కరిముల్లా,శ్రీరామకృష్ణ, ధనలక్ష్మి,సుబ్బాయమ్మ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## యజమానుల ప్రోత్సాహంతో జోరుగా వైన్స్ బెల్టుషాపులు

**ఎ కొండూరు, మే 24, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో ప్రభుత్వ వైన్స్ షాపుల యజమానులు అనధికార బెల్టు షాపులు పెట్టుకోడానికి రూ.25వేలు చెల్లించి అనధికార బెల్టు షాపులు నిర్వహించుకొమ్మని ప్రోత్సహించడాన్ని తిరువూరు ఎ కొండూరు, గంపలగూడెం విసన్నపేట మండలాలకు చెందిన ప్రజలు మహిళలు వైన్ షాపు యజమానుల వైఖరిని తీవ్రంగా హెచ్చరించారు. ఒకపక్క సిఎం వైన్ షాపుల యజమానులు బెల్టు షాపులు పెట్టిస్తే బెల్టు తీస్తానని హెచ్చరించినా ఈ నియోజకవర్గంలో సిఎం హెచ్చరికను వైన్ షాపుల యజమానులు ధిక్కరించి బెల్టు షాపులను ప్రోత్సహించడం సిఎం ఆదేశాలను తుంగలో తొక్కినట్లుగా ఉందని ఈ రూ.25వేలు చెల్లిస్తే తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కేసుల సంగతి తాము చూసుకుంటామని, ఆపై ఉన్నతాధికారులు ఎన్ఫోర్స్మెంట్ విజిలెన్స్ అధికారులు దాడిచేస్తే తమకు సంబంధం లేదని కితాబివ్వడం దారుణమని ఈ నియోజకవర్గంలో వైన్ షాపుల యజమానులు ఒక్కో బెల్టు షాపుకు రూ.25వేలు కట్టమని చెప్పి బెల్టు షాపులు ఏర్పాటు చేశారని ఈ అనధికార బెల్టు షాపులను వెంటనే ఆయా గ్రామాల్లో తొలగించి సస్యశ్యామలంగా శాంతియుతంగా ఉన్న గ్రామ సీమల్లో ఈ అనధికార బెల్టు షాపులు పెట్టిస్తున్న వైన్ షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఎం బెల్టు తీస్తానన్న హెచ్చరికను తూ.చ. తప్పక ఎక్సైజ్ శాఖ అధికారులు పాటించాలని నియోజకవర్గ ప్రజలు మహిళలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 691వ రోజుకు చేరిన భరతమాత అన్నప్రసాద వితరణ పథకం



సత్తెనపల్లి, మే 24 ప్రభాతవార్త : భరతమాత అన్నప్రసాద వితరణ పథకం శనివారం 691వ రోజుకు చేరినట్లు ఫౌండర్ ట్రస్టీ తెలియజేశారు. న్యాయవాది సూరే వీరయ్య మాట్లాడుతూ రంగా కాలనీలో గుర్రం కోటివీరయ్య, ఆర్యవైశ్య సంఘం పెద్దలు గుర్రం గీతాంజలి సహకారంతో 121 మందికి అన్నప్రసాద వితరణ చేశామన్నారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ రామారావు, శ్రీహరి అన్నదానానికి సహకారం అందించారని తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## టిడిపి అనుబంధ కమిటీల పేర్ల నమోదు



**సత్తెనపల్లి, మే 24 ప్రభాతవార్త :** సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలోని రఘురాంనగర్ ప్రజావేదిక నందు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విస్తృతస్థాయి సమావేశంలో పట్టణ అనుబంధ కమిటీల పేర్ల నమోదు కొరకు సమావేశంలో నాయకులు సూచనలు చేశారు. నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణతో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాడి రైతులకు బోనస్ పంపిణీ

**ముండ్లమూరు, మే24, ప్రభాతవార్త :** ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామంలో కృష్ణ మిల్క్ యూనియన్, విజయ డైరీ వారు గడిచిన నాలుగు నెలల్లో డిసెంబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు గాను నూటికి ఏడు శాతం చొప్పున అనగా నాలుగు లక్షల రూపాయలు పాడి రైతులకు పంచారు. కృష్ణ మిల్క్ యూనియన్ వారు సుమారుగా రెండు కోట్ల పది లక్షల రూపాయలు బోనస్ని ప్రకాశం జిల్లా పాడి రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణ మిల్క్ యూనియన్ ప్రకాశం జిల్లా మేనేజర్ దిలీప్కుమార్, సూపర్ వైజర్ జి.సుబ్బారెడ్డి, ఈదర సంఘం అధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లో కంటే అన్నదానం మిన్న


### -విజయనగరం దర్గా పీఠాధిపతి డాక్టర్ ఖలీల్ బాబు

ఎ కొండూరు, మే 24, ప్రభాతవార్త : నాగపూర్ షరీఫ్లో వేంచేసి వున్న హుజూర్ హజరత్ సర్కార్ బాబా తాజుద్దీన్ తాజుల్ ఔలియా (ర.అ) వారి చబ్బీస్ షరీఫ్ ధార్మికాన్ని ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్లో అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా వారి దివ్య ఆశీస్సులతో బాబా ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి, పీర్జాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీబాబా వారు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా దర్బార్ అండ్ దర్గాకు విచ్చేసిన భక్తులకు మహాదివ్య అన్న సమారాధన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం హజరత్ సయ్యద్ ఖాదర్ వలి బాబా దర్గా పీఠాధిపతి ముతవల్లి డాక్టర్ ఎండి ఖలీలుల్లా షరీఫ్ (ఖలీల్బాబు) తాజ్ ఖాదర్ బాబు, బొగ్దాద్ పాల్గొని అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖలీల్ బాబు మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఈ దర్బార్ అండ్ దర్గాలో పంపిణీ చేసే అన్న ప్రసాదం అన్ని రోగాలకు ఆరోగ్య సంజీవని అని ఈ ప్రసాదం గత 63 సంవత్సరాలకు పైగా అందజేస్తూ పేదల బాధాతప్త హృదయుల క్షుద్బాధను తీర్చడం ద్వారా మానవ సేవే మాధవ సేవకు ప్రతిరూపమని ఖలీల్ బాబా అన్నారు.



# గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

**పిట్టలవానిపాలెం,మే24,ప్రభాతవార్త:** గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని చందోలు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం శివ కుమార్ అని అన్నారు.ప్రతి శుక్రవారం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్లె



నిద్ర కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామంలో చందోలు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం శివ కుమార్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మండలంలో గొడవలు లేని గ్రామాలు రెండు గుర్తించామని,వాటిలో ఒకటి సంగుపాలెం గ్రామం అని,సంగుపాలెం గ్రామంలో శాంతియుత వాతావరణం ఉన్నది అని కొనియాడారు, సమస్య ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అంతేకానీ రెండు వైపుల నుంచి సమస్యలు సృష్టించుకోవద్దని కోరారు.త్వరలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అవకాశం ఉన్నంతవరకు ఎవరికి వారు వారి ఇంటికి కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.మంచి మార్గంలో నడవాలని, బాగా చదువుకొని ఉన్నత స్థితిలో ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ మరియు వాహనానికి సంబంధించిన పత్రాలు మొత్తం కలిగి ఉండాలని తెలిపారు, ఎవరు చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని గ్రామంలో ఏ సమస్య వచ్చినా తను, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటామని, యువకులు రోడ్లమీద రాత్రులు సంచరించవద్దని కోరారు.రాత్రులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలియచేసారు. గ్రామ సమస్యలు ఏమైనా ఉంటే తనకు తెలియజేయాలని వాటిని చట్టప్రకారం పరిష్కరించగలమని హామీ ఇచ్చారు. అందరూ కలిసిమెలిసి జీవించాలని తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి, సర్పంచ్ శివ కుమారి, బర్మా జాన్ బాబు, బర్మా బుల్లెయ్య, బర్మా సుబ్బయ్య, చందోలు రవి కుమార్, వడ్లమూడి గాంధీ, మాట్లాపూడి నిఖిల్ మరియు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు నాయకులు పాల్గొన్నారు.

## భగలాముఖి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి పనబాక లక్ష్మీ

**పిట్టలవానిపాలెం,మే24,ప్రభాతవార్త:** ప్రసిద్ధిగాంచిన చందోలు శ్రీ భగలాముఖి అమ్మవారి ఆలయానికి కేంద్ర మాజీ మంత్రివర్యులు ప్రస్తుత



టీటీడీ బోర్డు మెంబర్ అయిన డాక్టర్ పనభాక లక్ష్మి విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ విశేషాలు తెలుసుకొని ఆలయం చాలా ప్రసిద్ధిగాంచిన ఆలయం కనుక మాస్టర్ ప్లాన్ తయారు చేయించుకుని తన దగ్గరకు వచ్చిన యడల టిటిడి పాలకమండలిలో ఈ అంశము ప్రస్తావిస్తానని తెలియపరిచారు ఈ సందర్భంగా వారికి ఆలయం తరపున వేద ఆశీర్వచనం జరిపించి దృశ్యాలువా పూలహారము, అమ్మవారి జ్ఞాపకంతో సత్కారం జరపడమైనదని ఆలయ కార్య నిర్వహణ అధికారి జి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలియపరిచారు. ఈ కార్యాక్రమంలో మండల పట్టణ టిడిపి అధ్యక్షులు ఎండి అఫజల్, గొలపల శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు భవనం బసివిరెడ్డి, కలకోట చక్ర ధర రెడ్డి, మద్దాల డేవిడ్ ఆరిఎఫ్,లేల వెంకటప్పయ్య, మాజీ సర్పంచి మంతెన రామచందర్ రాజు పాల్గొన్నారు

## పసుపు పండుగ మహానాడుకు మైనారిటీ సోదరులు తరలిరావాలి

### -తెదేపా రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఖలీలుద్దీన్



**గుంటూరుతూర్పు,మే24,ప్రభాతవార్త:** ఈనెల కడపలో27,28,29, వ తేదీల్లో జరిగే మూడు రోజుల పసుపు పండగకు మైనారిటీలు సోదరులుతరలిరావాలనిరాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ ఖలీలుద్దీన్ పిలుపునిచ్చారుఅన్న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జరుపుకునే పండుగ మహానాడు నాడు అన్న ఎన్టీఆర్ పేదలు, బడుగు ,బలహీన వర్గాల కోసం స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్న ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన 6 నెలలోనే అధికారంలోకి వచ్చిచరిత్ర సృష్టించారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత అన్న ఎన్టీఆర్ దక్కుతుంది. అదే వరవడిని కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టించిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుంది అభివృద్ధి అంటే గుర్తొచ్చేది బాబుయే. ఐటి వంటి అనేక పరిశ్రమలు స్థాపించిన విజన్ ఉన్న గొప్ప నాయకుడు, అమరావతి సృష్టికర్త చంద్ర బాబు అని అన్నారు. దేశం లో ఏదైనా సెక్యులర్ పార్టీ ఉందంటే అది తెలుగు దేశం పార్టీ అని పార్టీ స్థాపించిన నాటినుండి మైనార్టీలు పార్టీకి అండగా ఉన్నారు. మరీ ముఖ్యంగా 20192024 జగన్ అరాచక పాలనలో మైనారిటీలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు. 2024లో పార్టీ అధికారం రావడానికి మైనార్టీల కృషి ఎంతో ఉందని ఇకముందు కూడా పార్టీకి అండగా ఉంటారని మైనారిటీ సోదరులందరూ కలిసి పెద్ద ఎత్తున మహానాడుకు తరలిరావాలని ఈ పసుపు పండుగ మహానాడును జయప్రదం చేద్దామని ఈ సందర్భంగా మొహమ్మద్ ఖలీలుద్దీన్ పిలుపునిచ్చారు.

## ఎంపిఎం విద్యాసంస్థల విద్యార్థులకు ఉద్యోగాలు

**నరసరావుపేట, మే 24 ప్రభాతవార్త :** కేసానుపల్లి ఎంపిఎం విద్యాసంస్థల విద్యార్థులు పలు ప్రముఖ సంస్థలలో ఉద్యోగాలు సాధించారు. వివరాలను కళాశాల ఛైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య శనివారం తెలియజేశారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థలు ప్రాంగణ ఎంపికలను నిర్వహించాయి. త్రిషోల్డ్ సొల్యూషన్స్ ఇన్ఫోకస్ ఆక్రోసాఫ్ట్ సొల్యూషన్స్ ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఆయా సంస్థలలో 17 మంది ఉద్యోగాలను సాధించారు. ఇటువంటి ప్రాంగణ ఎంపికలు భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని వారు తెలిపారు. ఎంబిఏ, ఎంసిఏ, బిటెక్ విద్యార్థులు 17 మందికి ఉద్యోగాలు లభించడం పట్ల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.రామారావు, అధ్యాపకులు నవీన్, సితార, రాధిక, ఫణిబాబు, రవిశంకర్ పాల్గొన్నారు.




## ప్రతి నెల చివరి రోజున పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

**నరసరావుపేట టౌన్, మే 24 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలోని మండల కేంద్రాల్లో ప్రతి నెల చివరి రోజున పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్బాబుకు ఎమ్మార్పీఎస్ఎస్, డిబిఎస్ఎస్ఎన్ నాయకులు చింతిరాల మీరయ్య, కె.ప్రసాద్లు విజ్ఞప్తి చేశారు. 1989 ఎస్సీ, ఎస్టీ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమీషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని తహశీల్దార్, పోలీస్, ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులకు ఉందన్నారు. కార ్యక్రమంలో నాయకులు కోట నాయక్, బందెల శ్రీనివాసరావు, దాసు తదితరులు పాల్గొన్నారు.




## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

### -మండల వైద్యాధికారి సుమంత్

**కొల్లిపర,మే 24 ప్రభాతవార్త:** దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య



పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారు గుదిబండివారిపాలెంలో వైద్యాధికారులు ఫ్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.కార్యక్రమంలో డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయి అధికారులకు ఆధార్ సీడింగ్పై సమావేశం

**హనుమంతునిపాడు, మే24, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయం నందు శనివారం బూత్ స్థాయి అధికారులు 6(బి) ఆధార్ సీడింగ్ పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ బి.దిలీప్ కుమార్ మండలంలోని బూత్స్థాయి అధికారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

**దర్శి, మే24, ప్రభాతవార్త :** మార్టూరు మండలం ఇసుక దర్శిలో గల ఏలూరు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు పాల్గొన్న దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో పొగాకు రైతులు నష్టాలపాలవుతున్నారని అన్నారు.

## ప్రతి ధరఖాస్తును ఆన్లైన్ చేయాలి

### -ఎంపీడీఓ విజయలక్ష్మీ

**కొల్లిపర,మే 24 ప్రభాతవార్త:** రేషన్కార్డు కోసం ధరఖాస్తు చేసుకున్న ప్రతి దానిని తప్పనిసరిగా పరిశీలించి ఆన్లైన్ చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ



అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంటులతో కొత్త రేషన్కార్డులపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి రేషన్ కార్డుల నమోదుపై తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ రేషన్కార్డు కోసం గడువు తేదీ అనేది లేదని ఎప్పుడైనా ధరఖాస్తుచేసు కోవచ్చన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, ఈవోపిఆర్డి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలి

### - డీఆర్డీఏ ఎపిఎం రమాదేవి

**కొల్లిపర,మే 24 ప్రభాతవార్త:** డ్వాక్రా గ్రూపుసభ్యులు స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలని డీఆర్డీఏ ఎపిఎం రమా దేవి అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లు.. పొదుపు సంఘాల సభ్యులకు సమీక్షా సమావేశం నిర్వహించి బ్యాంకు రుణాలపై తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బ్యాంకులలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినట్లయితే మరల తిరిగి ఎక్కువ రుణాలు పొందే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో సీసీలు విజయ కుమార్, మధు,పూర్ణయ్య,ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## కడప మహానాడుకు రండి తరలి రండి

### - టీడీపీ శ్రేణులకు కడియాల పిలుపు

**దర్శి, మే24, ప్రభాతవార్త :** దర్శిలోని గొట్టిపాటి లక్ష్మి నివాసంలో శనివారం జరిగిన సమావేశంలో ఈనెల 27,28,29వ తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు దర్శి నియోజకవర్గం నుండి భారీగా తరలిరావాలని టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ తిండి రాజేష్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లబోతుల వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, పిడతల నెమిలయ్య, మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, దర్శి టౌన్ టీడీపీ అధ్యక్షులు చిన్న, నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా మండల పూజా మహోత్సవం

**బల్లికురవ, మే24, ప్రభాతవార్త :** స్థానిక వెంకటేశ్వరస్వామి నామాల వద్ద మండల పూజ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు అలంకరించి, పంచామృత అభిషేకాలు నిర్వహించి పానకం వడపప్పు నైవేద్యంగా పంచారు. సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సంతర్పణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగబోయిన నాగేశ్వరరావు, పెండ్యాల కాంతారావు, చల్లగండ్ల శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ చేసిన డాక్టర్ కడియాల లలిత్ సాగర్

**దర్శి, మే24, ప్రభాతవార్త :** దర్శిలోని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నివాసంలో ముండ్లమూరు మండలానికి చెందిన పాలెపోగు దావిద్కు రూ.65,572 సీఎంఆర్ఎఫ్ చెక్కు ని టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుని కుటుంబ సభ్యులు, ముండ్లమూరు మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, డీసీ ప్రెసిడెంట్ కంచుమాటి శ్రీనివాసరావు, నాయకులు చిమిలి ప్రసాద్, దిరిసల శ్రీనివాసరావు, మామిళ్ళపల్లి కోటి, మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు ఉన్నారు.

# ఎమోషనల్ మూవీ 'భైరవం'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తు తోంది. ఈ నేపథ్యంలో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **ఈ సినిమాకి దర్శకుడిగా విజయ్‌ని ఎంచుకోవ డానికి కారణం?** నాకు కమర్షి యల్ హీరోగా మంచి పేరు వచ్చిం ది. తర్వాత కొన్ని స్టైలిష్ సినిమాలు చేయడం జరిగింది. అప్పుడు మాస్ కనెక్ట్ అవుతున్నారా లేదా అనే ఆలోచన ఉండేది. అందరూ రిలేట్ చేసుకునే ఒక రూరల్ స్టోరీ చేయాలని ఉండేది. అలాంటి సినిమా కోసం చూస్తున్నప్పుడు ఈ కథ దొరికింది. ఈ కథని మన సెన్సిబిలిటీస్‌కి తగ్గట్టు ప్రజెంట్ చేసే గల దర్శకుడు విజయ్ అనిపించింది. నేను కూడా కొన్ని రీమిక్స్ చేశాను. **రోహిత్, మంచు మనోజ్ క్యారెక్టర్స్ గురించి?** రోహిత్, మనోజ్ ఇద్దరు కూడా చాలా ఇంపార్టెంట్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ముందు రోహిత్‌కి కలిసి ఈ క్యారెక్టర్ గురించి ఆయనకు చెప్పిన వెంటనే అంగీకరించారు. తర్వాత మిరాయ్ పోస్టర్లో మనోజ్‌ని చూసి ఆ క్యారెక్టర్‌కి మనోజ్ అయితే బాగుంటుందని ఆయనని సంప్రదిం చాం. ఆయనకు కూడా కథ నచ్చింది. ఈ కథకి వారిద్దరూ పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యారు. ఈ కథకి ఇద్దరు కూడా చాలా ఎక్సైట్ అయ్యారు. **అతిథి శంకర్ గురించి?** అతిథి శంకర్ వెరీ నైస్ పర్సన్. వెరీ ఎనర్జిటిక్. మా అందరితో కలిసిపోయింది. తను చాలా మంచి యాక్టర్ అవుతుంది. తను మంచి సింగర్, డాన్సర్. చాలా టాలెంటెడ్. **ట్రైలర్‌లో ఒక పూనకం షాట్ ఉంది కదా.. దాని గురించి చెప్పండి?** నాకు మెయిన్‌గా నచ్చిన పార్ట్ అది. కథలో దాన్ని చాలా అద్భుతంగా వాడడం జరిగింది. ఆ సర్ ప్రైజ్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. చాలా ఎమోషనల్ ఇంపాక్ట్ ఇచ్చే సినిమా ఇది. ఈ సినిమా ట్రీట్మెంట్ చాలా కొత్తగా ఉంటుంది. మీరు ఒకవేళ తమిళ్ లో వెర్షన్ చూసినా కూడా ఈ సినిమా మీకు చాలా నచ్చుతుంది.



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

# హైదరాబాద్‌లో 'మెగా157' రెగ్యులర్ షూటింగ్

ఎంటర్‌టైన్‌మెంట్, చరిష్మాతో ప్రేక్షకులను అలరించేందుకు మెగాస్టార్ చిరంజీవి సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటిస్తున్న మెగా157 బ్లాక్‌బస్టర్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొం దుతోంది. వరుస విజయాలు అందించిన అనిల్ రావిపూడికి ఇది చిరంజీవితో తొలి చిత్రం కావడం విశేషం. చిరంజీవి అభిమానులు ఎప్పటి నుంచో ఆయనను మళ్లీ పూర్తి స్థాయి హ్యూమరస్ క్యారెక్టర్‌లో చూడాల నుకుంటున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహూ గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెం ట్స్ పతాకంపై సుశ్మిత కొనిదెల ఈ చిత్రాన్ని నిర్మి స్తున్నారు. ప్రెస్టీజియస్‌గా రూపొందుతున్న ఈ చిత్రా నికి శ్రీమతి అర్చన ప్రజెం ట్ చేస్తున్నారు. నయన తార చిరంజీవికి జోడిగా నటిస్తున్నారు. తన అభి మాన హీరో మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేయాలన్న అనిల్ రావిపూడి నిరీక్షణకు తెరపడింది. హైదరాబాద్‌లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. మొదటి రోజు డైరెక్టర్ అనిల్ రావిపూడి చిరంజీవితో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అనిల్ రావిపూడి లానే చిరంజీవి కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. తాజాగా సంక్రాంతికి





విడుదలైన సంక్రాంతికి వస్తున్నాం ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్‌తో మంచి జోరు మీదున్న అనిల్ రావిపూడి, తన యూనిక్ ప్రమోషన్లతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. టెక్నికల్ క్రూ పరిచయ వీడియో, తర్వాత నయనతార ప్రోమో వీడియో ఆడియన్స్‌ని కట్టిపడేసింది. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. రైటర్స్ ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నారు, ఎస్ కృష్ణ కూడా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ: శ్రీమతి అర్చన సంగీతం: భీమ్స్ సిసిరోలియో డీవోపీ: సమీర్ రెడ్డి.

# థియేటర్ల బంద్‌పై తెలుగు ఫిలిం ఛాంబర్ క్లారిటీ

తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల వినిపిస్తున్న కొన్ని వార్తలను బేస్ చేసుకుని ఈ మీటింగ్ పెట్టడం జరి గింది. దీనికై ఉదయం 11 గంటల నుండి ఫిలిం ఛాంబర్‌లో ఒక మీటింగ్ నిర్వహిం చాము. ఈ మీటింగ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హాజర య్యారు. ప్రస్తుతం థియేటర్ల పరిస్థితిపై ఉన్న కొన్ని సమస్యల గురించి చర్చలు జరగాయి. మే 1వ తారీకు నుండి థియేటర్లు మూతపడతాయని వార్త బయటకు వెళ్ళింది. కానీ అలా థియేటర్లు మూసి వేయడం అనేది జరగడం లేదు. అది పూర్తిగా ఊహా గానం మాత్రమే. ఈనెల 30వ తేదీన ఈసీ మీటింగ్ ఉండబో తుంది. ఆరోజు మూడు సెక్టార్లకు నుండి ఒక కమిటీ నిర్మించబోతు న్నాము. ఓ నిర్ణీత సమయంలోనే ఈ సమస్యకు పరిష్కారం వచ్చేలా ఆ కమిటీ పని చేయబోతుంది. దీనికి సంబంధించిన ఎటువంటి వార్తలేనా ఫిలిం ఛాంబర్ ఇంకా అనుసంధాన సంస్థల నుండి బయటకు వస్తే కేవలం ఆ వార్తలను మాత్రమే ప్రచారం చేయండి. అంతేకానీ బయటనుండి వేరే ఇతర వార్తలు ఏమైనా వస్తే వాటిని దయచేసి నమ్మకండి, ప్రచారం చేయకండి. ఎందుకంటే అటువంటి అబద్ధపు వార్తలు కేవలం చిత్ర పరిశ్రమలో అనవసరమైన ఆటంకాలు తీసుకొస్తున్నాయి. అలాగే ఈ విషయంపై అవసరమైతే ప్రభుత్వంతో కూడా మాట్లాడతాము. గతంలో కూడా కొన్ని సమస్యలకు ప్రభుత్వంతో కూర్చుని చర్చించడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు కూడా చర్చించబోతు న్నాము. చిత్ర పరిశ్రమలో ఎటువంటి కష్టాలు వచ్చిన బయట వారు ఎవరు వచ్చి ఆ కష్టాల నుండి బయటకి తీసుకున్నారు. కేవలం ఇండస్ట్రీ మాత్రమే ఆ కష్టాలను స్వయంగా బయట పడుతుంది. అలాగే ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి థియేటర్లు బంద్ చేస్తున్నారు అనే వార్తను పూర్తిగా ఖండిస్తున్నాము. ఇండస్ట్రీకి మంచి జరిగే విధంగానే ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ సమస్యల నుండి బయట పడి ముందుకు వెళ్తాము అన్నారు.



దిశా పటాని నయా లుక్



# 'కట్టలన్' టైటిల్ అనౌన్స్‌మెంట్

బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మార్కో విజయం తర్వాత క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత షరీఫ్ మహమ్మద్, తన తదుపరి ప్రతిష్టా త్మక ప్రాజెక్ట్‌గా కట్టలన్ ను అనౌన్స్ చేశారు. ఇది పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న హైయాక్షన్ థ్రిల్లర్. ప్రముఖ నటుడు ఆంటోనీ వర్గీస్ (పేపే) హీరోగా నటిస్తున్నారు. దర్శకత్వం పాల్ జార్జ్. కాంతార 2కి సంగీతం అందించిన అజనీష్ లోకనాథ్ ఇప్పుడు షరీఫ్ మహమ్మద్‌తో చేతులు కలిపారు. ఈ సినిమాకి సంగీతంతో అజనీష్ మరోసారి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సంచలనంగా మారింది. వర్షంలో తడిచిన పేపే, చుట్టూ పడి ఉన్న మృతదేహాలు, ఏనుగు దంతాల మధ్య





నిలబడి వుండటం కథలో ఉండబోయే వైలెన్స్ సూచిస్తోంది. మార్కో స్థాయిని మించి ఉండ బోతోందని సంకేతాలు ఇస్తోంది. జైలర్, లియో, జవాన్, కూలీ లాంటి చిత్రాలకు టైటిల్ ఫాంట్స్ డిజైన్ చేసిన ఐడెంట్ ల్యాబ్స్ ఈ సినిమాకి కూడా టైటిల్ డిజైన్ చేశారు. కంటెంట్, మార్కెటింగ్ పరంగా క్యూబ్స్ ఎంటర్‌టైన్ మెంట్స్ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుండగా, పేపే హై ఇంటెన్సిటీ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న తరుణంలో కట్టలన్ నిజంగా ఒక గొప్ప సినీ అనుభూతి కావడంలో సందేహమే లేదు. ఈ సినిమాకి పీఆర్ మార్కెటింగ్ వంశీ శేఖర్.

# 'పరమపద సోపానం' నుంచి లిరికల్ సాంగ్

టాలీవుడ్‌కి అర్ధనారి వంటి హిట్ సినిమాతో హీరోగా తెరం గేట్రం చేసి మంచి పాపులారిటీ సంపాదించుకున్న అర్జున్ అంబటి ఆ తర్వాత బిగ్ బాస్ రియాలిటీ షోతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. తాజాగా తెప్పసముద్రం వెడ్డింగ్ డైరీస్ వంటి వైవిధ్యమైన సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతున్నారు. అతను హీరోగా రూపొందిన లేటెస్ట్ మూవీ పరమపద సోపానం. అచ్చమైన తెలుగు టైటిల్‌తో తెరకెక్కు తున్న ఈ సినిమా ఓ ఇంటరెస్టింగ్ థ్రిల్లర్ ప్రేక్షకుల ముందుకు రానుంది. జెన్నీఫర్ ఇమ్మా న్యుయేల్ ఈ చిత్రంలో కథా నాయికగా నటి స్తుంది. ఎస్.ఎస్. మీడియా సంస్థపై గిడిమిట్ల శివ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. గుడిమెట్ల ఈశ్వర్ ఈ చిత్రానికి సహా నిర్మాతగా వ్యవరిస్తు న్నారు. అలాగే ఈ సినిమాకు గతంలో పూరి జగన్నాథ్ వంటి దిగ్గజ దర్శకుడికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ పరమపద సోపానం చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం అందిస్తున్నారు. అన్ని కార్య క్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూలై 11న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్లను వేగవంతం చేస్తూ ముందుగా చిన్ని చిన్ని తప్పులేవో అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. మాస్ మహారాజ్ రవితేజ ఈగల్ వంటి సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ జాండ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. చిన్ని చిన్ని తప్పులేవో పాటకి ఆయన అందించిన ట్యూన్ ట్రెండీగా ఉంది. సింగర్స్ పృథ్వీ చంద్ర, అదితి బావరాజు ఆలపించిన విధానం.. రాంబాబు గోశాల అందించిన సాహిత్యం యువతని ఆకర్షించే విధంగా ఉందని చెప్పాలి. విడుదలైన కాసేపటికే ఈ పాటకి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ లభించింది. సినిమా కూడా ఈ పాటలనే అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు విశ్వసిస్తున్నారు.



# 26న 'డకాయిట్-ఏక్ ప్రేమ్ కథ' గ్లింప్స్ రిలీజ్

అడివి శేష్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా డకాయిట్ ఎక్సయిటింగ్ సినిమాటిక్ ఎక్సపీరియన్స్‌ని అందించ బోతోంది. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో కథానాయిక నటిస్తోంది. ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ ప్రాజెక్ట్‌లో ఒక పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఒక ఎక్సయి టింగ్ అప్డేట్‌తో వచ్చారు. డకాయిట్ ఫైర్ గ్లింప్స్ మే 26న రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో అడివి శేష్ ఇంటెన్స్ లుక్‌లో దూరంగా ట్రైన్, కార్ ఫైర్ యాక్సిడెంట్‌ని చూస్తూ కనిపించడం ఫైర్ గ్లింప్స్‌పై క్యురియాసిటీని పెంచుతోంది. షనీల్ డియో దర్శకత్వం వహించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను సుప్రియా యార్ల గడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. అన్నపూర్ణ స్టూడి యోస్ సమర్పి స్తోంది. డకాయిట్ కథ, స్క్రీన్‌ప్లేను శేష్, షనీల్ డియో సంయుక్తంగా రూపొందించారు. హిందీ, తెలుగు భాషలలో ఏకకాలం లో షూటింగ్ జరుగుతున్న మూవీ ఆడియన్స్‌కి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబో తోంది.



# సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా 'నిలవే'

సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన నిలవే చిత్రానికి సౌమిత్ రావు, సాయి వెన్నం దర్శకత్వం వహించారు. తాహెర్ సినీ టెక్ సౌజన్యంతో సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి పాత్రల్ని పరిచయం చేశారు. సంతోషం, నమ్మకం, అలక, పిలుపు అంటూ అన్ని రకాల ఎమోషన్స్‌కు సంబంధించిన నిలవే పోస్టర్‌లను రిలీజ్ చేశారు. అనంతరం చిత్రయూనిట్ మాట్లాడుతూ, హీరో సౌమిత్ రావు మాట్లాడుతూ, నిలవే ఓ మంచి మ్యూజికల్ లవ్ డ్రామాగా రాబోతోంది. అంతా కొత్త వాళ్లం కలిసి చేస్తున్నాం. కొత్త వాళ్లు కూడా మంచి చిత్రాల ను తీస్తారు. మేం ఎంతో నిజాయితీతో ఈ మూవీని చేశాం. మా కంటెంట్ బాగుందని ఆడియెన్స్ చెప్పాలి. మా సినిమా బాగుందని ఆడియెన్స్ ఫీల్ అయ్యేలా చేయాలని ప్రయత్నిస్తున్నాం. మా మూవీని ఆడియెన్స్ వద్దకు తీసుకెళ్లేందుకు మీడియా సహకరించాలి. నిజాయితీకి అర్థం ఉంటే అది మా నిలవే సినిమా. మా చిత్రం అందరినీ సర్ ప్రైజ్ చేస్తుంది అని అన్నారు. దర్శకుడు సాయి వెన్నం మాట్లాడుతూ, మా పేర్లు ఎవ్వరికీ



తెలియకపోవచ్చు. మాది చిన్న టీం కావొచ్చు. మాది చిన్న ఐడియా కావొచ్చు. కానీ మా కాన్సెప్ట్, మా సినిమా చాలా పెద్దగా ఉంటుంది. ఇదొక అందమైన ప్రేమ కథ. ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే నిలవే. మ్యూజిక్‌ని లవ్‌తో చూపించాలని అనుకున్నాం. మేం కథ పైన ప్రేమతో ఎంతో కష్టపడి నిలవే చిత్రాన్ని తీశాం. టీజర్ చూస్తే నిజాయతీగా ఉంటుంది. ఎక్స్‌పోజింగ్ లేదని, డైలాగుల్లో బూతులు లేవని, వైరల్ అవ్వదని చాలా మంది చెప్పారు. కానీ మా కంటెంట్ మాత్రమే చెప్పాలని టీజర్ కట్ చేశాం. నిలవే చాలా మంచి సినిమా. అందరూ మా సినిమాకు సపోర్ట్ చేయండి అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ, నిలవే ట్రైంకి నా చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. కానీ నా మీద నమ్మకంతో సినిమాను ఇచ్చారు. ఈ మూవీకి కొత్తమ్యూజిక్‌ను ఇచ్చాం. సినిమా, కథ నుంచే ఇంత మంచి సంగీతం వచ్చిందని నేను నమ్ముతున్నాను. ఈ మూవీని నేను జీవితాం తం గుర్తు పెట్టుకుం టాను. మంచి చిత్రానికి అందరూ సపోర్ట్ చేయా లి.

# 'గుర్తింపు' ఫస్ట్ లుక్

స్వస్తిక్ విజన్స్ సమర్పణలో గంగా ఎంటర్టై న్మెంట్స్ నిర్మా ణంలో కేజేఆర్ హీరోగా తెన్‌పతియాన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొం దుతోన్న చిత్రం గుర్తింపు. స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాగా రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యథార్థ సంఘటనల ఆధారంగా గుర్తింపు చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూపేదరికంలో ఉన్న ఓ వ్యక్తి.. తన కలల్ని నెరవేర్చు కునేందుకు క్రీడా రంగంలో ఎదిగిన తీరు, క్రీడా రంగంలో గుర్తింపు కోసం పడిన శ్రమ, చేసిన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లను అందరికీ కనెక్ట్ అయ్యేలా ఎమోషనల్ డ్రామాగా గుర్తింపు సినిమాను రూపొందిస్తున్నా. ఇప్పటికి 85 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంతకు ముందు మా సంస్థలో శివ కార్తికేయన్ చిత్రాన్ని వరుణ్ డాక్టర్ పేరుతో అనువదించి మంచి విజయాన్ని అందుకున్నా. ఇటీవల అశ్విన్ బాబు హీరోగా శివం భజే చిత్రం నిర్మించాను అని తెలిపారు. స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా రానున్న ఈ గుర్తింపు చిత్రంలో కేజేఆర్, సింధూరి విశ్వనాథ్, విజి వెంకటేష్, రంగరాజ్ పాండే, మన్సూర్ అలీ ఖాన్, రమా, మోహన్ రామ్, ఆంటోనీ, అజిత్ ఘోషి, విమల్, ఇజబెల్లా, షాన్, దీపిక, జానకి, అరుల్ జ్యోతి వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి



సంగీతం: జిబ్రాన్, కెమెరామెన్: ఎ.విశ్వనాథ్, యాక్షన్: పీటర్ హెయిన్, ఎడిటర్: శాన్ లోకేష్, ఆర్ట్ డైరెక్టర్: రాము తంగరాజ్, నిర్మాణం: స్వస్తిక్ విజన్స్, గంగా ఎంటర్టైన్మెంట్స్, దర్శకుడు: తెన్‌పతియాన్.

# సింధుజలాల ఒప్పందంపై పాక్ విషప్రచారం

## ఐక్యరాజ్యసమితిలో దాయాది తీరును ఎండగట్టిన భారత్ ప్రతినిధి

**న్యూయార్క్, మే 24:** సింధు నదీజలాల ఒప్పందంపై పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని శనివారం ఐక్యరాజ్యసమితిలో భారత్ ధ్వజమెత్తింది. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంవ్‌లో ఉగ్రదాడి తర్వాత సింధుజలాల ఒప్పందంనుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన భారత్ నదీజలాలను నిలిపివేసింది. సమితిలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని వీడేంతవరకూ ఈ నదీజలాలు రద్దు ఒప్పందం అలాగే కొనసాగుతుందని తెలిపారు. పాకిస్తాన్‌ప్రతినిధి నదీజలాల ఒప్పందంపై భారత్‌ను విమర్శించడంతో వెంటనే స్పందించిన హరీష్ పాక్ వైఖరిని ఎండగట్టారు. పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం వల్ల భారత్‌లో ఇప్పటివరకూ 20 వేల మంది అమాయకపౌరులు చనిపోయారన్నారు. గతనెలలోనే 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారని వీరంతా పాకిస్తాన్ ప్రాయోజిత తీవ్రవాదులేనని ఆయన ఆరోపించారు. 65 ఏళ్లక్రితం మంచి నమ్మకంతో నదీజలాల ఒప్పందంలోకి వచ్చిందని, స్నేహపూర్వక వాతావరణంలోనే జరుగుతుందని ఆనాడుభావించామన్నారు. 65 ఏళ్లుగా పాకిస్థాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, మూడు యుద్ధాలుచేసి ఓడినా, వేలాదిగా ఉగ్రదాడులు భారత్‌పై జరుపుతూనే ఉందని ఆరోపించారు. గడచిన నాలుగు దశాబ్దాల్లో ఉగ్రదాడుల వల్ల 20 వేలమంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. భారత్‌ఎంతో ఓర్పు సంయమనంతో వ్యవహరించిందని, పాకిస్తాన్ ప్రాయోజిత సరిహద్దు ఉగ్రవాదం భారత్‌లో అమాయక పౌరులను బలితీసుకుంటున్నదని, మతసామరస్యాన్ని దెబ్బతీస్తోందని, ఆర్థిక అభ్యున్నతికి గండంగా మారిందని అన్నారు. దీనివల్ల స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి, వాతావరణంలో మార్పులు, భౌగోళిక మార్పులు అనేకం సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. పాతబడిన డ్యామ్‌లకు తక్షణ మరమ్మతులు అవసరమని, కొన్నింటినీ భద్రత రీత్యా పునర్నిర్మించాల్సిన అవసరంఎంతో ఉందని అయినా కూడా పాకిస్తాన్ ఈమార్పులను అడ్డుకుంటూ వస్తోందని ఆరోపించారు. మౌలికవనరుల కల్పనలోనూ పాకిస్తాన్ భారత్‌కు వ్యతిరేకంగానే స్పందించిందన్నారు. 2012లో ఉగ్రవాదులు తుల్బుల్ నేవిగేషన్ ప్రాజెక్టుపై దాడి చేసారన్నారు. ఇలాంటి ఈర్ష్యపూరిత దాడులు పౌరులు, విలువైన ప్రాజెక్టుల భద్రతకు ముప్పు తెస్తాయన్నారు. గతరెండేళ్లగా కొన్ని మార్పులు అవసరమని పాకిస్తాన్‌తో సంప్రదిస్తూనే ఉన్నామని పాకిస్తాన్ వ్యతిరేకిస్తూ వచ్చిందని, నిరంతరం అడ్డుకునే వైఖరితోనే ఉన్న పాకిస్తాన్‌కు సింధుజలాలను వినియోగించుకునే హక్కు ఉండదని ఆయన వాదించారు. దీనికితోడు ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ ఉగ్రమూలన పూర్తిగా చేసినపుడే సింధుజలాల ఒప్పంద అమలుకు తెస్తామని అప్పటివరకూ పెండింగ్‌లోనే ఉంటుందని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదానికి పెట్టింది పేరుగా పాకిస్తాన్ నిలుస్తోందని హరీష్ ఆరోపించారు.





### సరిహద్దుల్లోని పూంచ్ జిల్లాలో

# పర్యటించిన రాహుల్‌గాంధీ

**పూంచ్, మే 24:** పాకిస్తాన్ రేంజర్లు, ఉగ్రదాడులకు పూర్తిస్థాయిలో ధ్వంసం అయిన సరిహద్దు గ్రామాల్లో ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ పర్యటించారు. ఇదొక పెద్ద విషాదమని సరిహద్దు గ్రామాలప్రజల దీనగాథలను దేశవ్యాప్తంగా ప్రజలకు తెలియజెప్పాల్సిన అసరం ఉందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ పూంచ్ పట్టణంలో పర్యటించి ఒక గంటసేపు అక్కడిప్రజలతో ముచ్చటించారు. ఈనెల ఏడునుంచి పదితేదీల మధ్యలో బాంబులు, తుపాకి బుల్లెట్లకు దెబ్బతిన్న ఇళ్ల యజమానులతోనే ఆయన ఎక్కువసేపు గడిపారు. ఎంతోమంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. పాకిస్తాన్ ఆర్మీ పౌర నివాసాలనే ఎక్కువ టార్గెట్‌చేసుకుందని ఆయన విమర్శించారు. జాతీయ స్థాయిలో అంటే పార్లమెంటులో కూడా తమకు జరిగిన నష్టం, సమస్యలను ప్రస్తావించాలని తనను కోరినట్లు రాహుల్ చెప్పారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులు, దెబ్బతిన్న ఇళ్లు, చెల్లాచెదురయిన విలువైనవస్తువుల దృశ్యాలు తనను కలిచివేసాయన్నారు. నాలుగురోజుల యుద్ధం తరహా దాడిలో ఎంతో ధైర్యసాహసాలు చూపించిన ఈగ్రామాల ప్రజలకు ఆయనసెల్యూట్‌చేస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలతరపున నిలబడతామని, వారి పునరుజ్జీవనానికి పూర్తి అండగా నిలుస్తామని అన్నారు. జమ్ముకాశ్మీర్‌యూనిట్ అధ్యక్షుడు తరిఖ్ హమీద్ కర్రా, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జిఎ మీర్‌ఇతర సీనియర్లు వెంటరాగా ఆయన పూంచ్‌గ్రామాలనుపరనయటించారు. గతనెల 25వ తేదీ కూడా గాంధీ శ్రీనగర్‌లో పర్యటించారు. జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హాను కూడా కలిసి చర్చలుజరిపారు. అలాగే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇతర కీలక ప్రభుత్వ మంత్రులను కూడా కలిసి చర్చలుజరిపారు. జమ్ముఎయిర్‌పోర్టునుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సరిహద్దుగ్రామం అయిన పూంచ్‌ప్రాంతానికి వెళ్లారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల ఇళ్లు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ జరిపిన కాల్పులవల్ల సరిహద్దుల్లో 28 మంది చనిపోయారు. ఒక్క పూంచ్ జిల్లాలోనే 13 మంది చనిపోయారని, 70 మందికిపైగా తీవ్రగాయాల పాలయ్యారని రాహుల్ చెప్పారు. వాస్తవాధీన రేఖ, సరిహద్దుగ్రామాలవెంబడి ఉన్న అనేక కుటుంబాలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మూడురోజుల దాడుల తర్వాత పాకిస్తాన్ కాల్పుల విరమణకు ముందుకురావడంతో ప్రస్తుతం వాతావరణం స్తబ్దుగా ఉంది. పిసిసి చీఫ్ కర్రా మాట్లాడుతూ గురుద్వారా, దేవాలయం, మదర్సా, క్రైస్తవ మిషనరీ స్కూలును కూడా రాహుల్ సందర్శించారని బాధిత కుటుంబాలు, ఇతర పౌర సంఘాలప్రతినిధులతో మాట్లాడినట్లు తెలిపారు. దెబ్బతిన్న సరిహద్దుగ్రామాల్లో ఆపరేషన్ సింధూర్ తర్వాత పర్యటించిన మొదటి జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ. గతనెలలో పర్యటనలోనే రాహుల్ మాట్లాడుతూ ఉగ్రదాడులతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని, ఇలాంటి విపత్కర తరుణంలోనే దేశం మొత్తం సమైక్యంగా నిలిచి ఉగ్రవాద నిర్మూలనకు అండగా నిలుస్తుదని ప్రకటించిన సంగతి తెలిసిందే.



## బాలికపై లైంగికదాడి చేసిన సాధువు అరెస్టు

**బెలగావి, మే 24:** కర్ణాటకలోని బెలగావి జిల్లాలో ఉన్న రామ్‌మందిర సాధువును పోలీసులు అరెస్టుచేసారు. 17 ఏళ్ల బాలికను ప్రలోభపెట్టి తన కారులో ఇంటివద్ద వదిలిపెడతానని నమ్మించి ఆపై ప్రైవేటు లాడ్జికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు మొత్తం వివరాలను తల్లితండ్రులకు చెప్పడంతో ఈసాధువుపై పోలీసులకు ఫిర్యాదుచేసారు. నిందితుడు లోకేశ్వర మహరాజ్‌గా గుర్తించారు. మేఖాలి గ్రామంలోని రామ్‌మందిరంలో ఉంటున్నట్లు తెలిపారు. బెంగళూరుకు 500 కిలోమీటర్ల దూరంలో ఈ మందిరం ఉంది. బాలికను ప్రలోభపెట్టి బాగల్‌కోట్‌లోని ఒక లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. ఆ తర్వాత ఆమెను రాయ్‌చూపర్‌కు తీసుకెళ్లి మళ్లీ లైంగిక దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత ఆమెను బాగల్‌కోట్‌జిల్లాలోని మహాలింగపూర్ బస్టాండ్‌లో దించివెళ్లిపోయాడని బెలగావి ఎస్పీ డా.భీమశంకర్ ఎస్ గులేద్ తెలిపారు. పోక్సో చట్టం కింద నవానగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసారు. బాధితురాలు జరిగినఘోరాన్ని తల్లితండ్రులకు వివరించింది. దీనితో వెంటనే బాగల్‌కోట్ పోలీసులకు ఫిర్యాదుచేసారు. అయితే ఈప్రాంతం తమ పరిధిలో లేకపోవడంతో కేసును బెలగావికి బదలాయించి నిందితుడిని అరెస్టు చేసారు. చివరకు ఈకేసును మూదలాగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేసినట్లు ఎస్పీతెలిపారు. నిందితుడిని అరెస్టుచేసిన ప్రాంతం అయినందున ఆస్టేషన్ లోనే కేసును రిజిస్టరు చేసామన్నారు.

## ఎయిర్‌ఫోర్స్,బిఎస్ఎఫ్ సమాచారం పాక్‌కు చేరవేస్తున్న యువకుడి అరెస్టు

**అహ్మదాబాద్, మే 24:** భారత వాయుసేన, సరిహద్దుభద్రతా దళాలకు సంబంధించిన కీలకసమాచారం పాకిస్తాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నాడన్న అభియోగాలతో గుజరాత్‌కు చెందిన సహదేవ్‌సింగ్ గోహిల్‌ను పోలీసులు అరెస్టుచేసారు. గుజరాత్ యాంటి టెర్రరిజమ్ స్క్వాడ్ అధికారి కె సిద్ధార్థ్ మాట్లాడుతూ భారత్ భద్రతా బలగాలకు సంబంధించిన సున్నిత రహస్య సమాచారాన్ని పాక్ వేగులకు చేరవేస్తున్నట్లు గుర్తించామన్నారు. 28 ఏళ్ల గోహిల్‌ను ఒక ఏజెండ్ సంప్రదించిందని, అదితి భరద్వాజ్ అనే ఆమె 2023లో వాట్సాప్‌ద్వారా పరిచయం అయిందన్నారు. ఐఎఫ్; బిఎస్ఎఫ్ సైట్లకు సంబంధించిన కొన్ని ఫోటోలను విడియోలను ఆమెకు పంపించాడు. కొన్ని నిర్మాణం పూర్తి అయినవి, నిర్మాణంలో ఉనన కట్టడాలను కూడా ఫోటోలు విడియోలు పంపించినట్లు నిందితుడు అంగీకరించాడు. పాకిస్తానీ ఏజెంట్‌తో కీలకమైన సమాచారాన్ని పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల ఒకటవ తేదీ ప్రాథమిక దర్యాప్తుకోసం పిలిపించారు. ఎస్‌టిఎఫ్ పాకిస్థానీ ఏజెంట్ ఆతడిని ఐఎఫ్, బిఎస్ఎఫ్ నిరానమణాల ఫోటోలు విడియోలు కోరినట్లు అంగీకరించాడు. 2025 ప్రారంభంలోనే ఆధార్‌కార్డుసాయంతో సిమ్‌కార్డు కొనుగోలుచేసి వాట్సాప్ యాక్టివేట్ చేసాడని అదితి భరద్వాజ్‌కోసం ఒటిపి సాయంతో చేసినట్లు తేలింది. ఆ తర్వాత అన్ని ఫోటోలు, విడియోలు పంపించడం ప్రారంభించినట్లు ఎటిఎఫ్ అధికారి సిద్ధార్థ్ తెలిపారు. గోహిల్ తరచూ చేసిన నంబర్లు పాకిస్తాన్ కేంద్రంగా ఉన్నట్లు గుర్తించామని, అంతేకాకుండా గోహిల్‌కు 40 వేల నగదును గుర్తుతెలియని



వ్యక్తినుంచి అందాయని తెలిపారు. పహల్గాంవ్‌లో దాడి జరిగిన తర్వాతనుంచే ఈ సంప్రదింపులు, సంభాషణలు పెరిగాయని అధికారులు గుర్తించారు. ఇప్పటివరకూ ఇదే తరహాలో పాక్‌కు సమాచారం చేరవేసిన పదిమందిలో గోహిల్ కూడా ఒకడు.

## ఆర్మీచీఫ్‌కు వ్యతిరేకంగా యూనస్ మద్దతుదారుల ర్యాలీలు

### ఇస్లామిస్టు, విద్యార్థినేతల మద్దతు కూడగట్టే పనిలో యూనస్

**ఢాకా, మే 23:** బంగ్లాదేశ్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం రాజుకుంటున్నది. తన పదవికి రాజీనామా చేస్తానని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ హెచ్చరించినట్లు వినవస్తున్న నేపథ్యంలో దీనికి నిరసనగా రాజధాని ఢాకాలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన మద్దతుదారులు ప్రకటించారు. యూనస్‌ను ఐదేళ్లపాటు పదవిలో ఉంచాలి, ముందు సంస్కరణలుతర్వాతే ఎన్నికలు అంటూ నిరసనకారులు తమ పోస్టర్లలో డిమాండు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్‌ఉజ్ జమాన్ పిలుపునిస్తూ దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజా ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని పునరుద్ఘాటించిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తానని యూనస్ హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బంగ్లాదేశ్ అనధికార ప్రధానమంత్రిగా కొనసాగుతున్న యూనస్ పదవీకాలం ముగిసిపోతుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో శనివారం యూనస్ మద్దతుదారులు ఆర్మీ కంటోన్మెంట్ వరకు



నిర్వహించే ర్యాలీ ఎటువంటి హింసాత్మక ఘటనలకు దారితీస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారిన దరిమిలా సైన్యం నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామా చేసిన ప్రధాని షేక్ హసీనా గత ఏడాది ఆగస్టు 5న దేశం విడిచి భారత్‌కి పారిపోయారు. ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతోనే యూనస్ రాజీనామా బెదిరింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల మధ్య తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్న కారణంగానే రాజీనామా చేయాలని యూనస్ యోచిస్తున్నట్లు విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) కన్వీనర్, విద్యార్థి ఉద్యమ నాయకులలో ఒకరైన నహీద్ ఇస్లామ్ తెలిపారు. ఎన్‌సీపీకి సారథ్యం వహించేందుకు నహీద్ ఫిబ్రవరిలో యూనస్ క్యాబినెట్‌కి రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహం జమునలో యూనస్‌తో సమావేశమైన నహీద్ పదవిలో కొనసాగవలసిందిగా అభ్యర్థించారని సమావేశానికి హాజరైన మరో ఎన్‌సీపీ నాయకుడు అరీఫుల్ ఇస్లాం అదీబ్ తెలిపారు. తాను పదవిలో కొనసాగలేనని, మరో ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని విద్యార్థి నాయకులే ఏర్పాటు చేసుకోవాలని యూనస్ కోరినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఇస్లామిస్టు మూకలను తన సొంత సైన్యంగా వాడుకుంటున్న యూనస్ ఎన్నికలు నిర్వహించకుండా అధికారంలో కొనసాగాలని ప్రయత్నిస్తున్నట్లు జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. 2026 జూన్‌లోగా ఎన్నికలు జరుగుతాయని యూనస్ చెబుతున్నప్పటికీ బీఎన్‌పీతోసహా వివిధ రాజకీయ పార్టీలు సత్వర ఎన్నికలను కోరుతున్నాయి.

## రాహుల్‌పై జార్ఖండ్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ

**రాంచి, మే 24:** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీకి జార్ఖండ్‌లోని చాయ్‌బాసా ఎంపి ఎమ్మెల్యే కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసింది. 2018లో నమోదయిన పరువునష్టం కేసుకు సంబంధించి ఈ వారంట్లు జారీచేసింది. వచ్చేనెల 26వ తేదీ జరిగే వాయిదాకు విధిగా రాహుల్ హాజరుకావాలని ఆదేశించింది. రాహుల్‌గాంధీ లీగల్‌టీమ్ దాఖలుచేసిన హాజరు మినహాయింపు పిటిషన్‌ను జడ్జి తిరస్కరించారు. 2018 కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో రాహుల్ గాంధ్యీ వ్యాఖ్యలపై ఈ పిటిషన్ దాఖలయింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాగురించి మాట్లాడుతూ హత్యచేసిన అభియోగాలు ఎదుర్కొంటున్న అందరూ కూడా బిజెపి అధ్యక్షుడు అవుతున్నారని తీవ్రస్థాయిలో చేసారు. దీనితో బిజెపి నాయకుడు ప్రతాప్ కటియార్ పరువునష్టం పిటిషన్‌ను దాఖలుచేసారు. 2018 జులై 9న చాయ్‌బాసా చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలయింది. ఆ తర్వాత జార్ఖండ్‌హైకోర్టు ఈ కేసును ఎంపిఎమ్మెల్యే కోర్టుకు బదలాయించింది. ఆటుపిమ్మట అక్కడినుంచి చాయ్‌బాసా ఎంపి ఎమ్మెల్యే కోర్టుకు బదిలీచేసారు. కేసు విచారణకు అంగీకరించిన తర్వాత మేజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి సమన్లు జారీచేసారు. అనేకసార్లు సమన్లు జారీ అయినా రాహుల్ కోర్టుకు రాలేదు. దీనితో నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసారు. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించిన రాహుల్ లీగల్ టీమ్ వారంట్‌పై స్టే కోరింది. అయితే గత ఏడాది మార్చిలోనే 20వ తేదీ హైకోర్టు పిటిషన్ డిస్మిస్‌చేసింది. అలాగే చాయ్‌బాసాకోర్టుకూడా తీవ్రంగా వ్యతిరేకించింది. ఇపుడు ఎంపి ఎమ్మెల్యేలకేసుల విచారణ ప్రత్యేక కోర్టుకూడా కఠిన వైఖరిని అవలంభించి రాహుల్ జూన్ 26వ తేదీ విచారణకు హాజరుకావాలని నాన్‌బెయిలబుల్ వారంట్లు జారీచేసింది.

## ‘సిందూర్’ దాడిలో 200 మంది మృతి

### పాక్‌లో మరణించిన వారి వివరాలు తెలిపిన భారత్ రక్షణ అధికారులు

**న్యూఢిల్లీ, మే 24:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో గతనెల 22న పర్యటకులపై జరిగిన ఉగ్రదాడికి, ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. అయితే దీనికి సంబంధించి రక్షణ శాఖ ఉన్నత వర్గాలు తాజా వివరాలను వెల్లడించాయి. భారత్ పాకిస్థాన్ పై మే7న జరిపిన దాడిలో 200 మందికి పైగా మరణించారని, పాక్‌లోని కీలక ఉగ్రస్థావరాలు, బహవల్‌పూర్ ధ్వంసమైందని పేర్కొన్నాయి. ఈ దాడిలో 170 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. ఈ దాడిలో ఏడుగురు భారత సైనికులు ప్రాణాలు కోల్పోగా, 42 మంది పాక్ సైనికులు మరణించారు. భారత్ చేసిన వైమానిక దాడికి ప్రతిచర్యగా పాక్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయగా, ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భారత్ గొప్ప విజయాన్ని





సాధించిందని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. పాక్ వైమానిక స్థావరాలపై విరుచుకుపడి దాయాది దేశ ఉగ్రస్థావరాలను మట్టికురిపించాయి. జైషే మహ్మద్ ఉగ్రముఠా ప్రధాన కేంద్రం ధ్వంసమైంది. ఈ దాడిలో భారత మహిళా పైలెట్లు కీలక పాత్ర పోషించారు. అయితే ఈ వైమానిక దాడిలో భారత బ్రహ్మోస్ క్షిపణులు ప్రధాన పాత్ర పోషించాయని రక్షణ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని తాత్కాలికంగా నిలిపివేశామని సదరు వర్గాలు తెలిపాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ విజయం పాక్‌ను తీవ్రంగా భంగపాటుకు గురిచేసిందని, దీనికి ప్రతికారంగా భారత్‌పై ఎప్పుడైనా దాడులు జరపవచ్చునని పేర్కొన్నాయి. అందుకని ముందస్తు చర్యగా భారత రక్షణ దళాలు హైఅలర్ట్‌లో ఉన్నాయని వెల్లడించాయి. భారత్, చైనా సరిహద్దు వివాదానికి సంబంధించి 2017లో డోక్లామ్‌లో తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలే, సిందూర్ విజయానికి కారణం అని సదరు వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఉగ్ర దాడిలో పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఇది తనకు జరిగిన అవమానాన్ని కప్పిబుచ్చుకునే పాక్ చేసే ప్రయత్నంగా అభివర్ణించాయి.



జర్మనీలో రైల్వే ప్లాట్‌ఫామ్‌పై నిలుచున్న

## 12 మందికి కత్తిపోట్లు: ముగ్గురి పరిస్థితి విషమం

**హామ్‌బర్గ్, మే 24:** జర్మనీలోని హామ్‌బర్గ్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో దారుణం చోటుచేసుకుంది. ప్లాట్‌పాంపై నిలుచున్న వారిపై ఓ దుండగుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరికొంత మందికి స్వల్పంగా గాయాలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇది పెద్ద ఘటన అని జర్మనీ పోలీసులు ప్రకటించారు. అక్కడి స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ఎనిమిది మందికి గాయాలైనట్లు వార్తలు వచ్చాయి. తర్వాత ఆ సంఖ్య 12కు పెరిగినట్లు స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. పోలీసులు నిందితుడిని అరెస్టుచేశారు. దాడికి గల కారణాలు తెలియరాలేదు. దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు హామ్‌బర్గ్ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఒక్కరే ఈ దాడిలో పాల్గొన్నట్లు సమాచారం.




## బాలీవుడ్ నటుడు ముకుల్‌దేవ్ కన్నుమూత

**ముంబయి, మే 24:** ప్రముఖ సినీ, టీవీ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన తుది శ్వాస విడిచినట్లు సన్నిహితులు, కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధదుతున్నట్లు సన్ ఆఫ్ సర్దార్2 చిత్రంలో ముకుల్ దేవ్‌తో కలిసి పనిచేసిన నటుడు విందు దారా సింగ్ పేర్కొన్నారు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్థరాత్రి పరిస్థితి విషమించి చనిపోయిటన్లు వైద్యులు ధృవీకరించారు. ముకుల్ దేవ్ హిందీ, తెలుగు, కన్నడ, పంజాబీ సహా పలుభారతీయ భాషల్లో నటించారు. తెలుగులో ఆయన ఎక్కువగా విలన్ పాత్రలు పోషించారు. కృష్ణ, ఏక్ నిరంజన్, భాయ్, మనీ మనీ మోర్ మనీ, సిద్ధం, కేడీ, అదుర్స్ లాంటి చిత్రాల్లో ఆయన కీలక పాత్రల్లో నటించారు. అలాగే, ఆయన తన కెరీర్‌ను టెలివిజన్ ద్వారా ప్రారంభించారు.ఆయన టెలివిజన్ రంగంలోనూ చాలా పాపులర్. ముకుల్ దేవ్ మరణంతో సినీ, టీవీ వర్గాల్లో విషాదం నెలకొంది. ముకుల్ దేవ్ మరణంపై విందు దారా సింగ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల మరణంతర్వాత ఆయన డిప్రెషన్‌లోకి వెళ్లాడని, ఇంటి నుంచి బయటకు రాలేదని, ఎవరినీ కలవలేదని చెప్పారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు వివరించారు.

## హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయంతో బెల్జియం యూత్ క్వీన్‌కు కష్టాలు



**బ్రసెల్స్, మే 24:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ యూనివర్సిటీలో చుదువుతున్న విదేశీ విద్యార్థులపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. ఫస్ట్ ఇయర్ పరీక్షలు పూర్తి చేసుకుని ప్రస్తుతం సమ్మర్ సెలవుల్లో ఉన్న ఆ వర్సిటీ విదేశీ విద్యార్థులకు ఇప్పుడు టెన్షన్ పట్టుకున్నది. విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ఎంట్రీపై నిషేధం విధిస్తూ ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు బెల్జియం యువరాణి ఎలిజబెత్‌కు కూడా కష్టాలు తెచ్చిపెట్టాయి. రెండో సారి దేశాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత హార్వర్డ్ వర్సిటీలో జరుగుతున్న ఆందోళనలపై ట్రంప్ ఆగ్ర హంగా ఉన్నా రు. విద్యార్థుల్ని అదుపులో పెట్టలేకపోతున్న వర్సిటీకి ఫెడరల్ ఫండ్ లో కోతలు కూడా విధించారు. ట్రంప్ సర్కా రుకు, హార్వర్డ్ వర్సిటీకి సంబంధాలు సరిగా లేకుండా పోయాయి. తాజాగా విదేశీ విద్యార్థుల నమోదు అంశంలో ట్రంప్ ఇచ్చిన కొత్త ఆదేశాలు మరింత సమస్యాత్మకంగా మారాయి. ఆ వర్సిటీలో చదువుతున్న విదేశీయుల్లో భారతీయులు, చైనీయులు,ఇతర సంపన్నుల పిల్లలు కూడా ఉన్నారు. వర్సిటీ డేటా ప్రకారం సుమారు 6800 మంది విదేశీస్టూడెంట్స్ చదువుతున్నట్లు హార్వర్డ్ పేర్కొన్నది. దీంట్లో అయిదో వంత విద్యార్థులు చైనీయులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రతిష్టాత్మక వర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న వారిలో బెల్జియం యువరాణి కూడా ఉన్నారు. 23 ఏళ్ల ప్రిన్సెస్ ఎలిసబెత్ ఇప్పుడు ఆ వర్సిటీలో ఫస్ట్ ఇయర్ పూర్తి చేసింది. ఇతర కాలేజీలకు తమ స్టేటస్‌ను మార్చుకోవాలని ట్రంప్ సర్కారు హార్వర్డ్ విద్యార్థులపై వత్తిడి తెస్తున్న నేపథ్యంలో యువరాణి భవిష్యత్తు కూడా గందరగోళంగా మారింది.అయితే అమెరికా ప్రభుత్వ నిర్ణయంపై త్వరలో తమ వివరణ ప్రకటించనున్నట్లు బెల్జియం రాయల్ ప్యాలెస్ ప్రతినిధి లోర్ వాండోర్నీ తెలిపారు. ప్రిన్సెస్ ఎలిసబెత్ హార్వర్డ్ వర్సిటీలో పబ్లిక్ పాలసీ చదుతువున్నారు. అది రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీకోర్సు. పబ్లిక్ సర్వీస్‌లో విజయవంతమైన కేరీర్‌ను కొనసాగించేందుకు ఆ సబ్జెక్టును నేర్పుతారు. ఆ కోర్సు వల్ల విద్యార్థుల ఆలోచన సరళిని, నైపుణ్యాన్ని పెంచనున్నారు. బెల్జియం చక్రవర్తి ఫిలిప్, రాణి మాథిల్డే పెద్ద కుమార్తె ప్రిన్సెస్‌ఎలిసబెత్. అయితే హార్వర్డ్‌లో చేరడానికి ముందు ఆమె బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో హిస్టరీ,పాలిటిక్స్‌లో డిగ్రీచదివారు. విదేశీ విద్యార్థులఎన్‌రోల్మెంట్‌పై ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని హార్వర్డ్ వర్సిటీ వ్యతిరేకిస్తున్నది. ఆ అక్రమ నిర్ణయం వల్ల వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడినట్లు వర్సిటీ పేర్కొన్నది.



మయన్మార్ తీరంలో మునిగిన రెండు నౌకలు..

## 427 మంది రోహింగ్యాలు మృతి?

**నేపయిడా, మే 24:** మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగిపోవడంతో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. 427 మంది రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మే 9, 10వ తేదీల్లో ఈ ఘోర ప్రమాదాలు జరిగినట్లు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఈ విషయం నిర్ధారణ అయితే ‘సముద్రంలో చోటుచేసుకున్న అత్యంత విషాదకర ఘటన’గా ఇది మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఓడల ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు ఐరాస అనుబంధ శరణార్థి విభాగం అంచనా వేస్తోంది. తొలి ప్రమాదం మే 9న చోటుచేసుకోగా 267 మందిలో 66 మంది బతికి బయటపడినట్లు ప్రాథమికంగా వెల్లడించింది. మే 10న రెండో నౌక ప్రమాదానికి గురికాగా 21 మంది బతికి బయటపడినట్లు సమాచారం. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌లో నివసిస్తుంటారు. కానీ, సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకుగానూ లక్షలాది రోహింగ్యాలు 2017లో బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. మయన్మార్‌లో గతేడాది సైనిక తిరుగుబాటు తర్వాత వారి వలసలు మరింత పెరిగాయి. దీంతో దక్షిణ బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

25-5Pg6exHMNWJQE.qxd:25-5Pg6exHMNWJQE.qxd 01/01/01 7:12 AM Page 1



# వైఎస్సార్సీ పాలన కుట్రలు, కుతంత్రాలమయం

**- అక్కడి విధ్వంసం తట్టుకోలేక పార్టీ వీడాను -మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి**



**పలమనేరు,మే 24,ప్రభాతవార్త:** వైకాపా పాలన కుట్రలు,కుతంత్రాలమయమని వాటిని చూసి తట్టుకోలేక ఆ పార్టీ వీడడం జరిగిందని మాదిగ కార్పొరేషన్ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు.పలమనేరు టిడిపి కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..గత 5 సంవత్సరాల వైకాపా పాలన అనేక కుట్రలు,కుతంత్రాలతో సాగిందని విమర్శించారు.రాష్ట్రంలో వైకాపా చేయని కుంబకోణాలు,విధ్వంసాలు లేవని వాటిని చూసి తట్టుకోలేక ఆ పార్టీని వీడడం జరిగిందని తెలిపారు.కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిచిన ప్రజావేదికను అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చడం చూసి నాకు అత్యంత సన్నిహితులు ఆయన చర్యలు సరికాదని తెలిపారన్నారు.విశ్వాసం,విలువలు లేని జగన్ ఆయన ప్రతి మాట విశ్వాసం,విలువలు అంటారు అయితే ఆయన రాష్ట్ర ప్రజలతో నిజమైన విశ్వాసం,విలువలతో లేరని ఆయన వారి పార్టీ మంత్రులు,ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకోవడానికి సహకరించి వారికి విశ్వాసంగా ఉన్నారని విమర్శించారు.మద్యం కుంబకోణాలలో లక్షల కోట్లు ఆర్జించిన వారు ఎవ్వరన్నది ప్రతి ఒక్కరికి తెలుసన్నారు.ప్రజల సమస్యలను తనతో ఎవరైన చర్చిస్తే ఆసమయంలో ఆయన ఆలోచన అక్కడ ఉండదని రాష్ట్రంలో ఏలాంటి కుంబకోణాలు చేయాలి అందులో తమకు ఎంత వస్తుందని ఆలోచనలో ఉంటారని ఆరోపించారు.జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధిపై అవగాహన శూన్యమని తెలిపారు.జగన్ చుట్టు ఉన్న ఆ నలుగు రాసిన రాతలను ఆయన మాట్లాడడానికి పరిమితం కావడం జరిగిందన్నారు.వైకాపాలో ఆ నాయకులు చేసిన కర్మ ఫలితమే వారు నేడు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు.నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిలో కీలక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.1995లో విజన్ 2020 అన్న నారా చంద్రబాబు నాయుడు ఆ విజన్‌ను ప్రజల ముందు ఆవిష్కరించారని నేడు విజన్ 2047ను ఆయన పూర్తి చేసి చూపుతారన్నారు.పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి,ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు.ఈనెల 27,28,29న కడపలో జరగనున్న మహానాడును టిడిపి నాయకులు,కార్యకర్తలు జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.టిడిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.మహానాడు టిడిపి నాయకులు,కార్యకర్తలకు ఓ పండుగని ఆ పండుగకు ప్రతి ఒక్క టిడిపి నాయకులు,కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్ గౌడ్,కుట్టి, నాగరాజురెడ్డి, ఆనంద్,సోమశేఖర్ గౌడ్,ఆర్వీ బాలాజీ ,రామచంద్ర నాయుడు,ఖాజా,గిరి తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు



మహానాడులో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సవిత

**- ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ సస్యశామలం**
**- బిసి సంక్షేమ మంత్రి సవిత**

**శ్రీసత్యసాయి జిల్లా, మే 24, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మహానాడు సభ వేలాది కార్యకర్తల నడుమ అట్టహాసంగా జరిగింది. తొలుత మినీ మహానాడు ప్రారంభం సందర్భంగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సవిత సహా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి., టీడీపీ జెండాను ఆవిష్కరించారు. మహానాడు ఉద్దేశించి మంత్రి సవిత మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత ఎన్టిఆర్‌దేనని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో టీడీపీ మరింత బలోపేతమైందన్నారు. ప్రతిఆకార్యకర్తలను కన్నబిడ్డల చంద్రబాబు, లోకేష్‌లు చూసుకుంటున్నారని, సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా, పేద కార్యకర్తల పిల్లల చదువులకు పార్టీ అధిష్టానం అండగా నిలుస్తోందన్నారు. చంద్రన్న నేతృత్వంలో ఇప్పటికే అమరావతి, పోలవరం ప్రాజెక్టు శరవేగంగా జరుగుతున్నాయని, అవి పూర్తయితే రాయలసీమ సస్యశామల మౌతుందన్నారు. మరో కొద్ది నెలల్లో పోలవరం ప్రాజెక్టు పూర్తి కానుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమలో ప్రాజెక్టులన్నీ నీటితో నింపుకోవొచ్చునన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని, ఈ ప్రాజెక్టు కూడా పూర్తయితే రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా రాయలసీమ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. సీఎం చంద్రబాబు రాకతో, రాయలసీమలో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. రాయలసీమను పారిశ్రామిక హబ్ గా, హర్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేయానికి సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. గడిచిన ఎన్నికల్లో కూటమి విజయంలో కార్యకర్తల కృషి మరువలేనిదని మంత్రి సవిత కొనియాడారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామన్నారు. త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, ఇప్పటికే ఈ దిశగా మంత్రి నారా లోకేష్ చర్యలు ప్రారంభించారని వెల్లడించారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులపైనా బనాయించిన అక్రమ కేసుల మాఫీపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించి మహానాడు విజయవంతానికి జిల్లా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# కడపలో పుంగనూరు చేరికను వ్యతిరేకించిన ప్రజలు

**- జిల్లా కేంద్రానికి 148 కిలోమీటర్లు దూరం**

**పుంగనూరు, మే 24 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లాలోని పుంగనూరును కడప జిల్లాలో చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది. చిత్తూరు జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో భాగమై ఉన్న పుంగనూరు నియోజకవర్గం పలుసార్లు రూపురేఖలు కోల్పోయి ఇప్పుడు పుంగనూరు చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలతో ఉంది. ఈ క్రమంలో మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని గత ప్రభుత్వం హామీలు ఇచ్చి వాటిని బుట్ట దాఖలు చేసింది. ఒకవేళ మదనపల్లె జిల్లా కేంద్రం అయి ఉంటే పుంగనూరు మదనపల్లి జిల్లాలో కలిసే దానికి సుముఖత వ్యక్తం చేసేది. జిల్లాల విభజన జరిగే చాలా ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ పుంగనూరును కడప జిల్లాలో చేరుస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం అత్యంత దారుణమైన చేయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు నుంచి కడప 148 కిలోమీటర్ల దూరం ఉండగా దాదాపు మూడున్నర గంటలసేపు ప్రయాణం.

ఇప్పటికే మదనపల్లె ను కడప జిల్లాలో చేర్చడం వల్ల మదనపల్లె ప్రజలు లబోదిబోమంటున్నారు. మదనపల్లి నుంచి కడపకు వెళ్లి రావడానికి ఒక రోజు ప్రయాణం అవుతుందని మదనపల్లె ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమను చిత్తూరులో కలపాలని వారు కోరుతున్నారు కూడా.

# అభివృద్ధి బాటపై మహానాడులో చర్చ

## మినీమహానాడులోని తీర్మానాలతో తుది నివేదిక

**విజయవాడ.మే24,ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళలో అన్ని రంగాల్లోనూ వెనుకబడిన రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై కడపలో జరుగునున్న మహానాడు వేదికపై సమగ్రంగా చర్చించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అలాగే రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు,ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలపైనా నేతలు ప్రత్యేకంగా చర్చించనున్నారు.కడప మహానాడులో చేయనున్న తీర్మానాలపై మంగళగిరి లోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడి అధ్యక్షతన తీర్మానాల కమిటీ శుక్రవారం సమావేశమైంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మినీ మహానాడుల్లో చేసిన తీర్మానాల్ని కమిటీ చర్చించింది. వాటి ఆధారంగా తుది నివేదిక సిద్దం చేయనున్నట్లు ఎంఎల్‌ఏ నక్కా ఆనందబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన 14 ముసాయిదా తీర్మానాలు నాలుగు ఉమ్మడి తీర్మానాలన్ని చర్చించి ఆమోదించనున్నారు. మొదటి రోజు ప్రతినిధుల సభ జరుగుతుంది. ఇందులో పార్టీ సంస్థాగత నిర్మాణం,సిద్దాంతాలు, భవిష్యత్తు కార్యాచరణపై నేతలు దిశా నిర్దేశం చేయనున్నారు. రెండో రోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు,సాధించిన విజయాలు, మ్యానిఫెస్టో అమలు,గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం నుండి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఫించన్ల పెంపు,దీపం-2,అన్న క్యాంటీన్లు,చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు,తద్వారా యువతకు లభిస్తున్న ఉదో ్యగ,ఉపాధి అవకాశాలు,మెగా డిఎస్సీ తదితర అంశాలప కూలంకుషంగా చర్చిస్తారు.ఇందుకు గాను కొన్ని ముసాయిదా తీర్మానాలు చేసింది.వీటిలో కూటమి ప్రభుత్వం..తొలి ఏడాదిలో సాధించిన విజయాలు ప్రస్తావించింది.నదుల అనుసంధానం,బనకచర్లకు గోదావరి జలాల మళ్లింపు సహా వేగంగా సాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం .ఒకే రాజధాని అమరావతి-అభివృధ్ధి వికేంద్రీ కరణ(పొరుగు రాష్ట్రాలకు ధీటుగా ప్రజా రాజధాని నిర్మాణం,పట్టణ-గ్రామీణాభివృద్ధితో వికేంద్రీ కరణ,పెట్టుబడుల వికేంద్రీకరణ,175 నియోజక వర్గాల్లో పారిశ్రామిక పార్కులు,జగన పాలనలో దోపిడీకి గురైన ఉత్తరాంధ్ర రాయలసీమల అభివృద్ధి.

# ఆంధ్రప్రదేశ్ 10వ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరానికి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు అత్యధిక మార్కులు 599 సాధించి విజయకేతనం ఎగురవేశామని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదేవిధంగా 598 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఏడుగురు, 597 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 42 మంది, 596 ఆ పైన మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులు 109 మంది, 595 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 201 మంది, 590 ఆ పైన మార్కులు 1184 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అదేవిధంగా మొత్తం 24261 మంది విద్యార్థులకుగాను శ్రీచైతన్య స్కూల్ సగటు మార్కు 600కు గాను 528. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 శాతం. సుమారు 80 శాతం బ్రాంచ్లు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయని ఆమె తెలిపారు. ప్రస్తుతానికి రీవెరిఫికేషన్ ఆధారంగా పైన తెలిపిన సంఖ్యలు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం తెలియజేయడం జరిగిందన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1వ ర్యాంకుతోపాటు 100 లోపు ర్యాంకులు 19 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారని ఆమె తెలిపారు. శ్రీచైతన్య సాధించిన ఇంతటి ఘనవిజయాలకు దరిదాపుల్లో దేశంలోగాని, రాష్ట్రంలోగాని మరే ఇతర విద్యాసంస్థ లేదని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సిఓ ఐపియల్, సిఐపియల్, యమ్.పి. యల్., ఐకాన్, సిబ్యాచ్, యస్‌బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వలన మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యాసంస్థల మరొక డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలియజేశారు.

# తెలుగు వీరుడికి గౌరవం- మేజర్ మల్ల రామ్ గోపాల్ నాయుడుకు కీర్తిచక్ర పురస్కారం



**విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త** భారతదేశంలో అరుదైన కీర్తి చక్ర పురస్కారం మేజర్ మళ్ల రామ్ గోపాల్ నాయుడుకు శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలో ప్రధానం చేసారు. రాష్ట్రానికి జాతీయ గుర్తింపు తెచ్చినందుకు మళ్ల రామ్ గోపాల్ నాయుడును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. రామ్ గోపాల్ నాయుడు సాధించిన విజయానికి వీరు గర్వం వ్యక్తం . యువతకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. అటువంటి వ్యక్తులకు తాను అన్ని విధాలుగా అండగా నిలుస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు కూడా అదే జిల్లాకు చెందిన తోటి స్థానికుడైన రామ్ గోపాల్ నాయుడును వ్యక్తిగతంగా అభినందించారు. జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా యువతకు ఆదర్శంగా నిలిచిన రామ్ గోపాల్ నాయుడు ప్రశంసలు అందుకున్నారు. అనేక మంది ఎంపీలు మరియు కీలక రాష్ట్ర నాయకులు కూడా తమ అభినందనలు తెలిపారు.రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తి చక్ర ప్రధానం శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి మండలం నాగిరిపెంట గ్రామానికి చెందిన మేజర్ మల్లా రామ్ గోపాల్ నాయుడుకు దేశ రాజధానిలో జరిగిన ఒక ఉత్సవ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిష్టాత్మక కీర్తి చక్రను ప్రదానం చేశారు. 2023 అక్టోబర్ 26న జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన తిరుగుబాటు నిరోధక ఆపరేషన్‌లో అసాధారణ ధైర్యం మరియు నాయకత్వం వహించినందుకు భారతదేశపు రెండవ అత్యున్నత శాంతి సమయ శౌర్య పురస్కారమైన ఈ అరుదైన గౌరవాన్ని మేజర్ నాయుడుకు ప్రదానం చేశారు. ఆ దురదృష్టకర ఉదయం, ఐదుగురు భారీగా ఆయుధాలు కలిగిన ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని నిఘా వర్గాలు తెలిపాయి. సరిగ్గా ఉదయం 10:10 గంటలకు, యూనిట్‌లోని ఒక సైనికుడికి సమాచారం అందింది.

# చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహణ

## సమీక్షించిన మంత్రులు, ముఖ్య నేతలు

**కడప, మే 24, ప్రభాతవార్త బ్యూరో :** ఈ నెల 27,28,29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని కడప చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగు తున్నాయి. మహానాడు నిర్వహణను పార్టీ ప్రతిష్టాత్మంగా తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలువురు మంత్రులు ముఖ్య నేతలు కడపలో మకాం వేసి మహానాడు ఏర్పాటులు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శనివారం కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పోలిట్ బ్యూరో సభ్యులు,కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి , అన్నమయ్య జిల్లా పార్టీ చమతి జగన్మోహన్ రాజు,రాష్ట్ర ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే మాధవి రాష్ట్ర నేతలు సంధ్యా రాణి , బీద రవిచంద్ర , బీటీ నాయుడు , అమర్నాథ్ రెడ్డి , ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ , కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి , కమలాపురం, ప్రొద్దుటూరు శాసనసభ్యులు కొత్త కృష్ణ చైతన్య రెడ్డి, నంద్యాల వరదరాజు రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, తానా మాజీ అధ్యక్షుడు వేమన ఇతరులు పాల్గొన్నారు.

అంతకుముందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు గువ్వల చెరువు వద్ద లక్ష మందికి భోజన ఏర్పాట్లపై పరిశీలించారు .

మొదటి రెండు రోజులు రాష్ట్రస్థాయిలో టిటిడి ప్రజాప్రతినిధులు 25 వేల మంది చొప్పున పాల్గొంటారు.

# దసరా ఉత్సవాలకు ఇప్పటి నుండే సన్నద్ధం

**- ప్రతిరోజూ విలువైనదే - ఇఓ వికె శీనా నాయక్**



దుర్గాఘాట్ పరిసరాలు పరిశీలిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 24, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఏటా జరిగే దసరా శరన్నవరాత్రోత ్సవాలకు ఇప్పటినుండే సన్నద్ధమవుతున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు సెప్టెంబర్ నెలలోనే వస్తున్నందున ఇప్పటినుండే ఉత్సవ ఏర్పాట్లపై పలు చర్యలు తీసుకుంటునా ్నమన్నారు. శనివారం ఆయన ఆలయ ఇఇ కోటేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ లతో కలిసి కొండచరియలు విరిగిపడే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం దుర్గాఘాట్ ను పరిశీలించి ఘాట్‌ను విస్తరించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఇఇ కి ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆషాడమాసం లో దుర్గమ్మవారికి సారె సమర్పణ, దసరా ఉత్సవాలు త్వరలో జరగనున్నందున ఈ ఏర్పాట్లు త్వరితగతిన చేస్తామన్నారు. సమయం తక్కువగా వున్నందున ప్రతి రోజు విలువైనదే అన్నారు. దుర్గమ్మవారిని దర్శించుకునే విఐపిలకు దర్శన సమయాల్లో సవరణ చేసినట్లు ఇఓ వికె శీనా నాయక్ వివరించారు. ఉదయం 11.30 గంటల నుండి 1.30 వరకు విఐపిల దర్శనం నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 11.30 గంటలకు దుర్గమ్మవారికి నైవేద్య విరామ సమయం, అనంతరం ఆలయ శుద్ధి జరుగుతాయన్నారు. అలాగే ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు దృష్ట్యా పారి ్కంగ్ సమస్య తలెత్తుతుండడం కూడా కారణమన్నారు. పసిపిల్లలను, వృద్దులను తీసుకొని వచ్చే వారు నైవేద్య విరామసమయంలో ఎక్కువ సేపు నిలబడి వుండవలసి వస్తున్నందున ఉదయం 11.30 కు ముందుగాని, మధ్యాహ్నం 1.30 గంటల తరువాత గాని విఐపిలు దుర్గమ్మను దర్శించుకోటానికి ఏర్పాట్లు చేశామని ఈ మేరకు విఐపిలు షెడ్యూల్స్ నిర్ణయించుకోవాలన్నారు. సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం అయ్యేలా అందరూ సహకరించాలన్నారు.

# వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ. 52లక్షలు

**ఆత్రేయపురం, మే 24 (ప్రభాత వార్త ) ప్రముఖ** పుణ్యక్షేత్రం కలియుగ ప్రత్యక్ష దైవం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. భారీ వర్షాన్ని కూడ లెక్కచేయకుండా మాడ వీదులలో తడుస్తూ ప్రదిక్షణాలు చేసి స్వామి వార్ని దర్శించుకున్నారు. శనివారం కావడంతో ఆలయానికి డబ్బయ్ వేల పైబడి భక్తులు రావడంతో సుమారు రూ 52 లక్షలు పైబడి ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రదరరావు తెలిపారు. తెల్లవారుజామునుండి ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజామున 3 గంటలకు సుప్రభాత సేవ, తొలి హారతి తో ప్రారంభమైన స్వామివారి సేవలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, బెంగళూరు,తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వేంకటేశ్వరస్వామి వారి దర్శనం కోసం తరలివచ్చారు.దాదాపు 70, వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 30 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈఓ తెలిపారు. వచ్చిన భక్తులకు త్రాగునీరు, మాజ్జిగ, చంటిపిల్లలకు పాలు, బిస్కెట్లు, ఉచిత పులిహోర, అన్నప్రసాదం ఏర్పాటు చేసారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాల సన్నాహకంలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమం

**- ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి వి ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి**



**విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త** యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అని, యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన దైనందిన జీవిత కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలని జిల్లా ఇంచార్జి మంత్రి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్కే బీచ్ వద్ద నిర్వహించిన యోగ డే వేడుకలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి వి ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహా భాగ్యమని, మన ఆరోగ్యం మనకు గొప్ప ఆస్తి అన్నారు.మన ఆహారపు అలవాట్లు మారుతున్నాయి, పాత తరం ఆహారం వైపు అడుగులు వేస్తున్నామని, అందరి లో ఆరోగ్య భద్రత పెరిగిందని, యోగాంధ్ర లో యోగాసనాలు కార్యక్రమం అందరికీ ఆరోగ్యాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం విశాఖ లో నిర్వహించడం, ప్రధాని మోదీ పాల్గొంటున్న ఈ కార్యక్రమం లో ప్రజలందరూ భాగస్వామి అవ్వాలని కోరారు. రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత మాట్లాడుతూ 11 వ యోగ వేడుకలు మన విశాఖలో నిర్వహించడం మన అదృష్టమని, యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అన్నారు. యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన రోజువారి కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలిని కోరారు. నరేంద్ర మోదీ, చంద్రబాబు. అంత ఎనర్జిటిక్ గా పని చేస్తున్నారు అంటే యోగానే కారణమని, రోజుకి ఒక గంట సమయం కేటాయిస్తే, రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటామని, రాబోవు జనరేషన్ కి యోగాను అందించడంలో మనం కీలక పాత్ర పోషించాలన్నారు.

# నంబాల కేశవరావు, సజ్జ నాగేశ్వరావు మృతదేహాలను అప్పగించండి - హైకోర్టు

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, సజ్జ నాగేశ్వరావు మృతదేహాలను అప్పగించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నంబాల, నాగేశ్వరరావు తరపు బంధువులు ఏపీ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం శనివారం విచారణ జరిపింది. మృతదేహాలకు పోస్టుమార్టం జరిగిందని ఛత్తీస్‌గఢ్ అడ్వకేట్ జనరల్ చెప్పారు. ఇప్పటికే 21 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశామని న్యాయస్థానానికి అడ్వకేట్ జనరల్ తెలిపారు ఎన్‌కౌంటర్ జరిగింది ఛత్తీస్‌గఢ్‌లో అని అక్కడే పిటిషన్ వేయాలని ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. పోస్టుమార్టం పూర్తి అవ్వడంతో మృతదేహాలను ఇస్తామని చెబుతున్నారని...

అందువలన పిటిషనర్‌లు ఛత్తీస్‌గఢ్ అధికారులను సంప్రదించవచ్చని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు పిటిషనర్‌లకు న్యాయస్థానం వెసులుబాటు కల్పించింది.మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ళ కేశవరావు, సజ్జా నాగేశ్వరావుల మృతదేహాలను తమకు అప్పగించాలని ఆయన బంధువులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాల పై ఈ రోజు ఉదయం 11 గంటలకు ఆన్ లైన్ లో విచారణ జరిగింది. పిటిషనర్‌ల తరఫున సీనియర్ కౌన్సిల్ సత్యప్రసాద్ ప్రధానంగా వాదించారు.

# అకుంఠిత దీక్షకు ప్రతిఫలం డిఫెన్స్ క్లష్టర్:ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్




విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్.

**జగ్గయ్యపేట, మే 24, ప్రభాతవార్త :** ఎంతో కాలంగా పడిన కష్టానికి, అకుంఠిత దీక్షకు తగిన ప్రతిఫలం లభించిందని, ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లోని భూముల్లో డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపటం చారిత్రాత్మకమని తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హర్షం వ్యక్తంచేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి, రక్షణశాఖ మంత్రి రాజనాధసింగ్, రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు, యువమంత్రి నారా లోకేష్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈప్రాంతంలో డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటు ద్వారా యువతకు గణనీయమైన ఉపాధులు వస్తాయని సంతోషం వ్యక్తంచేశారు. 2015 నుండే జగ్గయ్యపేట ప్రాంత ప్రభుత్వభూములపై సర్వే ప్రారంభమైందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా తాను ఈ అంశాన్ని ప్రస్తావించటం జరిగిందని గుర్తుచేశారు. అయితే ఏపిఐఐసి నందుగల ఈ ల్యాండ్‌పై కోర్టు కేసు నడుస్తుందని తెలుపగా ఎంపి కేశినేని చిన్ని చొరవ తీసుకుని ప్రభుత్వంతో, న్యాయవాదులతో చర్చించి పదేండ్ల సమస్యను పరిష్కరింపజేశారని తెలిపారు. కాగా పెనుగంచిప్రోలులో దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన కల్వర్టును శనివారం ఎమ్మెల్యే రాజగోపాల్ ప్రారంభించారు. తన నివాసంలో నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర ్యంలో అలింకో, స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘ సౌజన్యంతో ఐదుగురు దివ్యాంగులకు ఎమ్మెల్యే వినికిడి యంత్రాలను అందజేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని పాలేటి ఒడ్డున పునర్నిర్మాణమవుతున్న ప్రాచీన శివపంచాయత క్షేత్రం (మఠం శివాలయం) నిర్మాణ పనుల్లో భాగస్వాములవుతూ పలువురు భక్తులు భారీ విరాళాలు అందిస్తున్నారు. స్థానిక శ్రీగాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి లక్షావెయ్యినూట పదహార్లు, అలాగే చేదే నాగేశ్వరరావు, చేదే జనార్ధనరావు, చేదే వెంకటేశ్వరరావు రూ.1,16,000లు, కొంకిమళ్ళ వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి సతీమణి రమాదేవి, కుమారుడు యోగానందసాయి-నవ్యశ్రీ దంపతులు (యుఎస్ఏ) వారి తల్లి శకుంతల, కొంకిమళ్ళ మల్లు-రంగనాయకమ్మ దంపతులు శనివారం రూ.1,16,000లు వితరణగా ఆలయ నిర్మాణకమిటి సభ్యులకు అందజేశారు.

25-5P🀆g7exHMNWJQE.qxd:25-5P🀆g7exHMNWJQE.qxd 01/01/01 7:12 AM Page 1





# కొవిడ్‌పై ఆందోళన వద్దు

## కరోనా, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలి

## కరోనాపై మంత్రి దామోదర రాజనర్సింహా ఉన్నతస్థాయి సమీక్ష

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో కరోనా కేసులు, టెస్టింగ్‌పై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఎపిడమాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. కొవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు మంత్రి సూచించారు. వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలుబు, దగ్గులాగే కొవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని.. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్కు ధరించడం వల్ల ఒకరి నుంచి ఒకరికి వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మునిసిపల్, ఇతర శాఖలతో కలిసి పని చేయాలన్నారు.

అన్ని హాస్పిటళ్లలో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొవిడ్, డెంగీ పేరిట ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇండియా, ఇతర దేశాల్లో ఉన్న కోవిడ్ పరిస్థితులను అధికారులు, ఎపిడమా లజిస్టులు మంత్రికి వివరించారు. కొన్ని దేశాల్లో కోవిడ్ కేసులు స్వల్పం గా పెరిగినప్పటికి, హాస్పిటలైజేషన్ చాలా తక్కు వగా ఉందన్నారు.

ఇండియాలో పరిస్థితి నార్మల్‌గా ఉందని, జేఎన్1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యా యని.. ఈ వేరియంట్ 2023 నుంచే ఇండియాలో వ్యాప్తిలో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులేమీ లేవ న్నారు. ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి తప్పితే, ఇతరులెవరికీ హాస్పి టలైజేషన్ అవసరం లేదన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటివరకూ అడ్వైజరీలు, గైడ్‌లైన్స్ ఏమీ రాలేదు అని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడ నమోదయ్యే కోవిడ్ కేసులను మేనేజ్ చేయ డానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని అధికారులు మంత్రికి తెలిపారు. టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.



## ఎంవిఐలకు నియామకపత్రాలు అందజేత

### విధుల్లో నిజాయితీగా ఉండాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త** రాష్ట్రంలో కోర్టు కేసుల మూలంగా పెండింగ్‌లో ఉన్న అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్(ఏఎంవిఐ)లకు నియామక పత్రాలను రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం అందజేశారు. గతంలో 96 మంది ఏఎంవిఐలకు నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. పలు కోర్టు కేసుల మూలంగా పెండింగ్‌లో ఉండడంతో ఆలస్యం అవడంతో కోర్టు కేసులు క్లియర్ చేసుకొని మిగిలిన ఏఎంవిఐలకు నియామక పత్రాలను శనివారం అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విధుల్లో సక్రమంగా నిజాయితీగా పని చేయాలని విధిగా శిక్షణ తీసుకొని, రవాణా శాఖకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, సిఎం సెక్రటరీ శ్రీనివాస్ రాజు, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆ దెయ్యాలెవరో కెటిఆర్ చెప్పాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్,మే 23,ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్‌లో కెసిఆర్ చుట్టు ఉన్న ఆ దెయ్యాలు ఎవరో కెటిఆర్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కెటిఆర్ కాంగ్రెస్ పార్టీ మీద మాట్లాడడం కంటే ముందు వారి పార్టీ అంతర్గతంగా జరుగుతున్న అంశంలో ఆత్మపరిశీలనచేసుకోవాలని సలహా ఇచ్చారు. స్వయంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్ దేవుడు ఆయన చుట్టూ దెయ్యాలు చేరారు అని మాట్లాడారు ఆ దయ్యాలు ఎవరో కెటిఆర్ జవాబు చెప్పాలి అని ఆయన కోరారు. కవిత మీడియా కవరేజ్, ప్రెస్ కాన్ఫరెన్స్ లు లీకుతో ఫీలై ఎదో ఒకటి గట్టిగా మాపై అంటే మళ్ళీ కవిత పోయి కెటిఆర్ ముందు వస్తుందనో ఎందుకు చెప్పారు తెలియదని అన్నారు. కెటిఆర్ మా నాయకుడిపై చేసిన బేస్ లెస్ ఆరోపణలపై స్పందించము కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మీ పార్టీలో మీ కుటుంబ సభ్యురాలు కెసిఆర్ దేవుడు ఆయన పక్కన దయ్యాలు ఉన్నాయి అని అన్నారు దానికి సమాధానం చెప్పాలని కోరారు. దెయ్యల కారణంగానే లేఖ లీక్ కావడమే నిదర్శనం అని స్వయంగా కవిత చెప్పారని దానికి జవాబు చెప్పి కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తే తరువాత మా నాయకునిపై మేము జవాబు చెప్తాం అని అన్నారు.17 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై వక్రబుద్ధితో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రతి విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.నేషనల్‌హెరాల్డ్ కేసుతో సిఎం రేవంత్‌రెడ్డికి సంబంధంలేదు "పిసిసి అధికార ప్రతినిధి గాంధీభవన్‌లోనే విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి కెసిఆర్ ఇంట్లో నాలుగు స్థంబాల ఆట ఎన్ని ఆడినా తెలంగాణలో కాంగ్రెస్ మరో పదేళ్ల అధికారంలో ఉంటుందని జోస్యంచెప్పారు.

## బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల ఫలితాలు విడుదల

### 22,080 సీట్లకు 61,119 మంది విద్యార్థులు దరఖాస్తు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల ఫలితాలను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర బిసి గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి ఫలితాలను విడుదల చేసినట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. గత ఏడాది వరకు ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయించబడగా, ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా.. 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం 130 బాలుర కాలేజీల్లో 11,360 సీట్లు ఉండగా, 127 బాలికల కాలేజీల్లో 10,720 సీట్లు కలిపి మొత్తం 22,080 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 61,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 22,080 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని, సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ తీసుకోవాలని సొసైటీ కార్యదర్శి సైదులు స్పష్టం చేశారు.

## ఎసిబి వలలో జగద్గిరిగుట్ట ఎస్‌ఐ

**హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), మే 24, ప్రభాతవార్త:** లంచం తీసుకుంటూ జగద్గిరిగుట్ట ఎస్సై అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బల్కం పేటకి చెందిన జారీ కమల్ బ్యాండ్ సిబ్బంది జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ శుభకార్యానికి వచ్చి బ్యాండ్ వాయించారు. శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారని ఆ బ్యాండ్‌కు చెందిన వాహనాన్ని, సామాగ్రిని ఎస్సై శంకర్ సీజ్ చేశారు. తన సామాగ్రి తమకు ఇవ్వవలసిందిగా బ్యాండ్ సిబ్బంది కోరారు. వాహనం సామాగ్రి తిరిగి ఇవ్వాలంటే రూ.15,000 డిమాండ్ చేశారు. ఇందుకు జగద్గిరిగుట్టకు చెందిన నాగేం దర్‌ను మధ్యవర్తిగా పెట్టుకొన్నాడు ఎస్సై. వారి వేధింపులు తాళలేక బాధితుడు రూ. 15,000 నగదును నాగేందర్‌కు ముట్టచెప్పాడు. నాగేందర్ ఆ మొత్తాన్ని ఎస్సై శంకర్ కు అందజేస్తుండగా ఎసిబి అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. అవినీతికి అరికట్టాల్సిన ఎస్సై శంకర్‌ను, అతనికి సహకరించిన నాగేందర్‌పై ఎసిబి అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.




ఎసిబికి పట్టుబడిన ఎస్సై శంకర్

## ఇంజినీరింగ్ కళాశాలల విచ్చలవిడి డొనేషన్లను అరికట్టాలి : ఆర్.కృష్ణయ్య

### సిఎంకు లేఖ రాసిన 14 బిసి సంఘాలు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు విచ్చల విడిగా డొనేషన్లను వసూలు చేస్తున్నాయని, ఈ అక్రమ వసూళ్లను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం 14.బిసి సంఘాల ప్రతినిధుల బృందం ఈ అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 40.శాతం సీట్లు యాజమాన్యపు కోటా కింద భర్తీ చేసుకునే అవకాశంను ప్రభుత్వం కల్పించిందని, దీన్ని యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలుసుకొని విద్యార్థుల నుంచి అడ్డూ అదుపు లేకుండా రూ.10.నుంచి రూ.30.లక్షల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్య కోటాను కళాశాలలకు వదిలేయడం వలన పేరున్న టాప్ 25.కళాశాలల్లో రూ.10,15,20,25,30.లక్షల వరకు వసూలు చేసుకుంటున్నారన్నారు. ఈ కారణంగా సీట్లన్నీ డబ్బున్నోళ్లకే ఇస్తుండడంతో మెరిట్ ఉండీ కూడా పేదవిద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కళాశాలలపై కొరడా ఝుళిపించి మెరిట్ విద్యార్థులకు న్యాయం జరిగేలా సర్కారు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## ఫార్మసీ కాలేజీల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

### నాలుగేళ్ల బకాయిలు రూ. 550 కోట్లు

### ట్యూషన్ ఫీజులను నేరుగా కాలేజీలకు చెల్లించాలి

### ఫార్మసీ కళాశాలల యాజమాన్యాల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఫార్మసీ కాలేజీల్లో చదివే విద్యార్థులకి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫార్మసీ కాలేజీల యాజమాన్యాల సంఘం డిమాండ్ చేసింది. సుమారు 550 కోట్ల బకాయిలు ఉన్నాయని.. బకాయిల మూలంగా కాలేజీలను కొనసాగించలేకపోతున్నామని అసోసియేషన్ నేతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కళాశాలల యాజమాన్యాల సంఘం శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె రాందాస్, జనరల్ సెక్రటరీ పుల్ల రమేష్ బాబు, వైస్‌ప్రెసిడెంట్ ఎం నరసింహారెడ్డి, జాయింట్ సెక్రటరీ కడియాల సతీష్, అసోసియేషన్ నాయకులు బొమ్మ శ్రీధర్, సిద్ధార్థ రెడ్డి, ఎం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో 7 ప్రభుత్వ ఫార్మసీ కాలేజీలు, 113 ప్రైవేటు ఫార్మసీ కళాశాలలు ఉన్నాయన్నారు. వాటిలో ప్రభుత్వ కళాశాలల్లో 1500 మంది విద్యార్థులు చదువుతుంటే.. ప్రైవేట్ ఫార్మసీ కాలేజీల్లో 70 వేల మంది విద్యార్థులు, బిఫార్మసి, ఎంఫార్మసి, ఫార్మా డి కోర్సులు చదువుతున్నారని తెలిపారు. సుమారు 98 శాతం విద్యార్థులు ప్రైవేటు ఫార్మసీ కాలేజీల్లోనే చదువుతున్నారని తెలిపారు. వారిలో సుమారు 55 వేల మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పొందుతున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరానికి రూ. 200 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మసీ కోర్సులకు బాగా డిమాండ్ ఉందని... ఉత్పత్తి రంగంలోనే కాకుండా క్లినికల్ రంగం వైపు కూడా ఫార్మసీ విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ రంగంలో భారీ డిమాండ్ ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని ఫార్మసీ కాలేజీలకు గత 4 సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు రాకపోవడంతో సుమారు రూ. 550 కోట్లు ట్యూషన్ ఫీజు బకాయిలు పేరుకుపోయాయని రాందాస్ అన్నారు. దీని వల్ల తాము సకాలంలో బోధనా, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించలేక పోతున్నామన్నారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వానికి ఫార్మసీ కళాశాలలు ఈ విద్యాసంవత్సరం నుంచి నేరుగా విద్యార్థి నుండి ట్యూషన్ ఫీజు వసూలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించేలా చూడాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మొదట ఉద్దేశించిన విధంగా ఫీజు రీయింబర్స్‌మెంటును కాలేజీలకు కాకుండా నేరుగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు చెల్లించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో హామీ ఇచ్చినట్లుగా.. గత 4 సంవత్సరాల పెండింగ్ ఫీజు బకాయిలను రెండు, మూడు విడతల్లో విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## హుజూర్‌నగర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం

### జూన్ చివరి నాటికి 2,160 ఇళ్లు పూర్తి చేయాలి

### రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యత లేకుంటే చర్యలు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హుజూర్‌నగర్‌టౌన్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్ది సాటిలేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మం త్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని ఫణిగిరి రామసా ్వమిగట్టు వద్ద నిర్మిస్తున్న 2, 160 ఇండ్ల అభివృద్ధి పనులు, అలాగే రూ.30 కోట్లతో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఐటిఐ కళాశాల భవన నిర్మాణం, రూ. 8 కోట్లతో నిర్మించే ఆర్ అండ్‌బి అతిథిగృహంతోపాటు హుజూర్‌నగర్ ఔటర్ రింగ్‌రోడ్డు, రూ.4.05 కోట్లతో నిర్మించే డిగ్రీ కళాశాల అదనపు తరగతుల భవనం, రూ. 8.05 కోట్లతో జూనియర్ కళాశాల తరగతి గదుల నిర్మాణ పనులను ఆర్ అండ్‌బి, హౌజింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గ కేంద్రంలో ఫణిగిరి రామస్వామి గట్టు వద్ద పేదలకు సొంత ఇంటిని నిర్మించి ఇచ్చే సింగిల్ బెడ్‌రూం ఇండ్ల పనులను వేగవంతం చేసి జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని నాణ్యతతో ఇండ్ల నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశం చారు. అలాగే అక్కడే నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఈ ప్రాంతంలో సాంకేతిక విద్యను విద్యార్థులకు అందుబాటు లోకితెచ్చి తొందరగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన అడ్వాన్ ్స స్కిల్స్, రోబో టెక్నాలజీ, ఎలక్ట్రికల్ వెహికల్ రిపేర్, ప్రాసెసింగ్ టెక్నాలజీ వంటి నూతన కోరు ్సలను 170 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈ నిర్మాణ పనులు జూన్ చివరి వరకు పూర్తి చేసి జూలైలో ఇక్కడ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి కా ్యంప్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బి, డిఎం ఎఫ్‌టి, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నియోజ కవర్గంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల పనులు ఎక్కడెక్కడ ప్రారంభించారు, వాటి ప్రగతితోపాటు నిర్మాణ పనులు చేపట్టని వాటికి వెంటనే నిర్మాణం చేపట్టాలని, రహదారులు నిర్మించేటప్పుడు అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంభాలను విద్యుత్ అధికారులతో మాట్లాడి వాటిని పక్కకు జరిపి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో నిర్మించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో కోదాడ ఆర్డీవో సూర్య నారాయణ, ఆర్‌అండ్‌బి ఎస్ఈ సీతారామయ్య, పిఆర్‌ఈఈ వెంకటయ్య, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, హౌజింగ్ ఎస్ఇ వెంకటదాసురెడ్డి, డిఇ జగన్, ఎఇ సాయిరాంరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌పై వేటు



డాక్టర్ రవి కుమార్

**హైదరాబాద్ (మెహదీపట్నం), మే 24, ప్రభాతవార్త :** నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కొద్దిరోజుల క్రితం ఆస్పత్రి ప్రాంగణంలో ప్రైవేట్ మెడికల్ షాప్ కోసం ఓ గది నిర్మాణం చేప ట్టగా దానికి అనుమతులు లేవంటూ అధికారులు కూల్చి వేశారు. ఈ విషయంలో ఆరోపణలు ఎదు ర్కొంటున్న డాక్టర్ రవికుమార్‌ను సస్పెండ్ చేస్తు న్నట్లు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఆస్ప త్రిలో పీడియాట్రిక్ హెచ్‌ఒడిగా ఉన్న డాక్టర్ జి.విజయ్‌కుమార్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెం డెంట్‌గా నియమించినట్లు వెల్లడించారు.

## ఆదిలాబాద్‌లో ఎసిబికి చిక్కిన మండల సర్వేయర్

**హైదరాబాద్ మే 24, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో మండల సర్వేయర్ రైతు వద్ద నుంచి 20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కాడు. వివరాలు ఇలా వున్నాయి. జిల్లాలోని కడెం మండల సర్వేయర్ ఉమాజి గంగాపూర్ గ్రామానికి చెందిన గూగులావత్ ప్రభాకర్ అనే రైతు సరిహద్దులను సరిచేసి పట్టా ఇచ్చేందుకు 20 వేల రూపాయల లంచం అడిగాడు. తన తండ్రి నుంచి తనకు వచ్చిన వారసత్వ ఆస్తికి పట్టా ఇచ్చేందుకు లంచం ఎందు కు ఇవ్వాలని ప్రభాకర్ కోరగా ఈ విషయంలో లంచం ఇస్తేకానీ పని జరగదని సర్వేయర్ ఖరా కండిగా చెప్పాడు. దీంతో రైతు దీనిపై ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసిన ఎసిబి అధికారులు మండల కార్యాలయంలో సర్వేయర్ ఉమాజికి రైతు ప్రభాకర్ చేత 20 వేల రూపాయలు లంచంగా ఇచ్చేలా చేశారు. రైతు నుంచి సర్వేయర్ లం చం తీసుకున్న తరువాత సమీపంలోనే మాటువేసిన ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి అతన్ని పట్టుకున్నారు. అనంతరం నిందితుడి నుంచి లంచం డబ్బులను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

## ఆంధ్రప్రదేశ్ 10వ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరానికి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు అత్యధిక మార్కులు 599 సాధించి విజయకేతనం ఎగురవేశామని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదేవిధంగా 598 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఏడుగురు, 597 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 42 మంది, 596 ఆ పైన మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులు 109 మంది, 595 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 201 మంది, 590 ఆ పైన మార్కులు 1184 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అదేవిధంగా మొత్తం 24261 మంది విద్యార్థులకుగాను శ్రీచైతన్య స్కూల్ సగటు మార్కు 600కు గాను 528. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 శాతం. సుమారు 80 శాతం బ్రాంచ్లు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయని ఆమె తెలిపారు. ప్రస్తుతానికి రీవెరిఫికేషన్ ఆధారంగా పైన తెలిపిన సంఖ్యలు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం తెలియజేయడం జరిగిందన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1వ ర్యాంకుతోపాటు 100 లోపు ర్యాంకులు 19 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారని ఆమె తెలిపారు. శ్రీచైతన్య సాధించిన ఇంతటి ఘనవిజయాలకు దరిదాపుల్లో దేశంలోగాని, రాష్ట్రంలోగాని మరే ఇతర విద్యాసంస్థ లేదని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సిఓ ఐపియల్, సిఐపియల్, యమ్.పి. యల్., ఐకాన్, సిబ్యాచ్, యస్‌బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వలన మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యాసంస్థల మరొక డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలియజేశారు.




గాంధీభవన్‌లో శనివారం మీడడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

## కవిత సస్పెన్షన్‌కే దెయ్యాల స్కెచ్

### జయలలిత తరహాలో కెసిఆర్ పరిస్థితి

### కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త: కవిత చెప్పిన దెయ్యం సంతోష్‌రావు, కెటిఆర్, హరీశ్‌లు ఆమెను సస్పెండ్ చేసేందుకు స్కెచ్ వేశారని కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కవిత లేఖ గురించి పది రోజుల ముందే చెప్పానని ఆయన వివరించారు. నేడో, రేపో కవితను సస్పెండ్ చేస్తారని వెల్లడించారు. సంతోష్‌ను పార్టీ ప్రెసిడెంట్ చేసే అవకాశముందని వివరించారు. కెసిఆర్ పరిస్థితి జయలలిత లాగా తయారైందని అపహాస్యంచేశారు.

కవితపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే ఆమె సొంత పార్టీ పెట్టుకుంటుందని చెప్పారు. కవితతో మాట్లాడి సమస్య పరిష్కరించుకునే ఆలోచన కెటిఆర్ కి లేదు. సొంత మనుషులే కెసిఆర్‌ను వెన్నుపోటు పొడుస్తారు. కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసినా కెసిఆర్ నిస్సహాయుడిగా ఉన్నారనిఆవేదన చెందారు. పార్టీ అంతర్గత విషయాలను బయట మాట్లాడితే గతంలో అనేకమందిపై కెసిఆర్ చర్యలు తీసుకున్నారు. కెసిఆర్‌తో కవిత మాట్లాడతా అంటే సంతోష్ అడ్డుకున్నాడని ఆయన తెలిపారు. కెసిఆర్ ఏం చేయాలో, ఎవర్ని కలవాలో సంతోష్ డిసైడ్ చేస్తున్నారు.

# భారీగా గంజాయిని పట్టుకున్న పోలీసులు

## వాహన తనిఖీల్లో రూ.3.49 కోట్ల విలువైన సరకు స్వాధీనం



పట్టుబడిన గంజాయితో పోలీసులు

**కొత్తగూడెం క్రైం, మే 24,ప్రభాతవార్త:** విశ్వసనీయ సమాచారం మేరకు టేకులపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శనివారం టేకులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలో గల సులానగర్ మినిస్ట్రీ చర్చ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో ఎస్కార్ట్‌గా వస్తున్న కారు నెంబర్, ఐచర్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 698 కిలోల ప్రభుత్వ నిషేదిత గంజాయిని గుర్తించడం జరిగింది. సుమారుగా 3,49,00,000 రూపాయల విలువ గల ఇట్టి గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకోవడమైనది. ఐచర్ వ్యానులో ఉన్న ముగ్గురు వ్యక్తులను కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టడం జరిగింది.ఇట్టి నిషేధిత గంజాయిని అమ్మిన వ్యక్తులపైన,కొనుగోలు చేసిన వ్యక్తులు, రవాణా చేస్తున్న వ్యక్తులందరిపై కేసు నమోదు చేసి అట్టి రవాణాకు ఉపయోగించిన ఐచర్ మరియు కారును, 5 మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేయడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు అటవీ ప్రాంతం నుండి హర్యానా రాష్ట్రం,కురుక్షేత్ర ప్రాంతానికి అక్రమంగా ఇట్టి గంజాయిని రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది.పట్టుబడిన నిందితులం దరూ కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్ కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీస్ మాటున ఇట్టి గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు.

### పట్టుబడిన ఆరుగురు వ్యక్తుల వివరాలు

హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర జిల్లాకు చెందిన సందీప్ కుమార్ అలియాస్ రింకు లక్విందర్, అమర్ నాథ్ కుమార్ అలియాస్ అమర్ నాథ్, పవన్ కుమార్, రాజ్ కుమార్ అలియాస్ వినోద్, కృషన్ కుమార్ అలియాస్ కాలే ను పట్టుకున్నారు. వీరికి గంజాయి అమ్మిన వ్యక్తులు హరి ఖారా, ప్రిన్స్ కుమార్ (హర్యానా రాష్ట్రం). ఈ రోజు పట్టుబడిన ఆరుగురు వ్యక్తులను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టునకు తరలించడం జరిగినది.నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న టేకులపల్లి సిఐ టి.సురేష్,ఎస్సై తి.రాజేందర్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఎస్సైలు ప్రవీణ్,రామారావు, సిబ్బందిని ఎస్పి రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

25-5pg10.qxd:25-5pg10.qxd 01/01/01 5:41 AM Page 1





## స్లో ఓవర్ రేట్‌తో కమిన్స్, పాటిదార్‌లకు జరిమానా

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) కెప్టెన్ రజత్ పాటిదార్ మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌లకు వారి జట్ల స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించబడింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం కమిన్స్ జట్టు ఈ సీజన్‌లో చేసిన మొదటి నేరం కావడంతో అతనికి రూ.12 లక్షల జరిమానా విధించగా, రెండోసారి కూడా నేరం చేసిన ఆర్‌సిబి జట్టు ప్లేయింగ్ ఎలెవన్‌లో సభ్యుడిగా పాటిదార్‌కు రూ.24 లక్షల జరిమానా విధించారు. ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా ప్లేయింగ్ 11 లోని మిగిలిన సభ్యులకు ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా రూ.6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం, ఏది తక్కువైతే అది జరిమానా విధించినట్లు ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. కనీస ఓవర్‌రేట్ నేరాలకు సంబంధించిన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, ఈ సీజన్‌లో అతని జట్టు చేసిన మొదటి నేరం ఇది కాబట్టి, కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధించబడింది" అని పేర్కొంది.

## నాపోలికి ఫుట్‌బాల్ టైటిల్

### 2-0 తేడాతో కాగ్లియా ఓటమి



**న్యూఢిల్లీ:** నాపోలి 2024-25 సిరీస్ ఎ ఫుట్‌బాల్ టైటిల్‌ను గెలుచుకుంది. చివరి మ్యాచ్‌లో ఇంటర్ మిలన్‌ను ఒక పాయింట్ తేడాతో ఓడించడం ద్వారా ఈ విజయాన్ని అందుకుంది. ఛాంపియన్స్ లీగ్ ఆశావాదులైన ఇంటర్ కోమోలో సాధించిన విజయం వృధా కావడంతో, నాపోలి 2-0 తేడాతో కాగ్లియారీని ఓడించి సీరీ ఎ టైటిల్‌ను కైవసం చేసుకుంది. శనివారం జరిగిన సిరీస్ టైటిల్ రేస్ ముగింపు మ్యాచ్‌లో నాపోలి చివరి రౌండ్ ఆటలకు చేరుకునే ముందు ఇంటర్ మిలన్ కంటే ఒక పాయింట్ ఆధిక్యంలో ఉంది. విరామానికి మూడు నిముషాల ముందు మెక్‌టోమినే మాటియో పొలిటాన్ క్రాస్ నుండి అద్భుతమైన సైకిల్ కిక్‌తో స్కోరింగ్‌ను ప్రారంభించాడు. పునహ ప్రారంభమైన ఆరు నిముషాల తర్వాత లుకాకు లాంగ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. గత సీజన్‌లో పేలవమైన టైటిల్ డిఫెన్స్‌లో పార్టెనోపీ 10వ స్థానంలో నిలిచిన తర్వాత దక్షిణ జట్టు మొత్తం ఈమధ నాల్గవ సిరీస్ ఎ టైటిల్‌ను ఆకట్టుకునే మలుపు తిప్పింది. ఆ సీజన్‌లో ఇంటర్ చేతిలో ఓడిపోయిన నేపుల్స్ క్లబ్ టైటిల్‌ను తిరిగి పొందేందుకు నాపోలి ఈసారి తీవ్ర యత్నం చేసింది. ఇంటర్ తరపున డిఫెండర్ స్టెఫాన్ డివ్రిజ్ 20 నిముషాల్లో గోల్ చేశాడు. బౌన్స్ హెడర్‌తో కార్నర్ కిక్‌ను దారి మళ్లించాడు.



ఆట

## భారత్ కెప్టెన్‌గా గిల్

### టెస్టు క్రికెట్‌లో నవ శకం స్టార్ట్.. ఇండియా జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** భారత టెస్టు క్రికెట్‌లో నవ శకం ప్రారంభమైంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టీమ్ ఇండియా కొత్త కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. తొలి నుంచి ప్రచారం జరినట్లుగానే గిల్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపారు. జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఇందులో గిల్‌కు డిప్యూటీగా రిషభ్ పంత్‌ను నియమించింది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. ఇక 33ఏళ్ల కరుణ్ నాయర్‌కు ఎట్టకేలకు టీమ్ ఇండియా పిలుపు అందింది. గత కొంతకాలంగా దేశవాళీలో అదరగొడుతున్న కరుణ్‌ను సెలక్టర్లు ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక చేశారు. 2016లో టెస్టుల్లో ఎంట్రీ ఇచ్చిన కరుణ్ 6 మ్యాచ్‌లే ఆడాడు. ఇందులో ఓ ట్రిపుల్ సెంచరీ ఉంది. అయితే ఆ తర్వాత ఏడాదే 2017లో కరుణ్ జట్టులో చోటు కోల్పోయాడు. అప్పటి నుంచి టీమ్ ఇండియాలో రీఎంట్రీ కోసం ప్రయత్నిస్తే, ఇన్నేళ్లకు అవకాశం దక్కింది. అలాగే తొలి సారిగా నలుగురికి భారత్ జట్టులో చోటు దక్కింది. సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, అర్షదీప్ సింగ్‌లకు లక్కీ ఛాన్స్ దక్కింది. ఇంగ్లాండ్ సిరీస్ లో వీళ్లు బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. కాగా, సాయి సుదర్శన్, అర్షదీప్ ఇప్పటికే టీ20, వన్డేల్లో ఆడినప్పటికీ టెస్టుల్లో అవకాశం ఇదే ఫస్ట్ టైమ్. మరోవైపు, అభిమన్యు టీమ్ ఇండియాకు ఎంపికవ్వడం ఇదే తొలిసారి. మరోవైపు, సీనియర్ బ్యాటర్లు అజింక్యా రహానే, ఛతేశ్వర్ పుజారాకు మరోసారి నిరాశే మిగిలింది. రోహిత్, విరాట్ రిటైర్మెంట్ నేపథ్యంలో ఈ ఇద్దరికీ అవకాశం వస్తుందని భావించినా సెలక్టర్లు మొండి చేయి చూపారు. రహానే, పుజారా టీమ్‌ఇండియా తరఫున 2023లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడారు. కాగా టీమ్‌ఇండియాలో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్ ఉన్నారు.

## ఐపిఎల్‌లో మెయిడిన్‌గా 20వ ఓవర్

### లాస్ట్ ఓవర్‌లో ఒక్క రన్ ఇవ్వని బౌలర్లు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో బరిలోకి దిగిన బ్యాటర్ ప్రతి బంతిని బౌండరీ లైన్ దాటించాలనే ప్రయత్నిస్తాడు. అలాగే ఆట మొదలైనప్పటి నుంచి ముగిసేదాకా బ్యాటర్‌ను కట్టడి చేయడానికి బౌలర్‌పై ఒత్తిడి తీవ్రంగానే ఉంటుంది. డెత్ ఓవర్లలో అయితే చెప్పనవసరం లేదు. మరీ ముఖ్యంగా చివరి ఓవర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఏ బౌలర్‌కైనా చివరి ఓవర్ (20వ ఓవర్) బౌలింగ్ చేయడం అంత సులువేం కాదు. అలా ఐపీఎల్‌లో 20వ ఓవర్లో 30+ పరుగులు వచ్చిన సందర్భాలు అనేకం. అయితే అలాంటి కఠినమైన పరిస్థితుల్లో చివరి ఓవర్‌ను మెయిడిన్‌గా మలిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. మెయిడిన్ ఓవర్ అంటే ఒకే ఓవర్‌లో బౌలర్ ఒక్క పరుగు కూడా ఇవ్వకపోయినట్లయితే ఆ ఓవర్‌ను మెఇయడిన్ ఓవర్ అంటారు. అవును! 18 సీజన్ల ఐపీఎల్ చరిత్రలో ఒక్కసారి, రెండుసార్లు కాదు. ఏకంగా నాలుగుసార్లు 20వ ఓవర్ మెయిడెన్ అయ్యింది. మరి ఈ అరుదైన ఘనత సాధించిన బౌలర్లలో నలుగురు ఉన్నారు. క్రికెట్ లో చివరి ఓవర్‌ను మెయిడిన్‌గా వేసిన బౌలర్లలో ఇర్ఫాన్ పఠాన్, ఉమ్రాన్ మాలిక్, జయదేవ్ ఉనద్కట్, లాసిత్ మాలింగ ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో 20వ ఓవర్ మెయిడెన్‌గా మలిచిన తొలి బౌలర్ ఇర్ఫాన్ పఠాన్. 2008లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన ఇర్ఫాన్, ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. అతను హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో 20వ ఓవర్ మెయిడిన్ వేసి 3 వికెట్లు కూడా తీసుకున్నాడు. ఇర్ఫాన్ ఐపీఎల్ కెరీర్‌లో 103 మ్యాచ్‌ల్లో 80 వికెట్లు పడగొట్టాడు. ఇక ముంబయి ఇండియన్స్ బౌలర్ లసిత్ మలింగ ఐపీఎల్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకరిగా నిలిచాడు. 2009లో దక్కన్ ఛార్జర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మలింగ 20వ ఓవర్ మెయిడెన్ చేశాడు. ఈ ఓవర్‌లో పరుగులేమీ ఇవ్వకపోవడమే కాకుండా 2 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. మలింగ









122 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 170 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఈ అరుదైన ఘనత సాధించిన లిస్ట్‌లో టీమ్‌ఇండియా పేసర్ జయదేవ్ ఉనాద్కత్ కూడా ఉన్నాడు. 2017 ఐపీఎల్‌లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ టీమ్‌లో ఉన్నాడు. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో మెయిడెన్‌తో సహా 3 వికెట్లు పడగొట్టాడు. ఒక మెయిడెన్‌తో హ్యాట్రిక్ వికెట్లు తీసిన బౌలర్‌గా కూడా రికార్డు సృష్టించాడు. 2022 ఐపీఎల్‌లో ఉమ్రాన్ మాలిక్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టి ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు.





## విండీస్ మ్యాచ్ రద్దు

### వర్షంతో సాధ్యంకాని ఐర్లాండ్ ఇన్నింగ్స్

### ఫలితం లేకుండా ముగిసిన రెండో వన్డే

**న్యూఢిల్లీ:** విజయంపై ఆశలు పెంచుకున్న వెస్టిండీస్‌ను వరుణుడు కరుణించ లేదు. దీంతో ఐర్లాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డే ఫలితం తేలకుండానే ముగిసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం రావడంతో ఐర్లాండ్ ఛేజింగ్ సాధ్యపడ లేదు. వెరసి మూడు వన్డేల సిరీస్‌లో ఐర్లాండ్ ప్రస్తుతం 1-0 ఆధిక్యంతో ఉంది. ఇక ఐర్లాండ్ చేతిలో తొలి వన్డేలో ఎదురైన ఓటమి నుండి తేరుకున్న విండీస్ రెండో వన్డేలో అదరగొట్టి భారీ స్కోరు చేసింది. డబ్లిన్‌లో టాస్ గెలిచిన ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఫీల్డింగ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 352 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ కేసీ కార్టీ (109 బంతుల్లో 102, 13 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో రెండో సెంచరీ నమోదు చేయగా, చివర్ల మాథ్యూ ఫోర్డ్ (19 బంతుల్లో 58 పరుగులు, 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో శివమెత్తాడు. కేవలం 16 బంతుల్లోనే ఫోర్డ్ అర్ధ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఏబీ డివిలియర్స్ (16 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును ఫోర్డ్ సమం చేశాడు. కెప్టెన్ షై హోప్ (57 బంతుల్లో 49 పరుగులు, 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో అర్ధ సెంచరీని చేజార్చుకోగా, జస్టిన్ గ్రీవెస్ (36 బంతుల్లో 44 పరుగులతో నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్సస దూకుడుగా ఆడాడు. ఐర్లాండ్ బైలర్లలో బ్యారీ మ ఎకార్తీ, జోష్ లిటిల్ 2 వికెట్లు చొప్పున తీయగా, లియామ్ మెకార్తీకి 3 వికెట్లు దక్కాయి. ఇక ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఈనెల 25న జరగనుంది.

## ఆర్‌బిఐ డివిడెండ్ రూ.2.70 లక్షల కోట్లు

**ముంబై, మే 24:** ఈ సారి ప్రభుత్వానికి కొత్త రికార్డు డివిడెండ్ చెల్లించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. నివేదిక ప్రకారం, ఆర్‌బిఐ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్‌ను బదిలీ చేస్తుంది. అంతకుముందు సంవత్సరం (2023-24)లో ఇది రూ.2.1 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లించింది. అయితే, ఈసారి డివిడెండ్ 27 శాతం పెరిగింది. ఇది ప్రభుత్వానికి ఆర్బీఐ చెల్లించే గరిష్ట డివిడెండ్ మొత్తం. 2022-23లో ప్రభుత్వానికి ఆర్‌బిఐ చెల్లించిన డివిడెండ్ కేవలం రూ.87,416 కోట్లు మాత్రమే. ప్రపంచ అనిశ్చితి, పాకిస్తాన్‌తో సరిహద్దు వివాదం వంటి సంఘటనలు భారత దేశ ఆర్థిక పురోగతికి కొంతవరకు ఆటంకం కలిగించాయి. ఈ సమయంలో ఆర్థిక వృద్ధిని పెంచడానికి ప్రభుత్వం ఈ సంవత్సరం చాలా ఖర్చు చేయడం అత్యవసరం. ఈ కారణంగా ఆర్‌బిఐనుండి వచ్చే రూ.2.70 లక్షల కోట్లు ప్రభుత్వానికి సహాయపడతాయి. మే 15న కొత్త ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్ష తన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో రూ.2,68,590.07 కోట్ల డివిడెండ్ ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. డివిడెండ్ మొత్తాన్ని ఎకనామిక్ కేపిటల్ ఫ్రేమ్‌వర్క్ అనే ఫార్ములా ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, 7.50 నుండి 4.50 వరకు ఆదాయం శాతాన్ని కంటింజెంట్ రిస్క్ బఫర్‌గా పరిగణిస్తారు. ఈరిస్క్ బఫర్‌మొత్తాన్ని నిలుపుకుని, మిగిలిన మొత్తాన్ని డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి ఇస్తారు. ఆర్‌బిఐ ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి డివిడెండ్‌లను చెల్లిస్తుంది. బాండ్ల నుండి వచ్చేవడ్డీ, ఫారెక్స్ నిల్వలలో ఉన్న ఆస్తుల పెరుగుదల నుండి వచ్చే లాభాలు మొదలైనవి ఆర్‌బిఐకి ప్రధాన ఆదాయ వనరులు. ఆర్‌బిఐ వాణిజ్య బ్యాంకులకు నిర్దిష్ట వడ్డీ రేటుకు డబ్బు ఇస్తుంది. ఇది ఆర్‌బిఐకి ప్రధాన ఆదాయవనరు. ఆర్‌బిఐ ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేస్తుంది. ఇవి ప్రభుత్వం నుండి వడ్డీ చెల్లింపులను పొందుతాయి. ఆర్‌బిఐ తన విదేశీ మారక నిల్వలలో గణనీయమైన భాగాన్ని యుఎస్ ట్రెజరీ బాండ్ల వంటి ఆస్తులలో పెట్టుబడి పెడుతుంది.



## టారిఫ్ విధించినా.. భారత్‌లో తక్కువ రేటుకే ఆపిల్ ఫోన్లు

**వాషింగ్టన్, మే 24:** అమెరికాలో ఐఫోన్లు తయారుచేయని పక్షంలో, ఆపిల్ ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధిస్తానని డొనాల్డ్ ట్రంప్ మరో సారి ఆపిల్‌ను హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే భారత్‌లో తయారుచేసే ఐఫోన్లపై అగ్రరాజ్యం సుంకం విధించినప్పటికీ దేశంలో ఐఫోన్ల తయారీ అమెరికాలో కంటే తక్కువే అవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో తక్కువ ఉత్పత్తి ఖర్చులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటివి దీనికి దోహదం చేస్తాయని పేర్కొంది. జీటీఆర్ఐ నివేదిక ప్రకారం.. భారత్‌లో ఒక ఐఫోన్ అసెంబ్లింగ్ ఖర్చు సుమారు 30 డాలర్లు కాగా, అమెరికాలో 390 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుంది. దీని కారణంగా భారత్‌లో కార్మికుల జీతాలు తక్కువగా ఉండటమే. దేశంలో ఒక కార్మికుడికి నెల సంపాదన సగటున 230 డాలర్లు (రూ.19,000). అదే అమెరికాలో కనీస వేతన చట్టాల కారణంగా ఈ సంపాదన 2,900 డాలర్ల (రూ.2.4 లక్షలు) వరకు ఉంటుంది. అంటే దాదాపు 13 రెట్ల వ్యత్యాసం. దీనికితోడు భారత ప్రభుత్వం అందించే పీఎల్ఐ పథకం కూడా యాపిల్‌కు అదనపు లాభాల్ని అందిస్తోంది. దీంతో భారత్‌లో తయారుచేసే ఐఫోన్లపై 25 శాతం సుంకం విధించినా అమెరికా మార్కెట్లో చౌకగా లభిస్తాయని నివేదిక తెలుపుతోంది. ఐఫోన్లను 12కు పైగా దేశాలు కలిపి తయారుచేస్తాయి. యాపిల్ తన బ్రాండ్, సాఫ్ట్‌వేర్, డిజైన్‌లతో ఒక్కో ఐఫోన్‌పై 450 డాలర్ల లాభం ఆర్జిస్తుంది. ఇక అమెరికాలో ఐఫోన్లను తయారు చేస్తే.. ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. దీనికి అనుగుణంగా రిటైల్ ధరలు పెంచకపోతే ఆపిల్ లాభం 450 డాలర్ల నుంచి 60 డాలర్లకు పడిపోవచ్చని పేర్కొంది. భారత్‌లో ఐఫోన్ల తయారీకి అమెరికా విధించే సుంకాల ముప్పు ఉన్నప్పటికీ ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని జీటీఆర్ఐ నివేదిక స్పష్టం చేసింది.




## ఐటిఆర్ దాఖలుకు ముందు చేయాల్సిన పనులివే..

**న్యూఢిల్లీ, మే 24:** ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేసే సమయం వచ్చినప్పుడు చాలా మంది పన్ను చెల్లింపుదారులు తొందరపడి తమ రిటర్న్‌లను దాఖలు చేస్తారు. కానీ మీరు ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు అందుకోకూడదనుకుంటే లేదా మీ పన్ను వాపసు నిలిచిపోయినట్లయితే, ఐటిఆర్ దాఖలు చేసే ముందు, ఖచ్చితంగా ఫారమ్ 26ఎఎస్ వార్షిక సమాచార ప్రకటన (ఎఐఎస్) తనిఖీ చేయండి. ఫారం 26ఎఎస్ అనేది మీ పాన్ నంబర్ నుండి ఎంత పన్ను తగ్గించబడిందో, ఎంత పన్ను జమ అవుతుందో చూపించే పన్ను క్రెడిట్ స్టేట్‌మెంట్. ఇందులో జీతం, బ్యాంకు వడ్డీ, ఆస్తి కొనుగోలు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి వంటి సమాచారం ఉంటుంది. ఇందులో ఏదైనా టిడిఎస్ ఎంట్రీ తప్పిపోతే, మీరు పన్ను క్రెడిట్ పొందడంలో సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేసే ముందు అన్ని ఎంట్రీలు సరిగ్గా నమోదు అయ్యాయో నిర్ధారించుకోవడం ముఖ్యం. ఎఐఎస్ అనేది ఫారం 26ఎఎస్ కంటే ఎక్కువ సమాచా రాన్ని అందించే వివరణాత్మక పత్రం. ఇది బ్యాంకు నుండి పొందిన వడ్డీ, డివిడెండ్, షేర్లు, మ్యూచువల్ ఫండ్ల కొనుగోలు, అమ్మకం, అద్దె, విదేశీ లావాదేవీలు, క్రెడిట్ కార్డ్ ఖర్చుల గురించి సమాచారాన్ని కలిగి ఉంటుంది. ఎఐఎస్ అనేది మీ మొత్తం ఆర్థిక ప్రొఫైల్ బ్లూప్రింట్, ఇది పన్ను శాఖ వద్ద అందుబాటులో ఉంటుంది. మీరు మీ ఐటీఆర్‌లో ఎటువంటి సమాచారాన్ని పూరించక పోయినా, అది ఎఐఎస్‌లో నమోదు చేయబడితే, మీకు తర్వాత ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు రావచ్చు. అందువల్ల ఎఐఎస్‌ని తనిఖీ చేయడం చాలా ముఖ్యం. అలాగే ఏదైనా వ్యత్యాసం గమనించినట్లయితే, పోర్టల్‌లో అభిప్రాయాన్ని అందించండి. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఐటీఆర్ దాఖలు చేయడనికి చివరి తేదీ జూలై 31, 2025 (ఆడిట్ కాని సందర్భాలలో). ఫారమ్‌లు ఇంకా పూర్తిగా అప్‌డేట్ చేసినప్పటికీ.. మీరు ఫారమ్ 26ఎఎస్, ఎఐఎస్‌ని తనిఖీ చేయడం ద్వారా మీ ఐటీఆర్ ని ఇప్పుడే ప్రారంభించవచ్చు. ఫారమ్ 26ఎఎస్, ఎఐఎస్‌ని తనిఖీ చేయడం ఒక చిన్న దశ కానీ చాలా ముఖ్యమైన దశ. ఇది మీ రిటర్న్‌ను సరిగ్గా ఉంచడమే కాకుండా, పన్ను వాపసులో జాప్యం, నోటీసు వంటి సమస్యలను కూడా నివారించవచ్చు.




## మళ్లీ ఐపిఒకు రెడీ అవుతున్న కంపెనీలు

**ముంబై, మే 24:** ఈ యేడాది ప్రారంభం నుంచి భారత స్టాక్ మార్కెట్లు ఒడుదుడుకుల మధ్య స్థిరమైన ర్యాలీని చూస్తున్నాయి. ఈ కారణంగా దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఆఫర్‌లు కూడా పెద్దగా రాలేదు. చాలా కంపెనీఉ మార్కెట్ పరిస్థితులను బట్టి ఐపిఒ ప్రక్రియలో ముందుకెళ్లా లని భావిస్తున్నాయి. అయితే తాజాగా పరిస్థితులు సాను కూలంగా మారుతున్నాయి. ఈ నెల్లో అమెరికా టారిఫ్ విషయంలో పరిస్థితులు మారడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, ఇతర పరిణామాల నేపథ్యంలో సూచీలు రాణిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంపెనీ ఐపిఒలు రెడీ అవుతున్నాయి. ఈ నెల మూడో వారంలో ఇప్పటికే బెల్రైజ్‌ఇండస్ట్రీస్, బొరానా వీవ్స్ బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించాయి. చివరి వారంలో మరో నాలుగు ఐపిఒలు మార్కెట్లలో అడుగు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో సోడా ట్యూబ్స్, ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్, లీలా హోటల్స్, ఏజిస్ వొపాక్ టెర్మినల్స్ వంటి కంపెనీలున్నాయి. ఈ యేడాదిలో ఇప్పటి వరకు ఐపిఒ మార్కెట్ ఏమంత ఉత్సాహంగా లేదు. అయితే ఐపిఒకు ముందు ప్రక్రియ విషయంలో మాత్రమే పెద్ద ఎత్తున సెబీకి దరఖాస్తులు, డిఆర్‌హెచ్‌పి పత్రాలు అందాయి. దీన్ని బట్టి కంపెనీలు పబ్లిక్ లిస్టింగ్‌లపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయని తెలుస్తుంది. ఇప్పటికే సెబి వద్ద పత్రాలు సమర్పించిన కంపెనీల్లో ప్రెస్టెజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్, అర్బన్ కంపెనీ ఉన్నాయి. ఇన్‌క్రెడ్, క్యూర్ ఎఐ, డ్యూరో ఫ్లెక్స్, గ్రో, షిప్ రాకెట్ వంటి కొత్త జనరేషన్ కంపెనీలు కూడా మార్కెట్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు 2025లోనే ఐపిఒ ప్రక్రియను ప్రారంభించాలని కొన్ని బడా కంపెనీలు కూడా చూస్తున్నాయి. వాటిలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రూ.40వేల కోట్ల పబ్లిక్ ఇష్యూతో వచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే భారత చరిత్రలోనేఅతిపెద్ద ఐపిఒ కానుంది. టాటాకేపిటల్, ఫోన్‌పే, జెప్టో వంటి పెద్ద కంపెనీల షేర్లు కూడా ఐపిఒ విషయంలో వినిపిస్తున్నాయి. ఫైనాన్స్ రంగంలో హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్లు, హీరో ఫిన్‌కార్ప్ రూ.3,668 కోట్ల నిధులు సమీకరించాలని భావిస్తున్నాయి. సెబి నుంచి ఆమోదం పొందిన ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా కూడా రూ.15వేల కోట్ల విలువైన ఐపిఒకు సిద్ధమవుతోంది.




## వాణిజ్యం

## రికార్డుస్థాయిలో పాలసీల విక్రయం

**న్యూఢిల్లీ, మే 24:** ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి) అరుదైన ఘనతను సాధించింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు ఎల్‌ఐసీ ఓ ప్రకటనలో తెలిపింది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన ఎల్‌ఐసీ పనితీరును గుర్తించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈ అరుదైన రికార్డును నమోదు చేసిందని ఎల్‌ఐసీ పేర్కొంది. దేశ వ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు ఈ ఏడాది జనవరి 20న 5,88,107 లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను జారీ చేసినట్లు ఎల్‌ఐసీ తెలిపింది. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలు జారీ చేయడం ఇదే తొలిసారి. తమ ఏజెంట్లు తమదైన పనితీరుతో ఒక బెంచ్‌మార్క్‌ను సృష్టించారని ఎల్‌ఐసీ పేర్కొంది. ఇది తమ ఏజెట్ల అవిశ్రాంత కృషి, అంకితభావం నిదర్శనమని కొనియాడింది. ఎల్‌ఐసీ కస్టమర్లు, వారి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించాలనే లక్ష్యానికి నిబద్ధతగా నిలుస్తోందని తెలిపింది. ఎల్‌ఐసీ వ్యవస్థాపక దినోత్సవంఅయిన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించకుని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్క పాలసీ అయినా పూర్తి చేయాలన్న ఎల్‌ఐసీఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను ఎల్‌ఐసీసొంతం చేసుకుంది. ఈ అరుదైన మైలు రాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. కస్టమర్లు, ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి ఒక చరిత్రను లిఖించారంటూ సంతోషం వ్యక్తం చేశారు.



## రెండు బ్యాంకులపై ఆర్‌బిఐ జరిమానా

**న్యూఢిల్లీ, మే 24:** బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో విఫలమైనందుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్ (లెండ్‌బాక్స్)పై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా జరిమానా విధించింది. నిబంధనల ప్రకారం నడుచుకోని సంస్థలపై కఠిన చర్యలుంటాయని ఆర్‌బిఐ పేర్కొంది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 నిబంధనలు, పూచీకత్తు లేని వ్యవసాయ రుణాలపై ఆర్‌బిఐ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.63.6 లక్షల జరిమానా విధించింది. నిధుల బదిలీలో జాప్యం, పూచీకత్తు లేని రుణ విధానాల్లో ఉల్లంఘనలు వెలుగులోకి రావడంతో ఈ జరిమానా విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. ముఖ్యంగా వ్యవసాయం వంటి ప్రత్యేక రక్షణ అవసరమయ్యే రంగాల్లో ఆర్థిక సంస్థలు నిర్దే శిత రుణ నిబంధనలకు ఉండేలా చూడా లని ఆర్‌బిఐ తెలిపింది. ఆర్‌బిఐ పీర్-టుపీర్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ డైరెక్షన్స్-2017ను పాటించనందుకు లెండ్‌బాక్స్ బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్ పై రూ.40 లక్షలు జరిమానా విధించింది. దేశ డిజిటల్ లెండింగ్ ఎకోసిస్టమ్‌లో గణనీయమైన వృద్ధిని చూపిన పి2పి లెండిర్ కార్యకలాపాలకు సంబంధించిన లోపాలను సెంట్రల్ బ్యాంకు గుర్తించింది. ఫిన్‌టెక్ కంపెనీలు పారదర్శకత పాటించాలని, వినియోగదారులు, రుణ దాతలను రక్షించడానికి రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని గుర్తుచేసింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14